ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం 5
జిల్లా వార్తలు
బుధవారం 8, మే 2024

జిల్లాలోని కనిగిరి, దర్శి నియోజకవర్గాల్లో రాజకీయ పరిణామాలు మారిపోతున్నాయి. ఆయా వర్గాలలో నెలకొన్న ప్రభుత్వ వ్యతిరేకత, అభివృద్ధి లేమి, అవినీతి వ్యవహారాలు, అంతర్గత కలహాలు వైసీపీకి శాపాలుగా మారాయి. టీడీపీకి కనిగిరిలో అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సేవా కార్యక్రమాలు, అన్న క్యాంటీన్ నిర్వహణ, గతంలో చేసి చూపించిన అభివృద్ధి బలమైంది. ఇటు దర్శిలో టీడీపీ, జనసేన జతకట్టడంతో మారిన సమీకరణలు కూటమి అభ్యర్థి లక్ష్మి పూర్తిగా నిలదొక్కుకునేందుకు దోహదపడింది. కనిగిరిలో వైసీపీ అభ్యర్థి దద్దాలకు రాజకీయ అనుభవం లేకపోవడంతోపాటు భూవివాదాల్లో అతని పాత్రపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, ఎమ్మెల్యే బుర్రా అనుచరగణం సహకరించకపోవడం ఇబ్బందికరంగా మారాయి. దర్శిలో వైసీపీ అభ్యర్థి శివప్రసాద్‌రెడ్డికి రాజకీయ శత్రువులు గణనీయ సంఖ్యలో ఉన్నారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి అనుచరగణంలో 90శాతం మంది బూచేపల్లికి వ్యతిరేకంగా పనిచేయడం స్పష్టంగా కనిపిస్తోంది.



ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన పీసీపల్లి మండలం నేరేడుపల్లి గ్రామస్థులు

మార్పు ఖాయం

- మలుపు తిరుగుతున్న ఆ రెండు నియోజకవర్గాలు
- కనిగిరిలో అన్నింటా ముందున్న డాక్టర్ ఉగ్ర
- దర్శిలో శరవేగంగా మారుతున్న సమీకరణలు
- రెండుచోట్లా టీడీపీ, జనసేనలు ఐక్యంగా ముందడుగు
- రెండుస్థానాల్లోనూ వైసీపీలో అంతఃకలహాలు
- ఎమ్మెల్యేల నుంచి అధికార పార్టీకి లభించని సహకారం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలోని పశ్చిమప్రాంతంలో కలిసి ఉండే కనిగిరి, దర్శి నియోజకవర్గాల్లో గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు గెలుపొందారు. అయితే రాష్ట్రస్థాయి సమస్యలను అటుంచితే స్థానికంగా రెండుచోట్లా జరిగిన అభివృద్ధి శూన్యం. గత ఐదేళ్లుగా అధికారపార్టీలో గ్రూపు తగాదాలు కొనసాగాయి. అవినీతి వ్యవహారాలు ముమ్మరంగానే జరిగాయి. వర్గపోరుతో చిన్నపాటి అభివృద్ధి పనులపై కూడా ఇరువర్గాల వారు పోటీపడటంతో అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఈసారి రెండుచోట్లా అభ్యర్థులను మార్చిన జగన్ ఆ విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించలేకపోయారు. ఈ నేపథ్యంలో తాజా పరిస్థితులను పరిశీలిస్తే కనిగిరిలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నివిభాగాల్లో దూసుకుపోతున్నారు. అనేక అంశాలు ఆయనకు సానుకూలంగా మారి గెలుపుదిశగా పయనిస్తున్నారు. దర్శిలో గొట్టిపాటి కుటుంబానికి చెందిన మహిళా డాక్టర్‌ను రంగంలోకి దింపడం ద్వారా తెలుగుదేశం పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. తాజాగా ఇక్కడ పోటీ నువ్వానేనా అన్నట్లు ఉన్నా మారుతున్న సమీకరణలు వైసీపీ నేతలను బెంబేలెత్తిస్తున్నాయి.

కలిసొచ్చిన మాగుంట రాక

టీడీపీ ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డి రంగంలోకి రావడం కనిగిరి, దర్శి అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా పార్టీకి కలిసొచ్చింది. ఈ రెండు నియోజకవర్గాలతో మాగుంట కుటుంబానికి ప్రారంభం నుంచి మంచి సంబంధాలున్నాయి. 1990 దశకంలో మంచినీటి సమస్య నివారణకు ట్యాంకర్ల ద్వారా నీటిని ఇవ్వడం ద్వారా అక్కడి ప్రజలకు చేరువయ్యారు. ఆయన ప్రస్తుతం టీడీపీ అభ్యర్థి కావడంతో తటస్థంగా ఉండే వివిధ రంగాల ప్రముఖులతోపాటు వైసీపీలోని రెడ్డి సామాజిక వర్గం నేతలు టీడీపీకి మద్దతు తెలిపారు. పోటీ తీవ్రంగా ఉన్న దర్శి, కనిగిరి ప్రాంతాల్లో మాగుంట రాఘవరెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో టీడీపీలోకి వలసల పర్వం కొనసాగుతోంది. దొనకొండ, ముండ్లమూరు మండలాల్లో కీలక నేతలు పార్టీలోకి రావడం, తాళ్లూరు మండలంలో కొందరు వైసీపీ నేతలు పరోక్ష మద్దతు ప్రకటించడం కలిసొస్తోంది.



ముండ్లమూరు మండలం కెల్లంపల్లిలో రోడ్‌షో నిర్వహిస్తున్న దర్శి టీడీపీ అభ్యర్థి డాక్టర్ లక్ష్మి

టీడీపీకి మద్దతుగా వివిధ సామాజికవర్గాలు

కనిగిరి నియోజకవర్గంలో యాదవ సామాజికవర్గం ఓటర్లు 26,561 మంది, రెడ్డి ఓటర్లు 42,860 మంది ఉన్నారు. వీటిలో టీడీపీకి సగానికి సగం లభించే అవకాశం ఉంది. ఇతర బీసీ ఓటర్లు 25వేల మంది వరకు ఉండగా రజక, వడ్డెర్లలో టీడీపీకి ఆధిక్యం కనిపిస్తోంది. జనసేన కలయికతో కాపు సామాజికవర్గం ఓటర్లు పూర్తిస్థాయిలో టీడీపీకి మద్దతిస్తున్నారు. కనిగిరి, పామూరులో ముస్లింలలో వ్యక్తిగత పరిచయాల ద్వారా డాక్టరు ఉగ్రకు 60శాతంకుపైగా ఓట్లుపడే అవకాశం స్పష్టంగా ఉంది. కమ్మ, వైశ్య ఓట్లు 25వేలు వరకు ఉండగా పూర్తి ఆధిక్యత టీడీపీకి కనిపిస్తోంది. దళితుల్లో మాదిగలు 37వేల మంది, మాలలు 15వేల మంది ఉన్నారు. మాదిగల్లో ఎన్డీఏ అనుకూల వాతావరణం నెలకొనడం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. ఆయా సామాజికవర్గాలకు అతీతంగా చూస్తే నియోజకవర్గంలో 60వేల మంది వలస ఓటర్లు ఉన్నారు. దేశంలోని అనేకప్రాంతాల్లో ఉన్న ఈ ఓటర్లతో డాక్టర్ ఉగ్రకు మంచి సంబంధాలు ఉండటం కలిసిరానుంది.

కనిగిరిలో ఉగ్రకు అనుకూల వాతావరణం

కనిగిరిలో గత మూడేళ్ల నుంచి మారుతున్న సమీకరణలు టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్రకు అనుకూల వాతావరణాన్ని నెలకొల్పాయి. 2009లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొంది కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ఆయన చేయగలిగారు. 2019లో టీడీపీ అభ్యర్థిగా రంగంలోకి వచ్చి ఓటమి చవిచూసినా నియోజకవర్గాన్ని వీడలేదు. 2008 నుంచి ఇప్పటివరకు 50 వేలమందికి కంటి వైద్య చికిత్సలు చేయించి వ్యక్తిగత అభిమానాన్ని చూరగొన్నారు. గుంటూరులోని తన వైద్యశాల ద్వారా నియోజకవర్గంలోని పేదరోగులకు భారం లేని వైద్యసేవలు అందించడం, కరోనా సమయంలో ఇచ్చిన చేయూత ఆయనకు కలిసొచ్చాయి. గత రెండేళ్ల నుంచి కనిగిరిలో అన్న క్యాంటీన్ నిర్వహణ మంచిపేరు తెచ్చిపెట్టింది. మరోవైపు వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణ 2022లో జడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా అనేక వివాదాల్లో ఆయన చిక్కుకున్నారు. సరైన అనుభవం లేకపోవడం, నాయకత్వలేమితో ఎదురీదుతున్న ఆయన.. పార్టీ బలం పైనే ఆధారపడ్డారు. ఎమ్మెల్యే వ్యతిరేకవర్గంలో కొందరు యాక్టివ్‌గా పనిచేస్తుండగా బుర్రా అనుచరగణం వైసీపీకి పూర్తిగా దూరమైంది. తద్వారా యాదవ సామాజికవర్గం ఓటర్లలో చీలిక ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఆవర్గంలో అంతో ఇంతో ఆధిక్యత వైసీపీకే ఉన్నప్పటికీ కీలకమైన రెడ్డి సామాజికవర్గంలో మార్పు చోటుచేసుకుంది. అది టీడీపీకి లాభించనుంది.

దర్శిలో రెండు వర్గాలు కలిస్తే వార్ వన్‌సైడే

దర్శిలో రాజకీయ సమీకరణలు శరవేగంగా మారుతున్నాయి. కాపు సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యే మద్దిశెట్టిని పక్కనపెట్టి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని వైసీపీ రంగంలోకి తెచ్చింది. ఇప్పటికీ ఆయన తల్లి జడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్నప్పటికీ శివప్రసాద్‌రెడ్డికి టికెట్ ఇవ్వడం వైసీపీలోని ఎమ్మెల్యే వర్గీయులకు మింగుడు పడ లేదు. గత నాలుగేళ్లుగా ఇటు ఎమ్మెల్యే మద్దిశెట్టి, అటు బూచేపల్లి మధ్య పోరు సాగింది. ఎమ్మెల్యే అనుచరగణంలో 90శాతం మంది బూచేపల్లికి వ్యతిరేకంగా నిలబడ్డారు. వారిలో అత్యధికులు టీడీపీ, జనసేనలలో చేరగా.. కొందరు సైలెంట్ అయ్యారు. దొనకొండ, ముండ్లమూరు మండలాల్లో రెడ్డి నాయకులు కూడా వైసీపీని వీడి టీడీపీలో చేరగా, తాళ్లూరు మండలంలో కొందరు సైలెంట్ అయ్యారు. ఇక సామాజిక సమీకరణలు చూస్తే నియోజకవర్గంలో రెడ్డి, కమ్మ, కాపు సామాజికవర్గాలు బలమైనవి. రెడ్డి ఓటర్లు సుమారు 39వేలమంది ఉండగా కమ్మ, కాపు సామాజిక వర్గం ఓటర్లు దాదాపు సమానంగా ఇరువర్గాలు కలిపితే 55వేలమందికిపైగా ఉన్నారు. దళితుల్లో మాదిగలదే అగ్రభాగం. బీసీలలో యాదవులు, వడ్డెర, రజక తదితరులు ఉన్నారు. ముస్లింలు 12వేల మంది, ఆర్యవైశ్యులు 6500 మంది ఉన్నారు. ఈ నియోజకవర్గంలో కమ్మ, కాపు సామాజిక వర్గాల మధ్య ఐక్యత అధికంగా ఉంటుంది. ఈ రెండు వర్గాల వారు కలిసికట్టుగా పనిచేసిన ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెసేతర పార్టీలకే విజయం లభిస్తుంది. మొన్నటికి మొన్న దర్శి నగర పంచాయతీ ఎన్నికల్లో అధికార వైసీపీని కంగు తినిపించి టీడీపీ గెలిచి చరిత్ర సృష్టించింది. ప్రస్తుతం జనసేన, టీడీపీల కలయికతో ఆరెండు సామాజికవర్గాల వారు పూర్తి ఐక్యతతో ముందడుగు వేస్తున్నారు.

డాక్టరమ్మ నాడి పట్టేశారు

రెడ్డి సామాజికవర్గంలో వైసీపీకి ఆధిక్యత ఉన్నా రెండు మండలాల్లో బలమైన నాయకులు వెళ్లిపోవడం, కొందరు సైలెంట్ కావడం, గత స్థానిక సంస్థల ఎన్నికల్లో శివప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్యే వ్యతిరేకవర్గానికి గ్రామాల్లో సహకరించటంలాంటి అంశాలతో ఆ ఓటర్లలో చీలిక కనిపిస్తోంది. వీటికితోడు టీడీపీ అభ్యర్థి ఎంపికలోనూ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. మహిళా అభ్యర్థిని, డాక్టర్ అందునా ఆ నియోజకవర్గంతో మంచి అనుబంధం ఉన్న గొట్టిపాటి కుటుంబం నుంచి లక్ష్మిని ఎంపికచేసింది. ఆమె ప్రజలతో మమేకమవుతున్నారు. ముఖ్యంగా మహిళలను ఆకట్టుకుం టున్నారు. కూటమి శ్రేణులు సమష్టిగా పనిచేయడంతోపాటు ఏవిషయం లోనూ వెనుకంజ వేయడం లేదు. అటు చంద్రబాబు నేరుగా దర్శి వచ్చి సభ పెట్టడం, ఇటు పవన్‌కల్యాణ్ కూడా రానుండటం వారికి కలిసొచ్చింది. ఆర్థిక అంశాలలోనూ టీడీపీ శ్రేణులు ఢీ అంటే ఢీ అంటుండటంతో గాలి మారిపోతోంది. దీంతో పోటీ నువ్వానేనా అన్నట్లు ఉన్నప్పటికీ టీడీపీ విజయానికి అనుగుణంగా బెట్టింగ్‌లు ప్రారంభం కావడం విశేషం.

ఓటుకు రేటు

- వారికి రూ.5వేలు, జనానికి రూ.3వేలు
- ఒంగోలు, అద్దంకిలో శ్రీకారం
- మిగిలిన చోట్ల నేడో, రేపో పంపిణీ

భారీ ప్రలోభాలకు తెరతీసిన వైసీపీ

(ఒంగోలు, ఆంధ్రజ్యోతి)

పోలింగ్‌కు తేదీ దగ్గరపడే కొద్దీ టీడీపీ కూటమి అనుకూల, ప్రభుత్వ వ్యతిరేక ఓటర్లు బయటపడుతున్నారు. దీంతో ఆ ప్రభావాన్ని తగ్గించేందుకు భారీ ప్రలోభాలకు అధికార వైసీపీ తెరతీసింది. కొన్ని కీలక నియోజకవర్గాల్లో ఓస్థాయిలో ఓట్ల కొనుగోలుకు ఆ పార్టీ నాయకులు తెగబడుతున్నారు. మిగిలిన చోట్ల ఉన్నంతలోనే సర్దుకుపోవాలన్న తరహాలో వేచిచూస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అనేకచోట్ల సోమవారం రాత్రి డబ్బుల పంపిణీకి వైసీపీ శ్రీకారం పలికింది. ప్రధానంగా ఒంగోలు, అద్దంకి నియోజకవర్గాలలో ఆపార్టీ నాయకులు ఈ వ్యవహారానికి తెరతీశారు. ముందు ఉద్యోగుల ఓట్ల కొనుగోలుకు ఓటుకు రూ.5వేల చొప్పున పంపిణీ చేసిన విషయం విదితమే. ఉపాధ్యాయ ఓటర్లు ప్రలోభాలకు లొంగలేదు. ఇతర ఉద్యోగులలో వైసీపీ వారు ఇచ్చే డబ్బులకు కొంతమంది సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్న ఉద్యోగులు కొందరు టీడీపీ శ్రేణులు ఎంత ఇచ్చినా తీసుకొని వారికి మద్దతుగా నిలిచారు. ఒంగోలు, అద్దంకి, దర్శిల్లో ఒక్కో ఉద్యోగికి వైసీపీ నేతలు రూ.5వేలు చెల్లించినప్పటికీ ఏరికోరి కొందరికి మాత్రమే ఇచ్చారు. అయినా ఉద్యోగుల నుంచి కనీస సానుకూలత రాకపోవడంతో సాధారణ ఓటర్ల ప్రలోభాల పర్వాన్ని ప్రారంభించారు.

మొదలైన డబ్బుల పంపిణీ

ఒంగోలు, అద్దంకి నియోజకవర్గాల్లో సోమవారం రాత్రి ఓటుకు రూ.3వేలు ఇచ్చేందుకు వైసీపీ నాయకులు శ్రీకారం పలికారు. అద్దంకి నియోజకవర్గంలోని ఓ గ్రామంలో అలా పంపిణీ చేస్తుండగా ఓటు రేటు పెంచాలని కేడర్ డిమాండ్ చేయడంతో అక్కడి వరకే పూర్తి చేసి మిగిలిన గ్రామాలకు రేపోమాపో పంపిస్తామని వైసీపీ అభ్యర్థి ముఖం చాటేసినట్లు సమాచారం. ఒంగోలులో వైసీపీ మద్దతుదారులు సోమవారం రాత్రి నుంచి పంపిణీ ప్రారంభించి మంగళవారం కూడా కొనసాగించారు. ఉద్యోగులలో స్పష్టంగా కనిపించిన వ్యతిరేకత, తటస్థ ఓటర్లలో టీడీపీ అనుకూల వాతావరణం బహిర్గతం కావడంతో వైసీపీ నాయకులు ఓట్ల కొనుగోలుకి భారీ రేటు పెట్టారని ప్రచారం జరుగుతోంది. ఒంగోలులో 2.4 లక్షల ఓటర్లు ఉండగా కనీసం 2లక్షల మందికి రూ.3వేల ప్రకారం ఇచ్చినా రూ.60కోట్లు అవుతుంది. ఇప్పటికే కార్పొరేషన్‌లో ఒక్కో కార్పొరేటర్‌కి రూ.3 లక్షలు, వైసీపీ డివిజన్ అధ్యక్షుడికి రూ.లక్ష, కార్యాలయాల నిర్వహణకు లక్ష ప్రకారం ఒక్కో డివిజన్‌కు రూ.5లక్షలు ఇచ్చారు. ఇతరత్రా ఖర్చులు పరిగణనలోకి తీసుకుంటే ఒంగోలు అసెంబ్లీలో రూ.100 కోట్ల వరకూ ఖర్చుపెట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అందిన సమాచారం మేరకు.. ఉమ్మడి జిల్లాలో ఆయా నియోజకవర్గాల అభ్యర్థుల ఆర్థిక పరిస్థితిని బట్టి ఓటు రేటు కనిష్ఠంగా రూ. 2000 పలికే పరిస్థితి కనిపిస్తోంది.



పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు చెల్లించినంత ఇవ్వాలని డిమాండ్

పోస్టల్ బ్యాలెట్ కలిగిన ఉద్యోగ ఓటర్లకు రూ.5వేలు ఇచ్చి మాకు రూ.3వేలు ఇవ్వడమేంటంటూ సామాన్య ఓటర్లు వైసీపీ నేతలను నిలదీస్తున్నారు. ఇది వారికి ఇబ్బందికరంగా మారింది. ప్రత్యేకించి అద్దంకి నియోజకవర్గంలో సాధారణ ఓటర్లకు కూడా రూ.5వేల ప్రకారం ఇవ్వాల్సిందేనని ఆ పార్టీలోని గ్రామస్థాయి నాయకులు ఒత్తిడి పెంచినట్లు తెలిసింది. అలా ఇస్తేనే పంచుతాం, లేదంటే లేదని కొన్ని గ్రామాల్లో నాయకులు అభ్యర్థికి సమాచారం పంపినట్లు కూడా తెలిసింది. ఒక్కసారి ఓటుకు రూ.2వేలు ప్రకారం పెంచితే కనీసం రూ.20కోట్లు సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. దీంతో అద్దంకి వైసీపీ అభ్యర్థి సోమవారం రాత్రి ప్రారంభించిన పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిలిపివేశారు.



ఒంగోలులో నిర్వహించిన ముస్లింల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న షరీఫ్, వేదికపై మాగుంట, జనార్దన్

ముస్లింల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

- శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్
- ముస్లింలతో దామచర్ల, మాగుంట ఆత్మీయ సమావేశం

ఒంగోలు(కార్పొరేషన్), మే 7: ముస్లింల సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ.షరీఫ్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని 4వ డివిజన్‌లో ముస్లింలతో టీడీపీ అభ్యర్థులు దామచర్ల జనార్దన్, మాగుంట ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన షరీఫ్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే ముస్లింలకు రాజకీయంగా పెద్దపీట వేశారన్నారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి రాగానే 2014లో అమలుచేసిన పథకాలన్నీ పునరుద్ధరిస్తామని తెలిపారు. ఒంగోలు ఎంపీ, టీడీపీ కూటమి పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో అనేక ఇబ్బందులు పడిన ముస్లింలు రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి, చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విలువైన ఓటును సైకిల్ గుర్తుకు వేసి, ఎమ్మెల్యేగా దామచర్ల జనార్దన్‌ను, ఎంపీగా తనను గెలిపించాలని కోరారు. దామచర్ల మాట్లాడుతూ నియోజకవర్గంలో ముస్లింల సమస్యల పరిష్కారానికి టీడీపీ అత్యధిక నిధులు కేటాయించిందని తెలిపారు. షాదీఖానా నిర్మాణం, ఖబరస్థాన్‌లు, ఈద్గాల అభివృద్ధితోపాటు దుల్హన్ పథకం, హజ్ యాత్రలకు నిధులు కేటాయించి ముస్లిం సంక్షేమానికి పెద్దపీట వేసింది టీడీపీనేనన్నారు. రంజాన్ తోఫాతోపాటు మైనారిటీ కార్పొరేషన్ ద్వారా అనేక నిధులు కేటాయించి, వృత్తి నైపుణ్యాలను పెంచిందన్నారు. ఉపాధి మార్గాలకు ఆసరాగా నిలిచిన ఘనత టీడీపీదే అన్నారు. మైనార్టీలకు చెందిన ఎండీ షరీఫ్‌ను మండలి చైర్మన్‌గా, లాల్‌జాన్ బాషాను ఎంపీగా చేయడంతోపాటు పలువురికి రాజకీయంగా అనేక పదవులు కేటాయించి వారిని అన్ని విధాలా ప్రోత్సహించారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ముస్లింలు నివసించే ప్రాంతాలలో రోడ్లు వేయించడంతోపాటు తాగునీటి సమస్యను పరిష్కరించానని గుర్తుచేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, బీజేపీ నాయకులు యోగయ్యయాదవ్, షేక్ కపిల్‌బాషా, పఠాన్ హనీఫ్‌ఖాన్, అన్వర్, సిలార్, 4వ డివిజన్ కార్పొరేటర్ నూర్జహాన్, అన్వర్ బాబు పాల్గొన్నారు. పలువురు ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో జనార్దన్‌ను ఎమ్మెల్యేగా, మాగుంటను ఎంపీగా గెలిపించుకుంటామని తెలిపారు. స్థానికులు టీడీపీ కూటమి అభ్యర్థులను ఘనంగా ఆహ్వానించారు.

అధరహో

పొగాకు కిలో రూ.300

- పొదిలి వేలం కేంద్రంలో లభించిన గరిష్ఠ ధర
- బోర్డు చరిత్రలోనే దక్షిణాదిలో ఇదే అధికం
- ఒంగోలు-1లో రూ.301పలికినా తిరస్కరణ



ఒంగోలు, మే 7 (ఆంధ్రజ్యోతి) : పొగాకు మార్కెట్ మురిపిస్తోంది. పలు రకాల గ్రేడ్‌లకు రికార్డు స్థాయి ధరలు లభిస్తున్నాయి. మంగళవారం మేలు రకం ఏకంగా కిలో రూ.300 పలికింది. పొగాకు బోర్డు చరిత్రలోనే దక్షిణాదిలో ఇంత ధర లభించడం ఇదే ప్రథమం. పొదిలి కేంద్రంలో ఈ రేటు ఇవ్వగా, ఒంగోలు-1 కేంద్రంలో ఒక బేలు కిలో రూ.300, మరో బేలు రూ.301 పలికాయి. అయితే ఆ బేళ్లలో కొంత పొగాకు బాగాలేదన్న సాకు చూపి వాటిని కొనుగోలు చేసిన కంపెనీ రిజెక్ట్ (సీఆర్)గా ప్రకటించింది. అందుకు అక్కడి వేలం నిర్వహణాధికారులు అంగీకరించడంతో ఆ ధరలు రద్దయ్యాయి, దీంతో పొదిలిలో లభించిన కిలో రూ.300 అధిక ధర అయ్యింది. ఇతర కేంద్రాల్లో గరిష్ఠ ధరలు కిలో రూ.299 వద్ద నిలిచిపోయాయి. అదేసమయంలో లోగ్రేడ్‌లో నాణ్యమైన బ్రౌన్ రకం రేటు కూడా కిలో రూ.265 నుంచి 270 వరకూ పలుకుతోంది. ఇటు మేలురకం, అటు బ్రౌన్ రకం గ్రేడ్‌ల బేళ్ల కోసం పలు కంపెనీల బయ్యర్లు పోటీపడుతున్నారు. దక్షిణాదిలో ప్రస్తుత సీజన్‌లో ఇప్పటి వరకూ సుమారు 42 మిలియన్ కిలోల పొగాకు విక్రయాలు జరగ్గా సగటున కిలోకు రూ.231 ధర లభించింది.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.3

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : ....ఫోన్ నెం. ....

ప్రకాశం ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. ఒంగోలు				
2. కొండపి				
3. కనిగిరి				
4. దర్శి				
5. మార్కాపురం				
6. గిద్దలూరు				
7. ఎర్రగొండపాలెం				
8. సంతనూతలపాడు				
9. అద్దంకి				
10. పర్చూరు				
11. చీరాల				
12. కందుకూరు				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

బ్రాంచి మేనేజర్, ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వే నెంబరు 206/2.3
చీరాల రోడ్డు, త్రోవగుంట, ఒంగోలు రూరల్(మండలం), ప్రకాశం జిల్లా -523262.

*షరతులు వర్తిస్తాయి

మాటలు కాదు..అభివృద్ధి చేసి చూపించా..!

- మరోసారి ఎమ్మెల్యేగా ఆదరించండి
- ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధికి మనసావాచ కృషి చేస్తా..
- టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల హామీ
- వైసీపీ నుంచి భారీగా తెలుగుదేశంలో చేరికలు



దామచర్ల, మాగుంట శ్రీనివాసులురెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన 16వ డివిజన్ నాయకులు



దామచర్ల జనార్దన్ సమక్షంలో టీడీపీలో చేరిన 45వ డివిజన్ మహిళలు

ఒంగోలు(కార్పొరేషన్), మే 7: తాను మాటలు చెప్పే నేతను కాదని, చేతలు చూపించే వ్యక్తిగా మీ ముందుకు వచ్చానని, గతంలో ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపించినందుకే నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని, త్వరలో జరిగే ఎన్నికల్లో తనను మరోసారి ఎమ్మెల్యేగా ఆదరించాలని, మనసావాచ మీ అందరి సంక్షేమం కోసం పని చేస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక 16వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకులు ఉంగరాల మురళీ తన అనుచరులు మరో వందమందితో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మురళీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి టీడీపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, దామచర్ల జనార్ధన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ వైఫల్యాలపై విసుగు చెందిన ఆ పార్టీ శ్రేణులు టీడీపీలోకి రావడం శుభ పరిణామని చెప్పారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అందరికీ ప్రాధాన్యత ఇచ్చి అన్ని వేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. అలాగే డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా గతంలో చేసిన అభివృద్ధిని ఒక్కసారి చూడాలని దామచర్ల కోరారు. నగరంలో ప్రతి రోజు తాగునీరు అందించడానికి అవసరమై నిధులు సాధిస్తానని తెలిపారు. గతంలో గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి రూ.163 కోట్లు నిధులు తీసుకొచ్చి 80 శాతం పనులు పూర్తి చేశానని, ఈ ఐదేళ్లలో వైసీపీ ఆ పనులు పూర్తి చేయలేకపోయిందని తెలిపారు. అలాగే టీడీపీ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా పేదలకు పక్కా ఇళ్ళు ఇవ్వాలని వేల గృహాలు మంజూరు చేశామని, అయితే పేదల గృహాలపై పగ పట్టిన వైసీపీ వాటిని ఒక్క అంగుళం కూడా పనులు పూర్తి చేయలేక పోయిందన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని, చంద్రబాబు ముఖ్యమంత్రిగా వచ్చిన తర్వాత టిడ్కో ఇల్లు పూర్తి చేసి, అందరికీ అందజేస్తామని తెలిపారు. అలాగే ఇంకా నివాస స్థలం లేని వారికి 2 సెంట్లు భూమి ఇస్తామని చెప్పారు. కూటమి తరుపున పోటీ చేస్తున్న తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా మాగుంటను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని దామచర్ల కోరారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని దామచర్లకు ఘనంగా స్వాగతం పలికారు.

45వ డివిజన్ వైసీపీ మహిళలు చేరిక

నగరంలోని 45వ డివిజన్‌కు చెందిన పలువురు వైసీపీ మహిళలు తెలుగుదేశం పార్టీలో చేరారు. మంగళవారం దామచర్ల నివాసంలో కలిసి ఒంగోలు అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. వైసీపీని వదిలి టీడీపీలోకి చేరడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈనెల 13న జరిగే ఎన్నికలలో సైకిల్ గుర్తుకు ఓటు వేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో టీడీపీలోకి రావడం తో గెలుపు ఖాయమన్నారు.

కొత్తపట్నం మండలంలో ప్రచారం

కొత్తపట్నం(ఒంగోలునగరం) : త్వరలో జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటేసి గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ కోరారు. మంగళవారం మండలంలోని ఆలూరు, గాదెపాలెం, బీరంగుంట గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోయిందన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా ఒంగోలు నియోజకవర్గంలో అభివృద్ధిపథంలో దూసుకుపోయిందని, వైసీపీ వచ్చాక పట్టించుకున్న వారే లేరని విమర్శించారు. తీర ప్రాంత గ్రామాల్లో అభివృద్ధి గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. మత్స్యకారులు, సన్న, చిన్నకారు రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాగా ప్రచారానికి మండలానికి వస్తున్న దామచర్లకు టీడీపీ నాయకులు కొప్పోలు గ్రామం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట నాయకులు గేనంసుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షులు ద్వారబాకుల శ్రీనివాసరెడ్డి, దాసరి పోలయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సర్వీసు క్రమబద్ధీకరణ ప్రారంభం

- 10వతేదీ వరకూ కొనసాగనున్న ప్రక్రియ

ఒంగోలు (విద్య), మే 7 : జిల్లాలో డీఎస్సీ ద్వారా ఎంపికైన టీచర్ల సర్వీసు క్రమబద్ధీకరణ మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఆరు ప్రత్యేక బృందాలు ఒంగోలులోని సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో ఈ ప్రక్రియను చేపట్టాయి. స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులు, సెకండరీ గ్రేడ్ టీచర్ల వివరాలు, వారి సర్వీసు రిజిస్టర్లు, ప్రొబేషన్ డిక్లరేషన్ ఫారాలను పరిశీలించాయి. వివరాలను ప్రత్యేకంగా ఒక షీట్‌లో నమోదు చేశాయి. ఈనెల 10 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని డీఈవో సుభద్ర తెలిపారు.

కూటమి విజయానికి పాటుపడాలి

- మాజీ ఎమ్మెల్యే బాచిన



సమావేశంలో పాల్గొన్న గరటయ్య, జయంత్‌బాబు

మద్దిపాడు, మే 7: టీడీపీ కూటమి విజయానికి పాటుపడాలని మాజీ ఎమ్మెల్యే, సంతనూతలపాడు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు బాచిన చెంచుగరటయ్య పేర్కొన్నారు. మంగళవారం మద్దిపాడులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కుతో అవినీతిపరులైన వైసీపీ నాయకులను పారదోలాలని కోరారు. టీడీపీ కూటమితోనే ప్రగతి సాధ్యమని, చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేసేంతవరకు ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మండవ రంగారావు మాట్లాడుతూ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్ గెలుపుకోసం కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో సాధినేని మస్తాన్‌రావు, వడ్డంపూడి శ్రీనివాసరావు, దేవబత్తెన ప్రసాదరావు, ముత్తనపల్లి రామలింగయ్య, చింతల శ్రీనివాసరావు, రావి నరసింహారావు, మండవ గోపీనాథ్, కడియాల రఘుబాబు, శుద్దపల్లి అనిల్, డొప్ప శేషయ్య మండపల్లి శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులతో పోతుల సమావేశం



శేషయ్యతో మాట్లాడుతున్న పోతుల రామారావు

నాగులుప్పలపాడు, మే 7: సంతనూతలపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు మంగళవారం నాగులుప్పలపాడుకు చెందిన టీడీపీ నాయకులు మారెళ్ళ వెంకట శేషయ్య, మారెళ్ళ కిరణ్ కుమార్‌తో సమావేశమయ్యారు. త్వరలో జరిగే ఎన్నికల్లో కూటమి అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్ గెలుపుపై పలు విషయాలను వారితో చర్చించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయాలి



బైక్ ర్యాలీలో పాల్గొన్న అధికారులు, యువత

చీమకుర్తి, మే7 : ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని స్వీప్ అధికారులు కోరారు. ఓటుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ స్వీప్ ప్రకాశం ఆధ్వర్యంలో మంగళవారం చీమకుర్తిలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. తదుపరి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఈశ్వరరాజు, ఎంపీడీవోలు రాఘవేంద్ర, శ్రీహరి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నగరంలో మోస్తరు వర్షం

- ఉక్కపోత నుంచి ఉపశమనం



జోరుగా కురుస్తున్న వర్షం

ఒంగోలు(కార్పొ రేషన్), మే 7 : గత కొద్దిరోజులుగా తీవ్ర ఎండ ప్రభావంతో తల్లడిల్లుతున్న ఒంగోలు నగర ప్రజలకు ఒక్కసారిగా కురిసిన వర్షానికి ఉపశమనం లభించింది. మంగళవారం పగటి పూట ఎండ ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు పడగా, సాయంత్రం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. మేఘాలు కమ్మి, చల్లని వాతావరణం కనిపించగా, రాత్రి 10గంటల తర్వాత ఉరుములతో కూడిన జల్లులు పడ్డాయి. అయితే క్రమేణా గంటసేపు ఏకధాటిగా కురిసిన వానకు వాతావరణం చల్లబడి ఉక్కపోతల నుంచి ఉపశమనం కలిగించింది.

సంక్షేమపాలన చంద్రబాబుతోనే సాధ్యం

టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్ • సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి • తెలుగుదేశంలోకి కొనసాగుతున్న చేరికలు



పార్టీలో చేరిన చీర్వానుప్పలపాడువాసులతో విజయ్‌కుమార్



కేవీ.పాలెం నుంచి పార్టీలో చేరిన వారితో బీఎన్

నాగులుప్పలపాడు మే 7: ప్రజా సంక్షేమపాలన చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చీర్వానుప్పలపాడు, మాచవరం, రాపర్ల, బి.నిడమానూరు, తిమ్మసముద్రం గ్రామాలలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ తమ స్వార్థం కోసమే పాకులాడుతున్న వైసీపీ నాయకులను ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని ఆయన చెప్పారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌ను ఆధునీకరించి రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు తెలుగుదేశం వెన్నుదన్నుగా నిలిచిందని చెప్పారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, తేనేటి కృష్ణప్రసాద్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు.

టీడీపీలో చేరికలు

మాచవరం ఎస్సీకాలనీకి చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరగా వారికి బీఎన్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. చీర్వానుప్పలపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కొల్లూరి మారుతీతో పాటు మరో 20 కుటుంబాలు బీఎస్.విజయ్‌కుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికి పార్టీ కండువాలు కప్పి ఆయన సాదరంగా ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మ్మెల్యే యామినిబాల, అడకా స్వాములు, గుమ్మడి సాయిబాబా, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి, మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్ కుమార్, కార్యదర్శి కాకర్ల లక్ష్మీవర ప్రసాద్, ఇంటూరి శ్రీనివాసరావు, గుమ్మడి సాయిబాబా, షేక్ ఖాజావలి, పీకా బైరాగి, బెల్లం సురేంద్ర, గుమ్మడి విజయ్, డాకా శ్రీనివాసరెడ్డి, మంగమూరి మధు, ముద్దన రవి, పీకా అశోక్, బి.సెల్వం, మెట్టు సుబ్బయ్యనాయుడు, స్వర్ణ కిషోర్‌బాబు, జనసేన మండల అధ్యక్షులు భూపతి మురళీమోహన్, కొణిజేటి ధనుష్, సాయి, షేక్ ఖాజావలి, కనపర్తి చిన్న, మేడికొండ మురళీ, పొద శ్రీధర్, చుండూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి మండలం నుంచి..

చీమకుర్తి: మండలంలోని పలు గ్రామాల్లో వైసీపీ నుంచి తెలుగుదేశంపార్టీలో భారీగా చేరికలు జరిగాయి. కూనంనేవారిపాలెం నుంచి 15కుటుంబాలు పుట్టా బ్రహ్మయ్య, పుట్టా సుబ్బారావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. మంగళవారం ఒంగోలులోని బీఎస్ కార్యాలయంలో వీరందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో పుట్టా సునీల్‌కుమార్, శ్రీనివాసరావు, వేమా శ్రీనివాసరావు, బత్తుల కొండలరావు తదితరులు పాల్గొన్నారు. చినరావిపాడు గ్రామం నుంచి దర్శవరపు బ్రహ్మయ్య, దాసరి నరేష్ ఆధ్వర్యంలో 15కుటుంబాలు బీఎస్.విజయ్‌కుమార్ సమక్షంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



చినరావిపాడు నాయకులతో బీన్

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

ఇప్పటికే 14.46లక్షల మంది ఓటర్లకు స్లిప్పులు • మరో రెండు రోజుల్లో మిగిలిన వారికీ పంపిణీ

సిబ్బంది, సామగ్రి తరలింపునకు 486 వాహనాల ఏర్పాటు • కలెక్టర్ దినేష్‌కుమార్ వెల్లడి



మాట్లాడుతున్న దినేష్‌కుమార్

ఒంగోలు (కలెక్టరేట్), మే 7 : జిల్లాలో ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఒంగోలు పార్లమెంట్‌తోపాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. జిల్లాలో 18,22,470 మంది ఓటర్లు ఉండగా ఇప్పటి వరకూ 14.46 లక్షల మందికి స్లిప్పులను పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి రెండు రోజుల్లో పూర్తిచేస్తామన్నారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో హోం ఓటింగ్‌తో కలిపి 22,183 పోస్టల్ బ్యాలెట్‌లు ఉండగా ఈనెల 6వతేదీ నాటికి 16,215 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు చేసేందుకు, సందేహాల నివృత్తి కోసం కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దానికి 08592-288599 నెంబరును కేటాయించినట్లు తెలిపారు.

రూ.3.83కోట్ల నగదు, మద్యం సీజ్

జిల్లాలోని ఆయా నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఈనెల 12న పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది, సామగ్రిని తరలించేందుకు 486 వాహనాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది రాత్రికి బస చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సీ-విజిల్ ద్వారా 885 ఫిర్యాదుల రాగా 746 కేసులపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన రోజు నుంచి రూ.3.83 కోట్ల నగదు, మద్యం, వివిధ రకాల వస్తువులను సీజ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎంసీసీ వైలేషన్ కింద 67 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

పటిష్ఠ బందోబస్తు : ఎస్పీ సుమిత్

ఎస్పీ సుమిత్ సునీల్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా కీలక పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులతోపాటు, కేంద్ర బలగాలను మోహరిస్తున్నట్లు తెలిపారు. 263 రూట్ మొబైల్ టీంలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. డీఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో 56 క్విక్ రెస్పాన్స్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లు, తొమ్మిది స్ట్రైకింగ్ ఫోర్స్‌లు, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల నేతృత్వంలో 22 స్ట్రైకింగ్ ఫోర్సులు పనిచేస్తాయన్నారు. విలేకరుల సమావేశంలో డీఆర్వో శ్రీలత, కమాండ్ కంట్రోలు రూం నోడల్ అధికారి వరకుమార్, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్ పాల్గొన్నారు.

భూ యాజమాన్యహక్కు చట్టాన్ని రద్దు చేయాలి

- తెలుగు తమ్ముళ్ల వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), మే 7 : రాష్ట్రంలో భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేయాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒంగోలులో నగర కమిషనరు జశ్వంత్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ యాజమాన్య హక్కు చట్టం ద్వారా ఆస్తి యజమానికి హక్కులు దూరం అవుతాయన్నారు. అలాగే కోర్టులు జోక్యం లేకపోవడం ద్వారా ఈ చట్టం వైసీపీ ప్రభుత్వం ఆధీనంలోని వెళుతుందని, సొంత ఆస్తి కలిగిన వారికి ఎలాంటి హక్కులు లేకుండా ప్రభుత్వ అధికారుల చేతిలో ఆస్తి పత్రాలు ఉండటం దుర్మార్గమన్నారు. భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బొల్లినేని వాసుకృష్ణతోపాటు పలువురు పాల్గొన్నారు.

మండుటెండలోనూ..

మందుబాబుల క్యూ..!

పొదిలి, మే 7 : ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద మందుబాబులు ఎండను సైతం లెక్క చేయకుండా క్యూ కడుతున్నారు. మద్యం దుకాణాల్లో సమయపాలన కుదించడంతో మందుబాబులకు ఇబ్బందులు తప్ప డం లేదు. గతంలో పనులకు పోయి వచ్చిన తరువాత ఎప్పుడైనా మద్యం ఎప్పుడు తాగాలంటే అప్పుడు దొరుకుతుండేది. కానీ సార్వత్రిక ఎన్నికల సమయంలో నిబంధనల మేరకు సమయపాలన తగ్గించి లిమిట్ పెట్టడంతో ఎప్పుడు అయిపోతాయోనని మందుబాబులు షాపు తీయకముందే క్యూలో నిలబడి ఉంటున్నారు. కానీ ఎన్నికల కోడ్‌తో సమయం కుదించడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని మందుబాబులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాలు మూసేసిన తరువాత బార్‌కు వెళితే క్వార్టర్ బాటిల్‌పై రూ.50 అదనంగా వసూలు చేస్తున్నట్లు వారు చెబుతున్నారు. ప్రైవేటు వ్యక్తులు రూ.100 వసూలు చేస్తున్నారని వారు వాపోతున్నారు. బార్‌లో ఎంత పర్సెంటేజ్ అదనంగా వసూలు చేయాలో, ఎంత వసూలు చేస్తున్నారో పరిశీలించే అధికారులు లేకపోవడంతో బార్‌లో ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారని, మందుబాబులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



మద్యం దుకాణం వద్ద బారులు తీరిన మందుబాబులు

అవీ..ఇవీ..

ఒంగోలులో ఏడు పెట్టెల మద్యం పట్టివేత

బార్ సీజ్ • ముగ్గురు అరెస్టు

ఒంగోలు(క్రైం), మే7: ఒంగోలులోని ఓ బార్ నుంచి అక్రమంగా మద్యం తరలిస్తుండగా ఏడు పెట్టెల మద్యంను సీజ్ చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ జగదీష్ తెలిపారు. మంగళవరం స్థానిక నెల్లూరు బస్టాండ్‌లో గల ఏవీఆర్ బార్ నుంచి ఒక గోనెసంచీలో 48 బాటిళ్ళు మద్యం అక్రమంగా తరలిస్తుండగా కమ్మపాలెంనకు చెందిన దర్శి కార్తీక్, హరీష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఏవీఆర్ బార్ నుంచి మద్యం తీసుకెళుతున్నట్లు చెప్పారు. దీంతో మరో ఆరు పెట్టెలు మద్యం బార్‌లో గోనేసంచీలో వేసి సిద్ధంగా ఉంచడంతో మొత్తం ఏడు పెట్టెలు మద్యం సీసాలను సీజ్ చేశారు. అలాగే బార్ మేనేజర్ అహ్మద్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. వారి ముగ్గురిపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు బార్‌ను తనిఖీ చేసి నిల్వల్లో తేడాను బార్‌ను సీజ్ చేశారు.

కేంద్ర సాయుధ బలగాల కవాతు



కేంద్ర బలగాలతో ఎస్ఐ మహేష్

మద్దిపాడు, మే 7: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర సాయుధ బలగాలు మంగళవారం మండలంలోని తెల్లబాడు, రాచవారిపాలెం, పెద్దకొత్తపల్లి, మద్దిపాడు, ఘడియపూడి కాలనీ గ్రామాల్లో కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐ అజయ్‌కుమార్, ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామాల్లో కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు, రాజకీయ నాయకులు ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు పోలీసు శాఖకు సహకరించాలని వారు కోరారు.

జగన్‌కు ఓటు అడిగే హక్కు లేదు..

- కాంగ్రెస్ పార్టీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి సుధాకర్‌రెడ్డి

గిద్దలూరు, మే 7 : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు అడిగే హక్కే లేదని కాంగ్రెస్ పార్టీ ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి ఇడా సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి గిద్దలూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి గాంధీ బొమ్మ కూడలి వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అసెంబ్లీ అభ్యర్థి పగడాల రంగస్వామి, నాయకులు తిరుమలనాయుడులతో కలిసి రోడ్డుషో నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మద్యనిషేదం అమలుజేయకపోతే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని ప్రకటించిన జగన్‌మోహన్‌రెడ్డి ఏ ముఖం పెట్టుకుని మళ్లీ ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. నాసిరకం మద్యం అమ్మించి కిడ్నీ, లివర్ సమస్యలు తెచ్చిన జగన్‌ను ఇంటికి పంపాలని కోరారు. మూడు రాజధానుల పేరు చెబుతున్నారే తప్ప ఒక్క ఇటుక కూడా పేర్చలేదని ధ్వజమెత్తారు. కేసుల భయంతో ప్రత్యేక హోదాపై మోడీని ప్రశ్నించలేదని ధ్వజమెత్తారు. ప్రజల ఆస్తులను తాకట్టు పెట్టుకొనే ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. చిత్తూరు జిల్లాలో స్మశానాన్ని కూడా వదలని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చిత్తూరులో ఎందుకు పోటీ చేయడం లేదని ప్రశ్నించారు.

ప్రభుత్వ ఉద్యోగులూ..

ప్రలోభాలకు లోనుకావద్దు : కలెక్టర్

మార్కాపురం, మే 7: పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓట్లు వేసే, ఎన్నికల విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులు ప్రలోభాలకు లోనుకావద్దని కలెక్టర్ దినేష్ కుమార్ సూచించారు. మార్కాపురంలోని ఎస్వీకేపీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూంను, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బాలెట్ పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. కళాశాలలో తగినంత గాలి, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాంకేతిక సిబ్బందితో ఈవీఎంల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాటు చేశామన్నారు. పటిష్ఠమైన పోలీసు బందోబస్తుతోపాటు ఓటర్లకు పోలింగ్ కేంద్రాలలో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు నూరు శాతం తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఉద్యోగులే ఓటు వేయకపోతే ఇతరులకు ఎలా చెబుతామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఇప్పటికి 85 శాతం పోలింగ్ నమోదైందన్నారు. 8వ తేదీ సాయంత్రం 6 గంటల వరకూ ఉద్యోగులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర జిల్లాలలో పనిచేసే ఉద్యోగులకు సైతం ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ఓట్లకు డబ్బులు తీసుకోవడం వంటిచర్యలకు పాల్పడటం చట్టరీత్యా నేరమని, అదేవిధంగా యూపీఐ ద్వారా నగదు బదిలీపై ఎస్పీ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఇటువంటి చర్యలకు పాల్పడితే ఉద్యోగాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, కమిషనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు అన్యాయం చేసింది వైసీపీనే..

- టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ముస్తాక్‌అహ్మద్

మార్కాపురం, మే 7: ముస్లిం సమాజానికి అన్యాయం చేసింది వైసీపీ ప్రభుత్వమేనని టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ పేర్కొన్నారు. మార్కాపురంలోని కళాశాల వీధిలోని సౌజన్య ఫంక్షన్‌హాల్‌లో మంగళ వారం నియోజకవర్గస్థాయిలో ముస్లింల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో ముస్లింలకు ఒరిగింది శూన్యమన్నారు. ఏమీ చేయకపోగా దాడులు అధికమయ్యాయని ఆరోపించారు. నరసరావుపేటలో వక్ఫ్‌బోర్డ్ ఆస్థిని కాపాడేందుకు పోరాటం చేసిన 70 ఏళ్ల షేక్ ఇబ్రహీంను వైసీపీ గూండాలు హత్యచేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. నంద్యాలలో అబ్దుల్ సలాం కుటుంబం ఆత్మహత్యలు చేసుకునేందుకు కారణం వైసీపీ రౌడీలేనన్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో హజీరాను గ్యాంగ్‌రేప్ చేసి చంపింది వైసీపీ దుర్మార్గులేనన్నారు. వైసీసీ నాయకుని కుమార్తె కంటే ప్రతిభ చూపిందని వేధింపులకు గురిచేయడంతోనే మిస్బా అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే వైసీపీ నాయకులు జరిపిన దురాగతాలు అన్నీ ఇన్నీ కావన్నారు. రాష్ట్రంలో ఇంత పెద్దఎత్తున ముస్లింలపై దాడులు, దురాగతాలు చోటు చేసుకుంటుంటే ముస్లిం మత పెద్దలు, మేధావులు మాత్రం సిగ్గు, శరం లేకుండా జగన్‌కు మద్దతు ఇస్తూ ప్రెస్‌మీట్లు పెడుతున్నారని ఆరోపించారు. బీజేపీతో పొత్తుపెట్టుకున్న టీడీపీ 4 శాతం ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తుందని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. అసలు 2004 ఎన్నికల్లో టీడీపీ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ అప్పట్లో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిందన్నారు. టీడీపీ ఇచ్చిన హామీని ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ అమలు చేసిందన్నారు. ఈ నిజం ముస్లిం పెద్దలకు తెలియదా..? అని అన్నారు. చంద్రబాబుపై అసత్యాలు ప్రచారం చేస్తే సహించేది లేదన్నారు. ఎన్నికలు మరో వారం రోజుల్లో ఉన్నాయనగా ఇప్పుడు డిల్లీ, హైదరాబాద్‌ల నుంచి మేధావులు, మత పెద్దలు కొందరు ప్రెస్‌మీట్‌లు పెట్టి వైసీపీకి ఓటేయమంటే వేసేవాళ్లు ఎవరూలేరన్నారు. మీకు దమ్ము, ధైర్యం ఉంటే రాష్ట్రానికి వచ్చి బహిరంగ చర్చ పెట్టాలన్నారు. మీ స్వార్థం కోసం వ్యవహరిస్తే ఆ అల్లా కూడా క్షమించరన్నారు. కార్యక్రమంలో కూటమి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి, జనసేన ఇన్‌చార్జ్ ఇమ్మిడి కాశీనాథ్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు రసూల్, నాయకులు షేక్ మౌలాలి, డి.మస్తానయ్య, సాధిక్, పఠాన్ హుసేన్‌ఖాన్ పాల్గొన్నారు.



విజయసంకేతం చూపుతున్న ముస్తాక్ అహ్మద్, నారాయణరెడ్డి

సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు మేలు

ప్రచారంలో ఎమ్మెల్యే స్వామి

అక్కచెరువుపాలెంలో సొంత గూటికి వచ్చిన 25 కుటుంబాలు

సాధువారిపాలెం నుంచి పలువురు సత్య సమక్షంలో చేరిక



ముప్పరాజువారిపాలెంలో మాట్లాడుతున్న స్వామి

కొండపి, మే7: చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్ర ప్రజలకు మరింత సంక్షేమం రాబోయే రోజుల్లో రానుందని కొండపి ఎమ్మెల్యే, కూటమి బలపరుస్తున్న టీడీపీ కొండపి ఎమ్మెల్యే అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మూడు రోజుల విరామం అనంతరం మంగళవారం రాత్రి మండలంలోని ముప్పరాజువారిపాలెం, అనకర్లపూడి, నెన్నూరుపాడు, గుర్రప్పడియ, మూగచింతల గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో స్వామి నాయకులతో



అక్కచెరువుపాలెంలో టీడీపీలో చేరిన వారితో దామచర్ల సత్య

కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు, రైతులకు, యువకులకు, ఓసీ, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ప్రయోజనాలే లక్ష్యంగా చంద్రబాబు మేనిఫెస్టో రూపొందించారన్నారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని స్వామి అన్నారు. వైసీపీ పాలనలో ఆర్టీసీ ప్రయాణ చార్జీలు, విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరిగాయని స్వామి విమర్శించారు. ముసి ఒడ్డున ఉన్న గ్రామాల ప్రజల అవసరాలకు ఇసుక ఉపయోగపడటం లేదని ఆయన అన్నారు. పేదల నిర్మాణాలు చేసుకోవాలంటే వైసీపీ నాయకులకు కప్పం కట్టాలని విమర్శించారు. ఇసుక మాఫియా కోట్ల రూపాయలు దండుకుందని ఆయన విమర్శించారు. టీడీపీ హయాంలో అన్ని అనుసంధాన గ్రామాలకు తారురోడ్లు నిర్మించుకున్నామని గుర్రప్పడియ, మూగచింతల గ్రామాల్లో స్వామి గుర్తు చేశారు. గ్రామాలకు తాగునీటి సౌకర్యాలు కల్పించుకున్నామని గుర్తు చేశారు. నెన్నూరుపాడు గ్రామం వద్ద ముసిపై చెక్ డ్యాం నిర్మాణానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. అన్ని గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో సిమెంటు రోడ్లు, సైడు కాల్వలు నిర్మించుకున్న విషయాన్ని స్వామి ఈసందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మహిళల నీరాజనం... స్వామి ప్రచారానికి మహిళలు అధిక సంఖ్యలో ఆయా గ్రామాల్లో హాజరయ్యారు. స్వామి కళ్ల ఇబ్బంది తెలుసుకున్న మహిళలు ఆరోగ్య విషయం అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా పలు గ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

అక్కచెరువుపాలెంలో 25 కుటుంబాలు సొంత గూటికి...

జరుగుమల్లి మండలంలోని అక్కచెరువుపాలెం గ్రామంలో గ్రామానికి చెందిన బొడ్డపాటి వెంకటేశ్వర్లు, కొల్లూరి శ్రీనివాసరావు (ట్యాంకుల శ్రీను) ఆధ్వర్యంలో 25 కుటుంబాలవారు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి టీడీపీలో చేరారు. గత ఎన్నికల్లో పార్టీని వీడి పొరపాటు చేశామని, ఈ ఎన్నికల్లో టీడీపీలో చేరడం సొంత ఇంటికి వచ్చిన ఆనందంగా ఉందని వారు సత్యతో అన్నారు. దామచర్ల సత్య మాట్లాడుతూ పార్టీకి మొదటి నుంచి పనిచేసినవారిని గుర్తుంచుకున్నామని, గడచిన ఎన్నికల్లో జరిగిన పొరపాటును తెలుసుకుని పార్టీలోకి రావడం ఆనందదాయకమన్నారు. ఎటువంటి బేధాలు లేకుండా పార్టీ, తాను అండగా ఉంటామని సత్య హామీనిచ్చారు. పార్టీలో చింతల హరిబాబు, గోగినేని వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, సురేష్, రాగయ్య, మద్దినేని మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, వెంకట్రావు, శ్రీనివాసరావు, మోపర్తి తిరుపతిస్వామి, ప్రసాద్, హనుమంతరావు, ముప్పరాజు శ్రీహరి మరికొన్ని కుటుంబాలవారు పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, సీనియర్ నాయకుడు పోటు పెదబాబు, అక్కచెరువుపాలెం గ్రామ నాయకులు మండవ మల్లికార్జున, కొమ్మాలపాటి శ్రీను, కొమ్మాలపాటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాధువారిపాలెం నుంచి... కాగా మంగళవారం రాత్రి దామచర్ల సత్య కార్యాలయం వద్ద సాధువారిపాలెం గ్రామానికి చెందిన పలు కుటుంబాలవారు సత్య సమక్షంలో పలుకుటుంబాలవారు పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

పొన్నలూరులో... పొన్నలూరులోని ఎస్టీ కాలనీకి చెందిన వీసం కిరణ్‌కుమార్, వీసం వెంకటేశ్వర్లు గ్రామ పార్టీ అధ్యక్షుడు కంటు గోపీ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీలో మంగళవారం చేరారు. మండల పార్టీ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పడ్డ మురుగునీటి కాల్వ

కట్టావారిపాలెం పోలింగ్ కేంద్రం మురుగు మయం

● దుర్వాసనతో ఇబ్బందులు

కొండపి, మే7: ఎన్నికల సంఘం ఓటర్లకు అన్ని రకాల సౌకర్యాలతో పాటు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించినా అధికారుల్లో చలనం లేదు. తమ కార్యాలయాలు మినహా, పోలింగ్ కేంద్రాలను, వాటిలో సౌకర్యాలను పట్టించుకోవడం లేదు. నియోజకవర్గ కేంద్రమైన కొండపిలో గ్రామ పంచాయతీలోని కట్టావారిపాలెం గ్రామంలో దాదాపు 1600లకు పైగా ఓటర్లు ఉన్నారు. గ్రామంలో రెండు పోలింగ్ బూత్‌లు 138,139 ఉన్నాయి. ఈరెండు బూత్‌లలో గ్రామంలోని పూర్వపు ప్రాథమిక పాఠశాల, ప్రస్తుత సచివాలయం-2 భవనాల్లో నిర్వహిస్తున్నారు. గ్రామంలోని ఓటర్లందరూ ఈ భవనాల్లోనే తమ ఓటుహక్కును వినియోగించుకోవాలి. అయితే ఈ భవనాల్లోకి వెళ్లే వీలు లేదు. బూత్‌ల ఎదుట మురుగు కాల్వ పూడిపోయి మురుగు నీరు కాల్వదాటి రోడ్డుపైకి వస్తున్నది. అయినా అధికారులు పట్టించుకోలేదు. దాదాపు మూడు నెలలుగా ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ఉన్న అధికారులు ఈ పోలింగ్ కేంద్రం వద్ద మురుగు లేకుండా చూడాలనే ఆలోచన చేయకపోవడాన్ని గ్రామస్థులు ఆక్షేపిస్తున్నారు. గ్రామ పంచాయతీ, ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాల ముందు పేరుకుపోయిన మురుగు నీటి నిల్వలను తొలగించాలని, ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



డమ్మీ ఈవీఎం ద్వారా గుర్తును తెలియజేస్తున్న టీడీపీ కార్యకర్త

'గుర్తు'ంచుకోండి

ఈవీఎంల ద్వారా ఓటేసే విధానాన్ని ప్రచారం చేస్తున్న పార్టీలు

పొన్నలూరు (కొండపి), మే7: నూతన ఓటర్లకు, వృద్ధులకు తమ గుర్తులను తెలియజేయడంలో ప్రధాన పార్టీలు నానా తంటాలు పడుతున్నాయి. టీడీపీ, వైసీపీ అభ్యర్థులు తమ పార్టీ కార్యకర్తల ద్వారా డమ్మీ వీవీప్యాట్‌లు, ఈవీఎంలు ఏర్పాటు చేసి ఓటర్లతో ఆయా గుర్తులపై నొక్కిస్తూ ఓటర్లకు అవగాహన కలిగిస్తున్నారు. తాజాగా పొన్నలూరు మండలంలోని ఓ గ్రామంలో టీడీపీ కార్యకర్త తమ పార్టీ సానుభూతి పరుడైన వృద్ధుడికి టీడీపీకి ఓటేసే విధానాన్ని వివరిస్తున్న దృశ్యం ఆంధ్రజ్యోతి కంటపడింది. భోగనంపాడుకు చెందిన ముళ్లమూరి వెంకటరావు అదేగ్రామానికి చెందిన పొన్నగంటి రమణయ్యకు డమ్మీ ఈవీఎం ద్వారా ఓటేసే విధానాన్ని వివరిస్తుండగా ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది.

స్ఫూర్తిలో వెంకయ్య ఉచిత వైద్య సేవలు

టంగుటూరు, మే 7 : టంగుటూరులోని స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ వెంకయ్య ఉచితంగా వైద్య సేవలు అందించారు. టంగుటూరు శివారు వెంకటాయపాలెంలో ఆ సంస్థ మంగళవారం సాయంత్రం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. సుమారు 100 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ రోగులకు సూచించిన మందులను ఆ సంస్థ పంపిణీ చేసింది.

దళిత ద్రోహి జగన్

● ఎమ్మెల్యే స్వామి విమర్శ

టంగుటూరు, మే 7: ముఖ్యమంత్రి జగన్ దళిత ద్రోహి అని, మాదిగల ఎదుగుదల భరించలేని మనస్తత్వం ఆయనదని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని తూర్పునాయుడుపాలెంలోగల స్వగృహంలో మంగళవారం మాదిగ సేవాసంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బెంజిమన్‌మాదిగ, పలువురు మాదిగ సేవాసంఘం నాయకులతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దళిత సంక్షేమం కోసం గత ప్రభుత్వం అమలుచేసిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసిన జగన్‌రెడ్డి చరిత్రలో దళిత ద్రోహిగా నిలిచిపోతారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం దళితులకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేసిందని, విదేశీ విద్యా పథకం ప్రవేశ పెట్టి దళిత బిడ్డలను విదేశాల్లో చదివించిందని, ఈఘనత నాటి ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళిత నిరుద్యోగ యువతకు వాహనాలకు రుణాలు మంజూరు చేశారని, రాబోయే ఉమ్మడి కూటమి ప్రభుత్వంలో జగన్ రద్దు చేసిన దళిత సంక్షేమ పథకాలన్నీ తిరిగి ప్రవేశపెడతామని, విదేశీ విద్యా పథకానికి తిరిగి అంబేడ్కర్ పేరు పెట్టడం ఖాయమని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లంతా ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. బెంజిమన్‌మాదిగ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాపితంగా దళితులపై దాడులు జరుగుతున్నా ముఖ్యమంత్రి జగన్ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దళిత సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి రద్దు చేస్తున్నా మంత్రి ఆదిమూలపు సురేష్ ఏనాడూ ప్రశ్నించలేదని, ఈసంఘటనతో దళితులపై సురేష్‌కున్న ప్రేమాభిమానాలు స్పష్టమయ్యాయన్నారు. కార్యక్రమంలో మాదిగ సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు సందిపోగు రాంబాబు, సేవాసంఘ నాయకులు కిరణ్, దారా నాగేష్, ఎం. రాజేష్, వెంకటేశ్వర్లు, అంకయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే స్వామి, బెంజిమన్, మాదిగ సేవాసంఘం నాయకులు



ఎన్నికల గుర్తుపై విస్తృత ప్రచారం చేస్తున్న జయంత్‌బాబు, టీడీపీ క్యాడర్

ఎన్నికల గుర్తుపై విస్తృత ప్రచారం

టీడీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నికల గుర్తుపై పలువురు టీడీపీ నాయకులు ఇంటింటికీ తిరిగి విస్తృతంగా ప్రచారం చేశారు. బ్యాలెట్, ఈవీఎంల నమూనాలు చూపుతూ వీరు ఓటు సైకిల్ గుర్తుపై ఏవిధంగా వేయాలో వివరించారు. ఎమ్మెల్యేకి రెండవ లైనులోనూ, ఎంపీకి నాల్గవ లైనులో ఓటు వేయాలని పేర్లకు ఎదురుగా ఉండే ఈవీఎంలపై ఎన్నికల గుర్తు సైకిల్‌ను నొక్కాలని నమూనాల ద్వారా వివరించారు. టంగుటూరు, రావివారిపాలెంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మద్దిరాల మమత, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, మండల టీడీపీ అధ్యక్షుడు కామని విజయకుమార్, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, టీడీపీ ముఖ్యనాయకులు జక్కుల శ్రీనివాసరావు, భానుచందర్, పెద్దోడు, యజమాని, కుందేటి వెంకట్రావు, ఉమామహేశ్వరరావు, మొలకలపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న 10 కుటుంబాలు

దామచర్ల సత్య సమక్షంలో పార్టీలో చేరిక

సింగరాయకొండ, మే 7 : మండలంలోని కలికివాయి గ్రామం వైసీపీకి చెందిన 10 కుటుంబాలవారు ఆపార్టీని వీడారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య సమక్షంలో మంగళవారం రాత్రి కలికివాయిలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఆయన కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, పలు కుటుంబాలవారు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మండలపు గాంధీచౌదరి, దొడ్డా మహీధర్‌రెడ్డి, వల్లెపు రవి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలోకి..

మండలంలోని శానంపూడి వైసీపీకి చెందిన 10 కుటుంబాలు ఆపార్టీకి గుడ్‌బై చెప్పారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కోడిపల్లి మురళి, కోటయ్య, నాగరాజు, శ్రీను, నలగట్ల మహేష్, మేకా హరికృష్ణ, పలు కుటుంబాల వారు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పులివర్తి లక్ష్మీనారాయణ, మద్దసాని రమేష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దామచర్ల సత్య



టీడీపీలో చేరిన రావివారిపాలెం చినకోటయ్య(చిన్నా)

టీడీపీలో చేరిన రావివారిపాలెం వైసీపీ నేత

టంగుటూరు, మే 7 : మండలంలోని టంగుటూరు పంచాయతీ శివారు రావివారిపాలెంకు చెందిన వైసీపీ గ్రామ నాయకుడు సవలం చినకోటయ్య(చిన్నా) మంగళవారం ఆపార్టీని వీడి టీడీపీలో చేరారు. టంగుటూరు పురం సెంటర్‌లోగల టీడీపీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు చిన్నాకు టీడీపీ కండువాకప్పి పార్టీలోకి ఘనంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలోని పడమర గ్రామాల్లో వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారని, ప్రస్తుతం తూర్పుతీర గ్రామాల్లోనూ వలసలు ప్రారంభమైనట్లు తెలిపారు. భావితరాల భవిష్యత్ కోరుకునే వారు ఎవరైనా సరే టీడీపీ జెండా పట్టుకోవాలని కామని సూచించారు.

సర్వీస్ రోడ్డులో గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం



గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం

టంగుటూరు, మే 7 : టంగుటూరులో మంగళవారం గుర్తు తెలియని వృద్ధుని మృతదేహాన్ని స్థానికులు కనుగొన్నారు. టంగుటూరు టోల్‌ప్లాజా నుంచి నేరుగా కోల్డ్ స్టోరేజ్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డు పక్కనే పడిఉన్న శవాన్ని చూశారు. ఉదయం అటు వైపు వాకింగ్‌కు వెళ్లిన కొందరు యువకులు అక్కడ పడిఉన్న మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు, పంచాయతీవారికి సమాచారం చేరవేశారు. అయినా సరే సాయంత్రం వరకు మృతదేహం ఉన్న ప్రాంతానికి అధికారులెవ్వరూ వచ్చిన దాఖలాలు లేవు. వృద్ధుని వయస్సు 75ఏళ్లు ఉండవచ్చని భావిస్తున్నారు. తెల్లని బనీన్, తెల్లటి అడ్డపంచ ధరించి ఉన్నాడు. అతని పరిస్థితిని బట్టి చూస్తే మృతుడు యాచకుడై ఉండవచ్చని భావిస్తున్నారు. సమాచారం తెలియగానే సింగరాయకొండ కేంద్రంగా అనాథ శవాలకు అంత్యక్రియలు జరిపే యువనేస్తం ఫౌండేషన్ వారు స్పందించారు. వెంటనే వారు ప్రత్యేక వాహనంలో టంగుటూరులోని మృతదేహం ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. అంత్యక్రియల నిమిత్తం మృతదేహాన్ని సింగరాయకొండ తీసుకుపోయారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ప్రలోభాలకు లొంగొద్దు- ఓటేయడం మానుకోవద్దు

కొండపి, మే7: ఓటర్లు ఈనెల 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది మంగళవారం కొండపిలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా 'ఓటర్లు ప్రలోభాలకు లొంగొద్దు' - 'ఓటేయడం మానుకోవద్దు' అని నినదించారు. పలు శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది మోటార్ సైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో కొండపి, పొన్నలూరు,జరుగుమల్లి మండలాల ఎంపీడీవోలు నాగమణి, కల్పన, జలజాక్షి, స్వీప్ నోడల్ అధికారిణి విక్టోరియా రాణి, టీం మెంబర్ శ్రీహరి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

కొండపి, మే7: ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం కొండపిలోని టంగుటూరు రోడ్డులో పొగాకు బోర్డు సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వాహనాలను కొండపి ఎస్సై కృష్ణ బాజీ బాబు ప్రత్యేక పోలీసు దళాలతో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నగదు, వస్తువులు, మద్యం తరలించడం నేరమన్నారు. వాహనాల్లో అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

వలస ఓటర్లకు ఇచ్చినంత ఇవ్వాల్సిందే !

ప్రధాన పార్టీకి స్థానికుల డిమాండ్

కొండపి, మే7: ఓటర్లలో చైతన్యం పెరిగిపోయింది. ప్రధాన రాజకీయ పార్టీలు రాష్ట్రం వెలుపల ఇతర రాష్ట్రాల్లో ఉన్న వలస ఓటర్లకు ఇప్పటికే రానుపోను ఖర్చుల కింద ఓటుకు మూడు వేల రూపాయల చొప్పున డబ్బులు ముట్టజెప్పారు. వచ్చి ఓటేశాక ఇంకొంత ముట్టజెప్పే యత్నాలు చేస్తున్నారు. ఇందులో భార్యాభర్త ఓటర్లయినా, చిన్నపిల్లలను వదిలేయలేం కదా? అంటూ అందరి చార్జీలు వలస ఓటర్లు వసూలు చేస్తున్నారు. మొత్తంగా వెరసి వలస ఓటరుకు ఓటుకు మూడు వేల రూపాయల వరకు ఖర్చు అవుతుందని పార్టీలు అంచనా వేస్తున్నాయి. అయితే వలస ఓటరుకు మూడు వేల రూపాయలు ఇస్తే గ్రామాల్లో ఉండే ఓటర్లకు కూడా మూడు వేల రూపాయలు ఇవ్వాల్సిందేనని కొండపికి వలస వచ్చిన ఓ ప్రధాన పార్టీ అభ్యర్థికి ఇండెంట్‌లు ఆయా గ్రామాల నాయకుల నుంచి వస్తున్నాయని సమాచారం. ఇతర ప్రాంతాల్లోని వారికి మూడు వేల రూపాయలు ఇస్తే ఇక్కడి ఓటర్లకూ అంతే మొత్తం ఇవ్వాల్సిందేనని ఆపార్టీ గ్రామ నాయకులు చెబుతుండటంతో పోటీచేసిన అభ్యర్థి వలస ఓటర్లకు ఇచ్చినంత డబ్బులు స్థానిక ఓటర్లకు ఎలా ఇస్తాం.. అంటున్నారని సమాచారం. కాగా నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించగల ఓ మండలంలో అధికార పార్టీకి చెందిన పలువురు నాయకులు వ్యక్తిగతంగా తమకు కొంత మొత్తాలను ఖర్చుల కింద ఇవ్వాలని ఆపార్టీ నాయకుడిని కోరారని తెలిసింది. ఇందుకు ససేమిరా?అని అభ్యర్థి అనడంతో ఆ మండలంలోని నాయకులు తాడేపల్లికి చెందిన అధినాయకుడి దృష్టికి తీసుకెళ్లారని సమాచారం. దీంతో అధినాయకుడు కిందిస్థాయి నాయకులను జాగ్రత్తగా చూసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. మొత్తంగా పేదలపార్టీ అని చెప్పుకుంటున్న ఆపార్టీ అభ్యర్థి నుంచి డబ్బులు భారీగానే ఖర్చు చేయిస్తున్నారని వినికిడి. వలస వచ్చిన అభ్యర్థి కూడా గత రికార్డులను తెప్పించుకుని బేరీజు వేసుకుని, జయాపజయాల్లో ఈ మండలమే కీలకమని సర్వే ఆధారంగా నమ్ముకుని, ఈ మండలం నుంచే తన మొత్తం కార్యకలాపాలను సాగిస్తుండటం విశేషం.

మందుబాబుల వీరంగం

అద్దంకి, మే 7 : అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్డులో మంగళవారం సాయంత్రం మందుబాబులు వీరంగం సృష్టించారు. మద్యం సేవించిన ముగ్గురు హడావుడి చేయడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం అక్కడకు చేరుకొని మందుబాబులను పంపించి వేశారు. ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల కోసం మద్యం పంపిణీ ప్రారంభించిన నేపథ్యంలో మందుబాబులు సేవించి హంగామా చేస్తున్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఇక మందుబాబులకు పండుగే. మందుబాబులు ఇష్టానుసారం వ్యవహరించకుండా పోలీసులు నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ పాలనలో గంజాయి హబ్‌గా ఏపీ

● టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నర్సిరెడ్డి

బోడవాడ (పర్చూరు), మే 7 : వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ గంజాయి హబ్‌గా మారిందని, దీనికి జగన్‌రెడ్డే బాధ్యత వహించాలని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. పర్చూరు మండల పరిధిలోని బోడవాడ గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి విధ్వంస, అరాచక నియంతృత్వ పాలన వల్ల పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలి పోయాయన్నారు. దీంతో ఉపాధి ఉద్యోగావకాశాలు లేక యువత భవిష్యత్ అగమ్య గోచరంగా మారిందన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ ఉందన్నారు. రాష్ట్రానికి అప్పులు, జగన్‌రెడ్డికి ఆస్తులు పెరిగాయని విమర్శించారు. ఉపాధి నిధుల దుర్వినియోగంలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. ప్రస్తుత ఎన్నికలు ధర్మానికి అధర్మానికి మధ్య జరుగుతున్నాయన్నారు. ఎస్సీల అభివృద్ధి కోసం చంద్రబాబు హయాంలో ఉన్న పథకాలన్నీ జగన్‌రెడ్డి రద్దు చేశారన్నారు. నా ఎస్సీలు అని చెప్పి కల్లబొల్లి మాటలతో మోసం చేస్తున్నారన్నారు. సంక్షోభం పోవాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. పర్చూరు ఎమ్మెల్యేగా సాంబశివరావును గెలిపించాలని నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు.



బోడవాడలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

కలలో కూడా ఊహించని తమ ఉన్నతికి బాటలు వేసిన చంద్రబాబు రుణం తీర్చుకునేందుకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సిద్ధమయ్యారు. తమకు మెరుగైన జీతం, జీవితాన్ని అందించిన బాబుకు బాసటగా నిలుస్తున్నారు. ఆయన ఉమ్మడి ఏపీలో ఐటీ రంగానికి పురుడు పోయడమేగాక ఆ రంగానికి ఊతమిచ్చేలా విస్తృతంగా ఇంజనీరింగ్ కాలేజీల ఏర్పాటుకు అనుమతివ్వడం, అలాగే ఐటీకంపెనీలు స్థాపించడంలో తీవ్రంగా శ్రమించిన టీడీపీ అధినేత చంద్రబాబు కోసం, రాష్ట్ర శ్రేయస్సు కోసం వారు కంకణబద్ధులయ్యారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అస్తవ్యస్తమైన రాష్ట్ర అభివృద్ధిని మళ్లీ పరుగెత్తించాలంటే చంద్రబాబే సీఎం కావాలని, ఐటీరంగానికి పునఃవైభవం ఆయనతోనే సాధ్యమని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు నమ్మి వారు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

ఐటీ.. రుణం తీర్చుకునేందుకు...

టీడీపీ గెలుపు కోసం రంగంలోకి తెలుగు ప్రొఫెషనల్స్

విభిన్న రూపాల్లో ప్రచారం చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల ఓట్లే లక్ష్యంగా చర్యలు

పలు ప్రాంతాల్లో ప్రత్యక్ష ప్రచారం, పోలింగ్‌కు భారీగా తరలివచ్చే అవకాశం

బాబుతోనే భవిష్యత్ అని ఊరూరా కాన్వాస్


ఒంగోలు, మే 7(ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక సమరంలో పోరాడుతున్న జిల్లాలోని టీడీపీ అభ్యర్థులకు దన్నుగా తెలుగు ప్రొఫెషనల్స్(ఐటీ) ఉద్యోగులు నిలిచారు. వివిధ రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో స్థిరపడిన జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ప్రత్యేకించి వారిలో యువకులు టీడీపీ గెలుపు కోసం శ్రమిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వారి ప్రభావం అధికంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఐదారు మాసాల నుంచే విభిన్న రూపాలలో ప్రత్యేకించి సామాజిక మాధ్యమాల ద్వారా వైసీపీ ప్రభుత్వ తీరును ఎండగడుతూ, రాష్ట్ర భవిష్యత్ కోసం తిరిగి చంద్రబాబును సీఎంగా గెలిపించాలన్న ఆకాంక్షను వ్యక్తం చేస్తూ ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. ఎన్నికలు దగ్గర పడటంతో వారు మరింత కార్యోన్ముఖులు అయ్యారు.

జిల్లాలో వేల సంఖ్యలోనే ఐటీ నిపుణులు ఉన్నారు. పట్టణాల్లో అధికంగా ఉన్నా ఒక్కో గ్రామంలో కనీసం 50 మంది వరకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులున్నట్లు అంచనా. గతంలో చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రసీఎంగా ముందుచూపుతో ఐటీ రంగాన్ని ప్రోత్సహించి ఇంజనీరింగ్ కాలేజీలు అందుబాటులోకి తీసుకురావడం, మరో వైపు ఉద్యోగం, ఉపాధి కల్పనకు వీలుగా సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఏర్పాటు చేయించారు. ఊళ్లల్లో ఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు చంద్రబాబు హయాంలోనే ఐటీ నిపుణులు ఎదిగారు. అలా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విశాఖ, పూణే, ముంబయితోపాటు అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, ఇతర దేశాల్లో పనిచేస్తున్నారు.


ఒంగోలులో చిరువ్యాపారులకు టీడీపీ మేనిఫెస్టోపై అవగాహన కల్పిస్తున్నతేజస్విని, సాఫ్ట్‌వేర్లు


ఉపాధిని వైసీపీ నేతలు చిదిమేయడంపై ఆగ్రహం

గత ఐదేళ్లుగా రాష్ట్రంలో నడుస్తున్న వైసీపీ ప్రభుత్వ విధానాలు, ఉపాధి కల్పన చర్యలను కూలదోసి అవినీతి, అరాచకంగా సాగుతున్న తీరుపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ప్రత్యేకించి రాష్ట్రానికి రాజధాని కూడా లేదన్న ఆగ్రహం వారిలో ఎక్కువగా ఉంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర భవిష్యత్‌కు మళ్లీ చంద్రబాబు నాయకత్వమే శరణ్యమని నమ్ముతున్న వారు ఆ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు తమ వంతు సహకారానికి సన్నద్ధమయ్యారు. సాఫ్ట్‌వేర్లు ఐదారు మాసాలుగా మరింత కీలకంగా పనిచేస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి స్వంత గ్రామాలకు వచ్చిన వారు స్థానిక పరిస్థితులను పరిశీలించి ఒక గ్రూపుగా ఏర్పడి సామాజిక మాధ్యమాల ద్వారా నిరంతరం టచ్‌లో ఉండటం, తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను చైతన్యం చేయడం ప్రారంభించారు. టీడీపీ ఇదే సమయంలో నియోజకవర్గంలోని ఐటీడీపీ వింగ్‌లను ఏర్పాటు చేయగా వాటి ద్వారా కార్యకలాపాలను విస్తరిస్తున్న వారు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బృందాలుగా ప్రచారం నిర్వహించడం కూడా చేస్తున్నారు. ప్రధానంగా హైదరాబాద్, బెంగళూరులలో వేల సంఖ్యలో ఇలాంటి వారు ఉండగా ఎన్నికల సమయంలో నియోజకవర్గాల వారీ ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసి ఇక్కడి నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులను పిలిచి పరిచయ కార్యక్రమాలు నిర్వహించి గెలుపునకు ప్రతినబూనారు.



కీలకంగా తేజస్విని

ఒంగోలుకు చెందిన పొడపాటి తేజస్విని ప్రస్తుతం టీడీపీ ఐటీ నిపుణుల విభాగం రాష్ట్ర అధ్యక్షురాలుగా ఉండగా ఇతర ప్రాంతాల్లో ఉంటున్న జిల్లా వాసులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను సమన్వయం చేయడంలో, హైదరాబాద్, బెంగళూరులలో సమావేశాలు నిర్వహణలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. అలాగే ఒంగోలు ప్రాంతంలో ప్రత్యక్ష ప్రచారంలోనూ పాల్గొంటున్నారు. ఇదిలా ఉండగా ఎన్నికలలో ఓట్లు వేసేందుకు భారీగానే వారు జిల్లాకు వస్తున్నారు. ఈనెల 13న పోలింగ్ కాగా అంతకు ముందు రెండు రోజులైన 11,12 తేదీలు శని, ఆదివారం సెలవులు. దీంతో మొత్తం రెండు రోజులు ముందే వచ్చి గ్రామాల్లో మరింత క్రియాశీలకంగా వ్యవహరించేలా ప్రయతిస్తున్నారు. మరో వైపు గ్రామాలలో ఎన్నికల సమయంలో అయ్యే ఖర్చులు,పొరుగు ప్రాంతాల నుంచి ఓటింగ్‌కు వచ్చే వారికి అవసరమైన ఏర్పాట్లలో వారు భాగస్వామ్యం అవుతున్నట్లు సమాచారం. మొత్తం మీద తమ భవిష్యత్‌కు చంద్రబాబు విధానాలు వల్లనే భరోసా లభిస్తున్నదని భావిస్తున్న వారు రాష్ట్ర భవిష్యత్ కూడా ఆయన వల్లనే సాధ్యమని నమ్మి టిడిపి అభ్యర్థుల గెలుపు కోసం పనిచేస్తున్నారు.



ప్రకాశం

జిల్లా వార్తలు

బుధవారం 8 మే 2024

జన కేతనం

దూకుడు పెంచిన మాగుంట కుటుంబం

ఎన్నికల ప్రచారంలో గ్రామాలలో విస్తృతంగా పర్యటన

ఒంగోలు(కలెక్టరేట్), మే 7 : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఒక వైపు ఆయన కుమారుడు రాఘవరెడ్డి, ఇంకొక వైపు రాఘవరెడ్డి సతీమణి చందనరెడ్డి, ఇంకొక వైపు ఇతర కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచారంలో ఇంటింటికీ తిరిగి టీడీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. మాగుంట రాఘవరెడ్డి, చందనలు త్రిపురాంతకంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఆ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇతర కుటుంబ సభ్యులు ఒంగోలులో ఇంటింటి ప్రచారం చేపట్టారు. మాగుంట మరదలు శశికళ, సహనారెడ్డి, వాణి, చెల్లెళ్లు హితారెడ్డి, సురేఖ, సుధ, ఆర్చన, మేనకోడళ్లు ప్రణీత, కీర్తి, మాగుంట చిన్నమ్మ మైథిలి, మనవరాలు జాహ్నవితోపాటు ఒంగోలు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ అక్కడ మాధవి, కుమార్తె అనిషాలక్ష్మి, మరదలు డాక్టర్ హిమబిందు, కోడలు హారికలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ నెల 13వ తేదీన జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి మాగుంట, జనార్దన్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు.


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మాగుంట కుటుంబ సభ్యులు


బైక్ ర్యాలీలో కలెక్టర్ దినేష్‌కుమార్

ఓటర్లకు అవగాహన కోసం బైక్ ర్యాలీ

యువతతో కలిసి బుల్లెట్ తోలిన కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), మే 7 : పోలింగ్ ప్రక్రియ సమీపిస్తున్న తరుణంలో ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా అవగాహన కల్పించేందుకు ఒంగోలులో భారీ ర్యాలీ నిర్వహించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ప్రకాశం యువ ఓటరు సంకల్పం పేరుతో మంగళవారం భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మినీస్టేడియం వద్ద నుంచి కలెక్టరేట్ మీదుగా కోర్టుసెంటర్, మంగమూరు రోడ్డు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ కార్యకర్తలు, పలు కళాశాలల విద్యార్థులు, దివ్యాంగులు, వివిధ వర్గాల యువకులు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకోవడంలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. అర్హులైన ఇతర ఓటర్లతోనూ ఓటు వేయించడంలో చురుకైన పాత్ర పోషించాలన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యత, దానిని వినియోగించుకోవాల్సిన ఆవశ్యకతపై సమాజంలో చైతన్యం కల్పించేందుకు సంకల్పం పేరుతో జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎవరెస్ట్ పర్వతారోహకుడు హిమామ్‌షా, స్కేటింగ్ క్రీడాకారులు కూడా ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారులు బీ రవి, జ్యోతి, వివిధ శాఖల అధికారులు సురేష్‌కుమార్, జీ అర్చన, హేమంత్, అర్జునరావు, ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి, మునిసిపల్ కమిషనర్ జశ్వంతరావు పాల్గొన్నారు.

మంత్రి సేవలో ఆర్వో

ఆయన వెంట పోలింగ్ కేంద్రంలోకి..

ఫిర్యాదు చేయడానికి సిద్ధమైన టీడీపీ

కొండపి, మే7 : ఆయనో తహసీల్దార్.. ఎన్నికల్లో విధుల్లో భాగంగా ఇతర జిల్లా నుంచి ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరుకు తహసీల్దార్‌గా వచ్చారు. బాధ్యతలు చేపట్టగానే మంత్రి సురేష్‌ను కలిసి మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేశారు. తాజాగా మంగళవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో మంత్రి సురేష్ కొండపి జీహెచ్ఎస్‌లోని పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలను తన అనుచరులతో కలిసి సందర్శించారు. అయితే పొన్నలూరు తహసీల్దార్‌గా పనిచేస్తూ, ఆర్వో బాధ్యతలతోపాటు, ప్రస్తుత పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాల నోడల్ అధికారిగా ఉన్న సుధాకర్‌రావు మంత్రికి స్వాగతం పలకడమే కాకుండా, ఆయన వెంట అన్ని బూత్‌ల వద్దకు వెళ్లారు. ఇదే ప్రస్తుతం వివాదాస్పదంగా మారింది. మిగతా అధికారులు మంత్రికి ఎదురుపడలేక, ఎన్నికల నిబంధనలను తోసిపుచ్చలేక పక్కకు వెళ్లారు. అయితే స్వయంగా ప్రధాన విధుల్లో ఉన్న సుధాకర్‌రావు మంత్రి వెంట నడవడం, ఆయనకు మద్దతుగా ప్రవర్తించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. బాధ్యతతో వ్యవహరించాల్సిన ఆర్వో ఇలా ప్రవర్తించడం దారుణమని రాజకీయ పార్టీల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన సుధాకర్‌రావుపై చర్యలు తీసుకోవాలని, పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నోడల్ అధికారి, ఆర్వో బాధ్యతల నుంచి తప్పించాలని పలు పార్టీల నాయకులు, ఉద్యోగులు ఉన్నతాధికారులకు, జిల్లా ఎన్నికల అధికారికి, రాష్ట్ర ఎన్నికల అధికారికి విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదు చేయడానికి టీడీపీ నేతలు సిద్ధమవుతున్నారు.



పోలింగ్ బూత్ నుంచి వెలుపలకు మంత్రి వెంట నడుస్తున్న ఆర్వో సుధాకరరావు, మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పొన్నలూరు తహసీల్దార్ సుధాకర్‌రావు

పోస్టల్ బ్యాలెట్లలో గందరగోళం

పొరుగు జిల్లాలకు వెళ్లి పత్రాలు లేక తిరిగొచ్చిన టీచర్లు, ఉద్యోగులు

అధికారుల బాధ్యతారాహిత్యమే కారణం

ఒంగోలు (విద్య), మే 7 : పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వినియోగంలో గందరగోళం నెలకొంది. వేసేందుకు పొరుగు జిల్లాలకు వెళ్లిన టీచర్లు, ఉద్యోగులు అధికారుల బాధ్యతారాహిత్యంతో ఉసూరుమంటూ వెనుదిరిగి రావాల్సి వచ్చింది. అక్కడ అవసరం మేరకు బ్యాలెట్ పేపర్లు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. మళ్లీ వారు తమ సొంత నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చింది. బుధవారంతో గడువు ముగియనుండటంతో తమకు పోస్టల్ బ్యాలెట్ అందుతుందో, లేదోనని వారంతా ఆందోళనకు గురవుతున్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ విధానం మార్పు

ఎన్నికల విధులకు నియమితులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా పంపే వెసులుబాటు ఉంది. గతంలో వారు దరఖాస్తు చేసుకున్నాక పోస్టులో వచ్చిన బ్యాలెట్ పేపర్‌లో ఓటు వేసి కవర్లో పెట్టి తిరిగి పోస్టు ద్వారా కానీ, ఆర్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ బాక్సుల్లో వేసేవారు. ఈ విధానం వల్ల రాజకీయ పార్టీలు పోస్టల్ బ్యాలెట్‌లు కొనుగోలు చేస్తున్నాయన్న ఆరోపణలు రావడంతో ఆ విధానానికి ఎన్నికల కమిషన్ స్వస్తి చెప్పింది. ఈసారి ప్రత్యేకంగా ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడ ఓటు వేయాలని సూచించింది. ఈ ప్రక్రియ నాలుగు రోజుల నుంచి కొనసాగుతోంది.

అధికారుల నిర్లక్ష్యం

పోస్టల్ బ్యాలెట్ల వినియోగానికి సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో టీచర్లు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈసీ నిబంధనల ప్రకారం జిల్లాలో ఓటుహక్కు ఉన్న టీచర్లు, ఉద్యోగులు ఇక్కడే ఎన్నికల విధులకు నియమితులైతే వారు తమ ఓటు ఉన్న నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుంది. మన జిల్లాలో ఓటు ఉండి ఇతర జిల్లాల్లో పనిచేస్తుంటే ఆ జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి. ఉమ్మడి ప్రకాశంలో పనిచేస్తున్న వారు ప్రస్తుతం జిల్లాల విభజనతో గుంటూరు, నెల్లూరు, బాపట్లల్లో ఓటు హక్కు వినియోగించుకోవాల్సి వచ్చింది. అంటే కందుకూరు నియోజకవర్గంలో పనిచేస్తున్న వారు నెల్లూరులో, అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లో పనిచేస్తున్న వారు బాపట్లలో, ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీలో పనిచేస్తున్న వారు గుంటూరులో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి. మంగళవారం ఓటు వేసేందుకు గుంటూరు, బాపట్లకు వెళ్లిన కొందరు ఉపాధ్యాయులు, ఉద్యోగులు అక్కడ పోస్టల్ బ్యాలెట్లు లేకపోవడంతో ఓటు వేయకుండా వెనుదిరిగారు. అవసరమైన మేరకు పోస్టల్ బ్యాలెట్లు తెప్పించడంలో సంబంధింత ఆర్వోలు ఘోరంగా విఫలమవడం ఇందుకు కారణమైంది. దీంతో ఉద్యోగులు, టీచర్లు తమకు ఓటు ఉన్న ప్రాంతాలకు చేరుకొని ఆ నియోజకవర్గాల్లోని ఆర్వోలకు దరఖాస్తు చేసుకున్నారు.


పోస్టల్ బ్యాలెట్ ఓటు వేస్తున్న ఉద్యోగులు

నేటితో ముగియనున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ఒంగోలు (కలెక్టరేట్), మే 7 : జిల్లాలో పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. పోస్టల్ బ్యాలెట్ కోసం 19,013 మంది ఉద్యోగులు, ఇతర పోలింగ్ సిబ్బంది దరఖాస్తు చేసుకోగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు 16,400 (85శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మరోవైపు 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40శాతంపైన వైకల్యం ఉన్న దివ్యాంగుల కోసం హోం ఓటింగ్ కొనసాగింది. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ బుధవారం సాయంత్రం ఆరు గంటలతో ముగియనుంది. ఏరోజుకారోజు బ్యాలెట్ బాక్సులను నియోజకవర్గకేంద్రాల్లోని ఆర్వో కార్యాలయాల్లో భద్రపరుస్తున్నారు. పూర్తిస్థాయిలో ఓటింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత వాటిని స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చనున్నారు. అవసరమైన చర్యలను అధికారులు తీసుకున్నారు.



ఉద్దండుడు ఉగ్ర

పీసీపల్లి అభివృద్ధిలో చెరగని ముద్ర

కేజీబీవీ, జూనియర్ కళాశాల ఏర్పాటు

విద్యుత్ సమస్యలకు పరిష్కారం

భూగర్భ జలాల పెంపునకు పాలేటిపల్లి ప్రాజెక్టు నిర్మాణం

పొగాకు రైతులకు చేరువలో కనిగిరిలో పొగాకు వేలం కేంద్రం

కందుకూరు-కనిగిరి మధ్య పాలేరునదిపై హైలెవల్ వంతెన నిర్మాణం

పీసీపల్లి, మే 7 : గ్రామాల అభివృద్ధికి మెరుగైన రహదారులతో పాటు తాగు, సాగునీటి సౌకర్యం, విద్యాభివృద్ధికి పాఠశాలలు, కళాశాలలు, రైతులు పండించే పంటల విక్రయానికి మార్కెట్‌యార్డులు ఎక్కడైతే అందుబాటులో ఉంటాయో ఆ గ్రామాల్లో అభివృద్ధి వేగవంతం అవుతుంది.. ఇది ప్రాథమిక అంశం..! ఆ సూత్రాలను పూర్తిగా నమ్మే కనిగిరి నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తాను ఎమ్మెల్యేగా ఉన్న 2009-14మధ్య కాలంలో నియోజకవర్గంలోని పీసీపల్లి మండలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి తనదైన ముద్రవేశారు. అప్పటి ప్రభుత్వంలో ఉన్న మంత్రులు, ముఖ్యమంత్రులతో ఉన్న సాన్నిహిత్యాన్ని తన వ్యక్తిగత అవసరాల కోసం కాకుండా నియోజకవర్గ అభివృద్ధి కోసం ఉపయోగించారు. వెనుకబడిన పీసీపల్లి మండల అభివృద్ధికి ఎనలేని కృషిచేశారు.



కేజీబీవీ విద్యాలయం

బాలికల్లో అక్షరాస్యతను పెంచేందుకు కేజీబీవీ ఏర్పాటు

ప్రధానంగా అక్షరాస్యతను పెంపుపై ఉగ్ర దృష్టిపెట్టారు. అందులోనూ బాలికల విద్యను ప్రోత్సహించేందుకు సుమారు 38.75లక్షల రూపాయలతో 2011లో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఏర్పాటు చేయించారు. ఈ విద్యాలయంలో అధ్యాపకురాళ్లను నియమింపచేయించి మెరుగైన విద్యను అందిస్తుండడంలో ఆయన పాత్ర ఎనలేనిది. విద్యతో పాటు బాలికలు క్రీడల్లోనూ రాణించాలనే దృక్పథంతో క్రీడల్లోని వివిధ విభాగాల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థినులకు బహుమతులు ఇచ్చి ప్రోత్సహించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అన్ని వసతులతో కూడిన నూతన భవనాన్ని నిర్మించారు.

రైతుల కోసం ఎనలేని కృషి

మండలంలో వ్యవసాయమే ఆధారం. మెట్టపైర్లతో పాటు వాణిజ్య పంట పొగాకును సాగు చేస్తారు. పండించిన పొగాకును విక్రయించేందుకు రైతులకు అందుబాటులో బోర్డు లేకపోవడంతో కందుకూరు, పొదిలి ప్రాంతాలకు వెళ్లాల్సివచ్చేది. రాత్రివేళల్లో పొగాకు చెక్కులతో ట్రాక్టర్లలో రైతులు వెళ్తున్న క్రమంలో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వారి ఇబ్బందులను గుర్తించిన ఉగ్ర ఎంతో కృషి చేసి రైతులకు అందుబాటులో కనిగిరిలో పొగాకు వేలం కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు.

సబ్‌స్టేషన్ నిర్మాణంతో లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం

విద్యుత్ లోఓల్టేజీ సమస్య రైతులను తీవ్రంగా వేధించేది. గుంటుపల్లి ప్రాంతంలో అధికంగా సమస్య ఉండేది. వ్యవసాయ మోటార్లు తరచూ కాలిపోతుండేవి. ఈ క్రమంలో ఆ ప్రాంత రైతులు వారు ఎదుర్కొంటున్న విద్యుత్ లోఓల్టేజీ సమస్యను ఉగ్ర నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే సంబంధిత విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి గుంటుపల్లిలో సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని చేపట్టి దాన్ని పూర్తిచేయించి లోఓల్టేజీ విద్యుత్ సమస్యను పరిష్కరించారు.

పాలేరు నదిపై బ్రిడ్జి నిర్మాణం

పెదఅలవలపాడు వద్ద పాలేరునది వర్షాకాలంలో పొంగినప్పుడు రాకపోకలు ఇబ్బందిగా ఉండేది. దీం తో కందుకూరు-కనిగిరి మధ్య వాహన రాకపోకలు నిలిచిపోయి గంటలకొద్దీ ప్రయాణికులు ఇబ్బందిపడేవారు. గత పాలకులకు ఆ ప్రాంత ప్రజలు వారు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను చెప్పినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఈ విషయాన్ని గుర్తించిన డాక్టర్ ఉగ్ర సంబంధిత ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులతో చర్చించి నిధులు మంజూరు చేయించడమే కాకుండా త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేయించి రవాణాకు ఎటువంటి ఆటంకం లేకుండా హైలెవల్ వంతెన నిర్మింపచేయించారు.

ఉగ్రకే తమ మద్దతు అంటున్న ప్రజలు

పదవులు ఉన్నా లేకపోయినా కంటిచూపుతో బాధపడుతున్న ఎంతో మందికి శస్త్రచికిత్సలు చేయిస్తున్నారు. అన్న క్యాంటీన్‌ను ఏర్పాటుచేసి ఎంతోమంది నిరుపేదల ఆకలితీరుస్తున్నారు. స్థానికుడిగా ఉంటూ ప్రజా సమస్యలను తన సమస్యగా భావిస్తూ ఎప్పటికప్పుడు వాటి పరిష్కారానికి కృషిచేస్తున్నారు. ఈ క్రమంలో డాక్టర్ ఉగ్రను వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే పాలేటిపల్లి చెరువు కాలువల నిర్మాణం పూర్తవడంతో పాటు పీసీపల్లి మండలాన్ని వెలిగొండ ఆయకట్టు పరిధిలో చేర్చడం, నిమ్జ్ ఏర్పాటు జరుగుతుందని అన్నివర్గాల ప్రజలు భావిస్తున్నారు.

రూ.17.8 కోట్లతో పాలేటిపల్లి చెరువు ఆధునికీకరణ

బ్రిటీష్ కాలం నుంచి ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీ నాయకులకు హామీగా మారిన పాలేటిపల్లి రిజర్వాయరుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే అటు కనిగిరి ఇటు పీసీపల్లి మండలంలోని సుమారు 1500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడంతో పాటు 20గ్రామాలకు తాగునీరు అందించవచ్చని గుర్తించారు. వెంటనే సుమారు 17.8కోట్ల రూపాయల నిధులు తెప్పించి ప్రాజెక్టు నిర్మించి పూర్తిచేయించారు. చెరువు నిర్మాణం పూర్తయ్యేసరికి ఆయన ఎమ్మెల్యే పదవీకాలం ముగిసింది. అప్పటినుంచి ఇప్పటివరకు ఇద్దరు ఎమ్మెల్యేలు మారినా చెరువుకు కాలువలు తీయించకపోవడంతో ఆయకట్టు కింద ఉన్న భూములు నేటికీ బీళ్లుగానే మిగిలాయి. ఆ చెరువులో నీరు నిల్వ ఉండడంతో కనిగిరి మండలంలోని లింగారెడ్డిపల్లి, కొత్తపల్లి, కలగట్ల, పోలవరంతో పాటు పీసీపల్లి మండలంలోని తలకొండపాడు, పాలేటిపల్లి, ముద్దపాడు, పెద్దన్నపల్లి, మర్రికుంటపల్లి, పీసీపల్లి, భట్టుపల్లి గ్రామాల్లో ఇంత వేసవిలోనూ భుగర్భజలాలు అడుగంటకుండా బోర్లు రీచార్జ్ అయ్యి ప్రస్తుతం ఆయా గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చెరువు కాపాడుతోంది.


పాలేటిపల్లి రిజర్వాయరు

ముస్లింలకు అన్యాయం చేసింది వైసీపీనే

● టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ ● వైసీపీ దురాగతాలను ఎండగట్టిన నేతలు


విజయసంకేతం చూపుతున్న టీడీపీ, జనసేన మైనార్టీ నాయకులు

మార్కాపురం, మే 7: ముస్లిం సమాజానికి అన్యాయం చేసింది వైసీపీ ప్రభుత్వమేనని టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ అన్నారు. స్థానిక కళాశాల వీధిలోని సౌజన్య ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం మార్కాపురం నియోజకవర్గస్థాయిలో ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో ముస్లింలకు ఒరిగింది శూన్యమన్నారు. ఏమీ చేయకపోగా మైనార్టీలపై దాడులు అధికమయ్యాయని అన్నారు. ఆ పార్టీ చేసిన దురాగతాలు అన్నీ ఇన్నీ కావన్నారు. నరసరావుపేటలో వక్ఫ్ బోర్డ్ ఆస్థిని కాపాడేందుకు పోరాటం చేసిన 70 ఏళ్ల షేక్ ఇబ్రహీంను వైసీపీ గూండాలు హత్యచేసింది నిజం కాదా..? అని ప్రశ్నించారు. నంద్యాలలో అబ్దుల్ సలాం కుటుంబం ఆత్మహత్యలు చేసుకునేందుకు కారణం వైసీపీ రౌడీలేనన్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో హజీరాను గ్యాంగ్‌రేప్ చేసి చంపింది వైసీపీ దుర్మార్గులేనన్నారు. వైసీసీ నాయకుని కుమార్తెకంటే ప్రతిభ చూపిందని వేధింపులకు గురిచేయడంతోనే మిస్బా అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే వైసీపీ నాయకులు మైనార్టీలపై జరిపిన దురాగతాలు అన్నీ ఇన్నీ కావన్నారు.

రాష్ట్రంలో ఇంత పెద్దఎత్తున ముస్లింలపై దాడులు, దురాగతాలు చోటుచేసుకుంటుంటే ముస్లిం మత పెద్దలు, మేధావులు మాత్రం సిగ్గు, శరం లేకుండా జగన్‌కు మద్దతు ఇస్తూ ప్రెస్‌మీట్లు పెడుతున్నారని అన్నారు. బీజేపీ తో పొత్తు పెట్టుకున్న టీడీపీ 4 శాతం ముస్లిం రిజర్వేషన్లు రద్దుచేస్తుందని అబద్దాలు ప్రచారం చేస్తున్నారన్నారు. అసలు 2004 ఎన్నికల్లో టీడీపీ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ అప్పట్లో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిందన్నారు. టీడీపీ ఇచ్చిన హామీని ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ అమలు చేసిందన్నారు. ఈ నిజం ముస్లిం పెద్దలకు తెలియదా..? అని అన్నారు. ముస్లింల రిజర్వేషన్లకు కోర్టులో పోరాడుతున్న ఆర్.కృష్ణయ్యకు రాజ్యసభ సభ్యత్వం ఇచ్చింది జగన్‌మోహన్‌రెడ్డి కాదా..? అని ప్రశ్నించారు. అంతేకాక సీఏఏ, ఎన్ఆర్‌సీ బిల్లులకు పార్లమెంటులో వైసీపీ ఎంపీలు మద్దతు ఇచ్చారన్నారు. ఇవన్నీ మత పెద్దలకు కనిపించలేదా అన్నారు. మైనార్టీల అభివృద్ధి కోసం శక్తివంచనలేకుండా కృషిచేస్తున్న చంద్రబాబుపై అసత్యాలు ప్రచారం చేస్తే సహించేది లేదన్నారు. ఎన్నికలు మరో వారం రోజుల్లో ఉన్నాయనగా ఇప్పుడు ఢిల్లీ, హైదరాబాద్‌ల నుంచి మేధావులు, మత పెద్దలు కొందరు ప్రెస్‌మీట్‌లు పెట్టి వైసీపీకి ఓటేయమంటే వేసేవాళ్లు ఎవరూలేరన్నారు. మీకు దమ్ము, ధైర్యం ఉంటే రాష్ట్రానికి వచ్చి బహిరంగ చర్చ పెట్టాలన్నారు. మీ స్వార్థం కోసం వ్యవహరిస్తే ఆ అల్లా కూడా క్షమించరని అన్నారు.


కార్యక్రమానికి హాజరైన ముస్లిం మైనార్టీలు

మైనారిటీల కోసం పోరాడింది టీడీపీనే..

మైనార్టీల కోసం పాటుపడింది టీడీపీ మాత్రమేనని ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి అన్నారు. తాను సేవకున్ని మాత్రమేనని నాయకున్ని కాదని అన్నారు. గత 22 సంవత్సరాలుగా తనకు ముస్లిం వర్గాలతో అనుబంధం ఉందన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా తాను సేవచేస్తున్నానని అన్నారు. ఈ ఎన్నికల్లో మైనార్టీలు ప్రధాన భూమిక పోషించాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మార్కాపురం జిల్లా ఏర్పాటు కావడం ఖాయమన్నారు. మీ పిల్లల భవిష్యత్తు బాగుపడుతుందన్నారు. అధికార పార్టీ ధనబలంతో గెలవాలని పోరాడుతోందన్నారు. కానీ తాను ప్రజాబలాన్ని నమ్ముకొని పోరాడుతున్నానన్నారు. ముస్లిం మైనార్టీలు ఓటుతో తనను ఆశీర్వదించాలని కోరారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మిడి కాశీనాథ్ మాట్లాడుతూ ముస్లింలకు మంచి జరగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు రసూల్, టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు డి.మస్తానయ్య, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి సాధిక్, పఠాన్ హుసేన్‌ఖాన్, మయూరి ఖాశిం, ఆదాం సాహెబ్, షాకీర్, జనసేన నాయకులు తిరుమలశెట్టి వీరయ్య, నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన మైనార్టీలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా లేక నీటి కష్టాలు

● అధికారులకు చెప్పినా పట్టించుకోని వైనం


నీటి కోసం క్యూ కట్టిన గ్రామస్థులు

బేస్తవారపేట, మే 7 : మండలంలోని చెన్నుపల్లె గ్రామంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో విద్యుత్ మోటార్లు పనిచేయక నీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోజుల క్రితం గ్రామానికి సరఫరా జరిగే ప్రధాన విద్యుత్ లైన్ తెగిపోవడంతో గ్రామంలో విద్యుత్ సరఫరాలేక విద్యుత్ మోటార్లు పనిచేయడంలేదు. దీంతో గ్రామ ప్రజలు నీటి కోసం అనేక ఇబ్బందులు ఇదుర్కొంటున్నారు. గ్రామంలో స్వచ్ఛందంగా చందాలు వేసుకోని ఆటోలో నీటిని తెచ్చుకుంటున్నారు. ఆటో వద్ద గుమిగూడి నీటి కోసం అనేక పాట్లు పడుతున్నారు. ఇప్పటికైన విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ సరఫరా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎండనుసైతం లెక్కచేయకుండా మద్యం దుకాణం వద్ద మందుబాబులు క్యూ


మద్యం దుకాణం వద్ద మందుబాబుల వరసలు

పొదిలి, మే 7 : ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద మందుబాబులు ఎండను సైతం లెక్క చేయకుండా క్యూ కడుతున్నారు. మద్యం దుకాణాల్లో సమయపాలన కుదించడంతో మందుబాబులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో పనులకు పోయి వచ్చిన తరువాత ఎప్పుడైనా మద్యం ఎప్పుడు తాగాలంటే అప్పుడు దొరుకుతుంది. కానీ ఇప్పుడు సమయపాలన తగ్గించి లిమిట్ పెట్టడంతో ఎప్పుడు అయిపోతాయోనని మందుబాబులు షాపు తీయకముందే క్యూలో నిలబడి ఉంటున్నారు. కానీ ఎన్నికల కోడ్‌తో సమయం కుదించడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని మందుబాబులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాలు మూసేసిన తరువాత బార్‌కు వెళితే క్వార్టర్ బాటిల్‌పై రూ.50 అదనంగా వసూలు చేస్తున్నట్లు వారు చెబుతున్నారు. ప్రైవేటు వ్యక్తులు రూ.100 వసూలు చేస్తున్నారని మందుబాబులు వాపోతున్నారు. బార్‌లో ఎంత పర్సెంటేజ్ అదనంగా వసూలు చేయాలో, ఎంత వసూలు చేస్తున్నారో పరిశీలించే అధికారులు లేకపోవడంతో బార్‌లో ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారని మందుబాబులు వాపోతున్నారు.

ఉరుములు, మెరుపులతో వర్షం


మార్కాపురంలో కురుస్తున్న వర్షం

మార్కాపురం, మే 7: మార్కాపురం పట్టణ, మండల పరిధిలో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కొన్నిరోజులుగా వేసవి వడగాల్పులతో అల్లాడిపోయిన ప్రజలు వర్షం కురిసి చల్లబడడంతో సేదతీరారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షం ప్రభావంతో కాలువలు పొంగిపొర్లాయి. రోడ్లపై నీళ్లుపారాయి. ఉరుములు, మెరుపులతోపాటు గాలుల తీవ్రత ఎక్కువగా ఉండడంతో స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి గృహానికి సమీపంలో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. పెద్ద మసీదు సమీపంలో వృక్షాలు నేలకొరిగాయి. పట్టణంతోపాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈదురు గాలుల ప్రభావం ఎక్కువగా ఉండటంతో విద్యుత్‌ను సరఫరాను నిలిపివేశారు.

అర్థగంట పాటు గాలివాన

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెం మండలం మంగళవారం సాయంత్రం 6.30 గంటలనుంచి ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన కురిసింది. గాలి ఎక్కువ వీయడంతో వర్షం కొద్దిసేపు కురిసింది. దీంతో ఎర్రగొండపాలెం పట్టణ వీధుల్లో నీళ్ల ప్రవహించాయి. పిడుగుల శబ్దాలు ఎక్కువ ఉండడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

ప్రభుత్వ ఉద్యోగులు ప్రలోభాలకు లోనుకావద్దు

యూపీఏ బదిలీపై పోలీసుల నిఘా : కలెక్టర్


ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్

మార్కాపురం, మే 7: పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓట్లు వేసే, ఎన్నికల విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులు ప్రలోభాలకు లోనుకావద్దని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. స్థానిక ఎస్వీకేపీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూంను, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బాలెట్ పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఎస్వీకేపీ కళాశాలలో తగినంత గాలి, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాంకేతిక సిబ్బందితో ఈవీఎంల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతవాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్నీ ఏర్పాటు చేశామన్నారు. పటిష్టమైన పోలీసు బందోబస్తుతోపాటు ఓటర్లకు పోలింగ్ కేంద్రాలలో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు 100 శాతం తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అదే విధంగా యూపీఐ ద్వారా నగదు బదిలీపై ఇటీవల ఎస్పీ ఒక కేసు నమోదు చేసినట్లు తెలిపారు కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, కమిషనర్ రమేష్, పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెంలో 'యువ ఓటరు సంకల్ప ర్యాలీ'

ఎర్రగొండపాలెం, మే 7 : ఎర్రగొండపాలెంలో యువ ఓటరు సంకల్పం ర్యాలీని మంగళవారం నోడల్ టీం అధికారులు నిర్వహించారు. స్వీప్ నోడల్ టీంఅధికారులు మాట్లాడుతూ యువతీ, యువకులు, ప్రతి ఒక్కరు మే 13 వ తేది జరిగే పోలింగ్ రోజున తమకు ఓటు ఉన్న పోలింగ్ స్టేషన్ వెళ్లి ఓటు వేయాలని అన్నారు. కార్యక్రమంలో తహసిల్దారు సోమ్లనాయక్,డిఎల్‌డివో సాయికుమార్, స్వీప్ నోడల్ టీం అధికారి కె శ్రీనివాసరావు, రహ్మతున్నీషాబేగం, నోడల్ ఆఫీసర్ డాక్టరు ప్రదీప్, ఎంపీడీవో నాగేశ్వరప్రసాదు, సచివాలయ, ఉద్యోగులు, యువకులు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

చేరికలతో దూసుకుపోతున్న టీడీపీ

ముత్తుముల సమక్షంలో టీడీపీలో చేరిక

గిద్దలూరు టౌన్, మే 7 : రోజురోజుకు వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. దీంతో పార్టీలో జోష్ పెరిగింది. వరుస గా పార్టీని వీడి పోతున్న వారితో వైసీపీలో నిరాశ నెలకొంటోంది. గడి చిన రెండు నెలలుగా టీడీపీలో చేరిక లు పెరిగాయి. దీంతో గ్రామ పట్టణా లలో పార్టీ పట్ల ఆదరణ పెరుగుతుండడం విశేషం. తాజాగా సుమారు 60 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి ముత్తుముల అశోక్‌రెడ్డి పసుపు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్నారు. నియోజకవర్గ పీకేటీం ఇన్‌చార్జ్ కొంగని శ్రీనివాసయాదవ్ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వా నించారు. మే 13న జరిగే ఎన్నికల్లో అశోక్‌రెడ్డి విజయానికి తాను కృషి చేస్తానని పార్టీలో చేరిన శ్రీనివాసయాదవ్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొత్తపల్లి శ్రీనివాసులు, కేతం శ్రీనివాసులు పాల్గొన్నారు. కంభం టీడీపీ నాయకులు ఇళ్ల సోమయ్య, వేల్పుల భూపాల్, చింతలబోయిన విజయ్, కాకర్ల రవి ఆధ్వర్యంలో కంభంలోని తెలుగువీధికి చెందిన 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి అశోక్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో అబ్బరబోయిన శ్రీరాములు, రమణ, అబ్బర బోయిన సుశీల, మొర్రి బోయిన రంగారావు, లక్ష్మీదేవి, ఆదిలక్ష్మి, సావిత్రి ఉన్నారు. తామంతా ఎన్నికలలో ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డికి, పార్లమెంటు అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డిల విజయానికి కృషి చేస్తామన్నారు. బేస్తవారపేట మండలం జేసీ అగ్రహారం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పందనబోయిన గంగయ్యయాదవ్ ఆధ్వర్యంలో గ్రామంలోని 10 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో దొడ్డి చెన్నారెడ్డి, షేక్ మదార్‌వలి, తదితరులు ఉండగా కార్యక్రమంలో పూనూరి జగన్ మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


వైసీపీని వీడి టీడీపీలో చేరిన కుటుంబాలు

టీడీపీ రోడ్డు షోలకు విశేష స్పందన

ఎరిక్షన్‌బాబు సమక్షంలో పలువురి చేరిక

త్రిపురాంతకం, మే 7: మండలంలోని మేడపి, లేళ్లపల్లి, దువ్వలి గ్రామాల్లో కూటమి తరుపు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు మంగళవారం రోడ్‌షోలు నిర్వహించారు. ఈ రోడ్డుషోలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. ఈ సందర్భంగా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రధాన వీధులలో ప్రచార రథంపై అభివాదం చేస్తూ ప్రచారం నిర్వహించారు. అనంతరం మేడపిలోని ప్రధాన రహదారితోపాటు, బీసీ కాలనీ, ఎస్టీ కాలనీల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13 న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనతోపాటు, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. డాక్టర్ మన్నే రవీంద్ర మాట్లాడుతూ రైతులకు, మహిళలకు న్యాయం జరుగుతుందని, మైనారిటీ, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు టీడీపీలో పెద్దపీట వేశామని అన్నారు. సూపర్ సిక్స్ ఎన్నికల మేనిఫెస్టోలోని పథకాలను వివరించారు.

టీడీపీలోకి 100 మంది బీసీలు

మండలంలోని మేడపిలో 100 మంది బీసీలు మర్రి కృష్ణమూర్తి, మర్రి గంగరాజు, మర్రి రోశయ్య, మర్రి పెద్ద చెన్నయ్య, మేడిబోయిన అంజి, మీసాల వలరాజు, కడియం గురవయ్య ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. కొత్తగా పార్టీలో చేరినవారికి టీడీపీ కండువాలు కప్పిన ఎరిక్షన్‌బాబు, మన్నే రవీంద్ర వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ప్రతి ఒక్కరికీ పార్టీలో తగిన గుర్తింపు ఇస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.శ్రీనివాసరెడ్డి, ఎం.వలరాజు, డి.చలమయ్య, వి.ఆంజనేయులు, ఏ.నాసరరెడ్డి, ఎం.అల్లూరిరెడ్డి, వెంకటనారాయణ, కె.కోటేశ్వరరావు, జి.సునీల్ చౌదరి, కె.ఆంజనేయులు, ఎం.అచ్చయ్య, గుర్రం నారాయణ, పి.శ్రీనివాసరెడ్డి, పి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు : ఐదేళ్ళ అధికారంలో వుండి వెలిగొండను పూర్తి చేయలేదని అసమర్థ ప్రభుత్వంను ప్రజలు సాగనంపాలని యెర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ కూటమీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు అన్నారు .మంగళవారం పుల్లలచెరువు మండలం మురికిమల్ల తాండ, నరజాముల తాండ, యండపల్లి, పెద్ద పీఆర్‌సీ తాండ, చిన్న పీఆర్‌సీ తాండ, కాశికుంట తాండలో ఎన్నికల ప్రచారం చేశారు .ఈ సందర్భంగా టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే టీ5 పనులు మొదలు పెట్టి పుల్లలచెరువు చిన్న కండ్లేరు వరకు టీ5 పొడిగిస్తామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు, యువతకు ఉద్యోగాలు రావాలంటే చంద్రబాబు నాయుడు సీఎం కావాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి మీ ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ మన్నె రవీంద్ర టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, టీడీపీ నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, కాకర్ల కోటయ్య, శనగా నారాయణరెడ్డిమేడికొండ లక్ష్మి నారాయణ, కుమార్, గజ్వేల్లి భాస్కర్, సేవ్యా నాయక్,బద్దు నాయక్ కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎరిక్షన్‌బాబుకు స్వాగతం పలుకుతున్న మహిళలు

టీడీపీలో 20 కుటుంబాలు చేరిక

పుల్లలచెరువు :మండలంలోని వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. మంగళవారం మండలంలోని మురికిమల్ల తాండలతో టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో 20 కుంటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో గిరిజనులకు చేసేందేమి లేదని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, కాకర్ల కోటయ్య, శనగా నారాయణరెడ్డి, టీడీపీ మండల నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెం మదీనా బజారులో ఇంటింటికి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను టీడీపీ మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, టీడీపీ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి పంపిణీ చేస్తూ సైకిల్‌కు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి మనజీవితాల్లో వెలుగులునిండుతాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగుయువత నాయకులు షేక్ వలి, మాజీ ఎంపీటీసీ గఫూర్, టీడీపీ కార్యకర్తలు సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు.



అభివాదం చేస్తున్నఎరిక్షన్‌బాబు, ఆయన సమక్షంలో టీడీపీలో చేరుతున్న కార్యకర్తలు

నారాయణరెడ్డి సమక్షంలో జోరుగా చేరికలు

పొదిలి, మే 7 : కందుల నారాయణరెడ్డి సమక్షంలో పలువురు వైసీపీ నాయకులు మంగళవారం టీడీపీలో చేరారు. పట్టణంలోని స్థానిక టీడీపీ కార్యాలయంలో కొనకనమిట్ల మండలం వెంగళపల్లి, పొదిలి మండలం కుంచేపల్లి గ్రామాల నుండి పలు ఎస్సీ కుటుంబాలు మంగళవారం టీడీపీ తీర్థ పుచ్చుకున్నాయి. పార్టీలో చేరిన వారిలో తాళ్లూరి ప్రకాశం, తాళ్లూరి రాజారావు, గొంగటి శ్యాంసన్, తాల్లూరి ఎల్లయ్యలు టీడీపీలో చేరారు. అదే విధంగా కుంచేపల్లి ఎస్సీకాలనీకి చెందిన తాల్లూరి కుటుంబాలకు చెందిన ఏలియ, రాజయ్య, ఇజ్రాయేల్, ప్రవీణ్, ఎస్తేరమ్మ, మార్తమ్మ, పురుషోత్తం, జైపాల్ తదితరులు టీడీపీలో చేరారు. అనంతరం కందుల నారాయణరెడ్డి పార్టీలో చేరిన వారికి పార్టీ కండువ కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం వెలిగొండ ప్రాజెక్టను పూర్తిస్థాయిలో పూర్తిచేసి అన్ని గ్రామాలకు తాగు, సాగునీరు అందిస్తామన్నారు. ఇవే తనకు చివరి ఎన్నికలు అని తాను మార్కాపురం నియోజకవర్గానికి చేయాల్సినవి మూడు పనులు ఉన్నాయి. మొదటిది వెలుగొండ, రెండవది మార్కాపురం జిల్లా చేయడం, మూడవది పొదిలి పెద్దచెరువు ద్వారా మండలంలో ప్రతి ఎకరాకు నీరిచ్చేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. కనుక ఈ ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని అభ్యర్థించారు.


టీడీపీలో చేరిన వారితో కందుల

టీడీపీ అధికారంలోకి వస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 సంవత్సరాలకే పింఛన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు తెలిపారు. రైతుల పెట్టుబడి నిధికింద ఏడాదికి రూ20వేలు, మహిళకు నెలకు రూ1500, సంవత్సరానికి మూడు గ్యాస్‌సిలెండర్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి ఎన్నో సంక్షేమ పథకాలు టీడీపీ కూటమి పార్టీలు అమలు చేయనున్నట్లు తెలిపారు. కనుక ఉమ్మడి అభ్యర్థులు కందుల నారాయణరెడ్డి, మాగుంట శ్రీనివాసరెడ్డిలకు రానున్న ఎన్నికలలో సైకిల్ గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

టీడీపీలోకి వలసలు

తర్లుపాడు : మండలంలోని కలుజువ్వలపాడు పంచాయతీ ఓబాయపల్లెలో 20 వైసీపీ కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. పార్టీలో చేరిన వారిలో గంట వెంకటేశ్వరరెడ్డి, గంట లక్ష్మీనారాయణరెడ్డి, పెద్ద వెంకటేశ్వరరెడ్డి, లింగారెడ్డి వెంకటరెడ్డి, జట్టు ఆదిరెడ్డి, ఉడుముల కాశీరెడ్డి, వెన్నా తిరుపతిరెడ్డి, యక్కంటి చిన్న వెంకటరెడ్డి, చెన్నబోయిన పిచ్చయ్య, నాగం పెద్ద వెంకటేశ్వర్లు, ఎం.శీను, టి.వెంకటరెడ్డి, ఉడుముల పెద్దకాశిరెడ్డి, కొక్కెర గురవయ్య, చింతలపూడి ప్రతాప్‌లు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి మార్కాపురం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి పార్టీలోకి సాదరంగా ఆహ్వానిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతుం దన్నారు. రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ అధికారంలోకి రావటం ఖాయమన్నారు. ఎమ్మెల్యేగా తనకు, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రావి బాసపతిరెడ్డి, మాజీ సర్పంచ్ యక్కంటి సుబ్బారెడ్డి, కె.నరసింహారావు, అచ్చిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఉడుముల చిన్నపురెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

రూ.300ల పలికిన పొగాకు ధర

పొదిలి, మే 7 : పొగాకు ధరలు అన్నదాతలను రోజురోజుకు ఊరిస్తున్నాయి. ప్రారంభం నుంచి పొగాకు ధరలు నెమ్మదిగా పెరుగుతూనే వచ్చాయి. దీంతో అన్నదాతల ఆనందానికి అవదుల్లేకుండా పోతున్నాయి. అధిక పెట్టబడులు వెచ్చించి పొగాకు సాగు చేసినా కూడా మార్కెట్‌లో మంచి ధరలు ఉండడంతో అన్నదాతలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే మంగళవారం గరిష్ఠంగా కిలో రూ.300లు పలకాయని, కనిష్ఠ ధర రూ.204 పలికినట్లు వేలం నిర్వహణాధికారి ఏఎస్ గిరిరాజ్‌కుమార్ చెప్పారు. ఏదిఏమైనా కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటుధర రావడంతో రైతన్న కష్టాన్ని కూడా మర్చిపోయి ఆనందంలో మునిగి తేలుతున్నారు.

టీడీపీతోనే పేద ప్రజల సంక్షేమం


టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తున్న మల్లిఖార్జున్

మార్కాపురం, మే 7: టీడీపీ అధికారంలోకి వస్తనే పేద ప్రజలకు అన్ని రకాలుగా మేలు జరుగుతుందని ఆ పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లిఖార్జున్ అన్నారు. స్థానిక 4వ బ్లాకులో మంగళవారం టీడీపీ, బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కూటమి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి పథకాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు మద్దెల లక్ష్మి, టీడీపీ నాయకులు ఆలంపల్లి శ్రీనివాసులు, రంగస్వామి, పొత్తం ప్రసాద్ పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి అవకాశం

మార్కాపురం వన్‌టౌన్, మే 7: 2024-25 విద్యా సంవత్సరంలో గిరిజన బాలికలు, బాలుర గురుకుల పాఠశాలలో వివిధ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ కె.నాగమల్లేశ్వరి, శివకుమారి ఒక ప్రకటలో తెలిపారు.

88.93 శాతం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

మార్కాపురం, మే 7: మార్కాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నాలుగు రోజులుగా జరిగిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రంలో 88.93 శాతం పూర్తయినట్లు రిటర్నింగ్ ఆఫీసర్ రాహుల్‌మీనా తెలిపారు. మొత్తం 2685 ఓట్లకు 2388 ఓట్లు పోలైనట్లు వివరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు ఉపయోగించుకోవాలన్నారు.

90.18 శాతం పోలింగ్

గిద్దలూరు, మే 7 : నియోజకవర్గంలో హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లు కలిపి సగటున 90.18 శాతం ఓట్లు పోలయ్యాయి. మంగళవారం 47 హోం ఓటింగ్, 371 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. మొత్తం 4 రోజులకు కలిపి 295 హోం ఓటింగ్‌కు 289 ఓట్లు పోలయ్యాయి. 97.97 శాతం హోం ఓటింగ్ పోలైనట్లు రిటర్నింగ్ అధికారి డి.నాగజ్యోతి ప్రకటించారు. పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి 3220 ఓట్లకు 2881 ఓట్లు పోలయ్యాయి. 89.47 శాతం ఓట్లు పోలైనట్లు పేర్కొన్నారు. హోం ఓటింగ్, పోస్టల్ ఓటింగ్ కలిపి మొత్తం 3515 ఓట్లు ఉండగా 90.18 శాతంమేర 3170 ఓట్లు పోలైనట్లు రిటర్నింగ్ అధికారి వివరించారు.

అశోక్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యం


ప్రచారం చేస్తున్న అనిత

బేస్తవారపేట, మే7: గిద్దలూరు నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అభ్యర్థి అశోక్‌రెడ్డిని గెలిపించాలని టీడీపీ మహిళ విభాగం నాయకురాళ్లు జలగం అనిత, దూదెకుల సారాంబి అన్నారు. మంగళవారం బేస్తవారపేట తేరుబజార్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. నియోజక అభివృద్ధి కావాలంటే టీడీపీ నుంచి పోటీచేస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డి, మాగుమంట శ్రీనివాసులరెడ్డిలను గెలపించాలని ఓటర్లకు విన్నపించారు.

జగన్‌కు ఓటు అడిగే హక్కే లేదు

గిద్దలూరు, మే 7 : వైసీపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు అడిగే హక్కే లేదని ఒంగోలు పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి ఇడా సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి గాంధీ బొమ్మ కూడలి వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అసెంబ్లీ అభ్యర్థి పగడాల రంగస్వామి, కాంగ్రెస్ నాయకులు తిరుమలనాయుడులతో కలిసి రోడ్డుషో నిర్వహించారు. రోడ్డుషోలో పార్లమెంటు అభ్యర్థి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మద్యనిషేధం అమలుజేయకపోతే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని ప్రకటించిన జగన్‌మోహన్‌రెడ్డి ఏ ముఖం పెట్టుకుని మళ్లీ ఓట్లు అడుగుతున్నాడని ప్రశ్నించారు. నాశిరకం మద్యం అమ్మించి కిడ్నీ, లివర్ సమస్యలు తెచ్చిన జగన్‌ను ఇంటికి పంపాలని కోరారు. మూడు రాజధానుల పేరు చెబుతున్నాడే తప్ప ఒక్క ఇటుక కూడా పేర్చలేదని ధ్వజమెత్తారు. కేసుల భయంతో ప్రత్యేక హోదాపై మోడీని ప్రశ్నించలేదని ధ్వజమెత్తారు. ప్రజల ఆస్తులను తాకట్టు పెట్టుకొనే ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. చిత్తూరు జిల్లాలో స్మశానాన్ని కూడా వదలని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చిత్తూరులో ఎందుకు పోటీ చేయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో అసెంబ్లీ అభ్యర్థి పగడాల పెద్దరంగస్వామి పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాభివృద్ధి సాధ్యం

● ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి


అంబవరంలో ప్రచారం చేస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మే 7 : గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఒక్క టీడీపీతోనే సాధ్యమని టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గిద్దలూరు మండలం అంబవరం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మానిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్‌సీపీ నిరంకుశ పాలనలో మరికొద్ది రోజుల్లో ముగియనుందన్నారు. ఇకపై రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతుందని వివరించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో శాసనసభ అభ్యర్థిగా తాను, పార్లమెంట్ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసరెడ్డి పోటీ చేస్తున్నారని, ఇరువురికి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, గ్రామ టీడీపీ నాయకులు అల్లూరయ్య, నారాయణరెడ్డి, కడియం శేషగిరి, పాల్గొన్నారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం


ప్రచారం చేస్తున్న దివ్యేష్‌రెడ్డి

కంభం : కంభం, అర్థవీడు మండలాల్లో పలు గ్రామాలలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. అర్థవీడు మండలం కాకర్ల గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి తనయుడు ముత్తుముల దివ్యేష్‌రెడ్డి మంగళవారం సాయంత్రం ఇంటింటికి తిరిగి కూటమి మానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే కంభంలో మైనారిటీ నాయకులు అనీస్‌అహమ్మద్, దాదా, నాగూర్‌ఖాన్ ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు.

కూటమి అభ్యర్థుల విజయానికి కృషిచేయాలి

పీసీపల్లి, మే 7: టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఎంపీ టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డి విజయానికి కృషిచేయాలని ఇరిగినేని రవీంద్రబాబు అన్నారు. మండలంలోని పెద అలవలపాడు, రేగడ, వెంగళాపురం, నేరేడుపల్లి గ్రామాల్లో టీడీపీ నాయకులతో కలిసి మంగళవారం రాత్రి ఎన్నికల వ్యూహంలో భాగంగా పోల్ మేనేజ్‌మెంట్‌పై చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు అమలవుతాయని చెప్పారు. ఈ పథకాలతో ప్రతి కుటుంబానికి ఆర్థికపరమైన మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గుర్రం వెంకటేశ్వర్లు, గడ్డం బాల సుబ్బయ్య, బీఎస్, పువ్వాడి నాగరాజు, మాదవరపు నరసింహులు, రాయ బ్రహ్మయ్య, పువ్వాడి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థులను గెలిపించాలి

పామూరు, మే 7: టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎంపీపీ పువ్వాడి తిరుపతమ్మ కోరారు. మండలంలోని దాదిరెడ్డిపల్లి పంచాయతీలో టీడీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ ఈవీఎం నమూనాతో ఓటువేసే విధానాన్ని వివరిస్తూ చంద్రబాబు ప్రవేశపెట్టిన పథకాల గురించి అవగాహన కల్పించారు. ఎంపీగా మాగుంటను, ఎమ్మెల్యేగా ఉగ్రను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వీరభద్రపురం సర్పంచ్ పువ్వాడి జయమ్మ, పువ్వాడి వెంకటలక్ష్మమ్మ, అబ్బూరి శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డాకు సన్మానం

కనిగిరి, మే 7: టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కనిగిరి నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ దొడ్డా వెంకటసుబ్బారెడ్డిని సోమవారం రాత్రి స్థానిక ప్రయివేటు ఫంక్షన్ హాలులో ఘనంగా సన్మానించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త శ్యామల కాశిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీకి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి ఎనలేని సేవలందించారని చెప్పారు. ఎన్ని ఒడిదుడుకులు ఏర్పడినా టీడీపీ వీడకుండా 40ఏళ్ళుగా పార్టీకి సేవలందించటం ఆయన నిజాయితీకి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భేరి పుల్లారెడ్డి, వీవీఆర్ మనోహరరావు(చిరంజీవి), ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, రోషన్ సంధాని, సురేంద్రబాబు, గోనా ప్రతాప్, ఇంద్రబూపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ బేఖాతర్

- జడ్పీటీసీ కార్యాలయంలో వైసీపీ నాయకుల లావాదేవీలు
- ఎంపీడీవోను నిలదీసిన టీడీపీ నాయకులు



ఎంపీడీవోతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వెలిగండ్ల, మే 7: ఎన్నికల కోడ్ అమల్లోఉన్నా వైసీపీ నాయకులు లెక్క చేయడంలేదు. వెలిగండ మండలకేంద్రంలోని జడ్పీటీసీ కార్యాలయంలో నగదు లావాదేవీలు, ప్రచారానికి సంబధించిన కార్యక్రమాలు, నిర్వహిస్తున్నారు జడ్పీటీసీ కార్యాలయం ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ఉంది. ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలుచేయాల్సిన అధికారులు, సిబ్బంది పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఈసంఘటనపై మంగళవారం టీడీపీ మండల నాయకలు ఎంపీడీవోను ప్రశ్నించారు జడ్పీటీసీ కార్యాలయంలో వైసీపీ నాయకులు సమావేశాలు నిర్వహించకుండా కార్యాలయాన్ని మూసేయాలని తెలిపారు.

యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన

పామూరు, మే 7: మండలంలోని వగ్గంపల్లి గ్రామంలో వైసీపీ నాయకులు ఎన్నికల కమిషన్ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. విద్యుత్ స్తంభాలకు, ఇళ్లకు జగన్ కోసం సిద్ధం స్టిక్కర్లను అంటించారు. దీనిపై సంబంధిత అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వైసీపీ స్టిక్కర్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోని కనిగిరి

- టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర
- 44 కుటుంబాలు పార్టీలో చేరిక

కనిగిరి, మే 7: వైసీపీ పాలనలో కనిగిరి నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో మంగళవారం 44 కుటుంబాలు వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు.



కనిగిరిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఆర్యవైశ్యులు, ముస్లింలు

సీఎస్‌పురం మండలకేంద్రానికి చెందిన 20 కుటుంబాలు, పామూరు మండలం బోడవాడకు చెందిన ఆరు కుటుంబాలు, పీసీపల్లి మండలం నేరేడుపల్లి గ్రామానికి చెందిన 18 కుటుంబాలు టీడీపీలో చేరారు. వారికి డాక్టర్ ఉగ్ర టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు కేవలం ఆరు రోజులు వ్యవధి మాత్రమే ఉందన్నారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాత, కొత్త తేడా లేకుండా కలసికట్టుగా అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వస్తే కనిగిరిలో జరిగే అభి వృద్ధి గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి దేశచరిత్రలో నిలిచిపోయేలా మెజార్టీ సాధించనుందన్నారు. ఈనెల 13తో రాక్షస పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించనుందన్నారు.

వైసీపీ పాలనలో కనిగిరి ఏమాత్రం అభివృద్ధికి నోచుకోకపోవటం పాలకుల నిర్లక్ష్యం వలనేనని డాక్టర్ ఉగ్ర పేర్కొన్నారు. తిరిగి అలాంటి నేతలే ఓట్లు కోసం కల్లబొల్లి మాటలు చెప్పేందుకు ప్రచారానికి వస్తున్నారన్నారు. కనిగిరిలో జరిగిన అభివృద్ధిపై ఓటర్లు వారిని నిలదీయాలన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లో విస్తృతంగా తీసుకువెళ్ళాలని పార్టీలో చేరిన వారికి సూచించారు. ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేయాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. అత్యధిక మెజార్టే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పామూరు, సీఎస్‌పురం, పీసీపల్లి మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



పీసీపల్లి: చింతగుంపల్లిలో ఉగ్రకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న తనయుడు జయసింహారెడ్డి



వైసీపీని వీడి డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన సీఎస్‌పురం వాసులు

కనిగిరి అభివృద్ధి ఉగ్రతోనే సాధ్యం

కనిగిరి, మే 7: కనిగిరి ప్రాంతం అభివృద్ధి ఉగ్రతోనే సాధ్యమవుతుందని టీడీపీ వాణిజ్య విభాగం నాయకుడు వీవీఆర్ మనోహరరావు(చిరంజీవి) అన్నారు. స్థానిక మున్సిపాల్టీ పరిధిలోని 8వ వార్డులో మంగళవారం సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటిని సందర్శించి టీడీపీ మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు సీఎంగా రాష్ట్రానికి, కనిగిరి ప్రాంతానికి ఎమ్మెల్యేగా ఉగ్రనరసింహారెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్, అహ్మద్, అజయ్, వెలుగూరి చంద్ర, మారుతీకుమార్ గుప్తా, ఐటీసీ శ్రీను, బొగ్గరపు సుందర రాజా, ఐవీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రను ఆశీర్వదించండి

పీసీపల్లి, మే 7: టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన తనయుడు జయసింహారెడ్డి కోరారు. మంగళవారం చింతగుంపల్లి పంచాయతీలో తన తండ్రికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లిన ఆయన టీడీపీ కూటమి ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు.

ఎంపీగా మాగుంట శ్రీనివాసరెడ్డిని, ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న ఉగ్ర నరసింహారెడ్డిని గెలిపించాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. తన తండ్రి ఎమ్మెల్యే కాగానే నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను జయసింహారెడ్డి ప్రజలకు వివరించారు.

కార్యక్రమంలో పిచ్చిరెడ్డి, వీరయ్య, ఓబుల్‌రెడ్డి, మాలకొండారెడ్డి, మహేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా!

- టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి

ముండ్లమూరు, మే 7: 'ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చా.. మీ బిడ్డగా అక్కున చేర్చుకుని ఆశీర్వదించండి.. నియోజకవర్గాన్ని మీరు ఆశించిన విధంగా అభివృద్ధి చేసి చూపిస్తా' అని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని కెల్లంపల్లి, బసవాపురం, శ్రీనివాసనగర్, జగత్‌నగర్, నందమూరినగర్, కమ్మవారిపాలెం, వేముల, చింతలపూడి, పసుపుగల్లు, పెదఉల్లగల్లు గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ మీరు చూపిస్తున్న అభిమానం నాజీవితంలో మరిచి పోలేనన్నారు. తమ కుటుంబానికి ముండ్లమూరు మండలానికి 40 ఏళ్లగా అనుబంధంగా ఉందన్నారు. మా తాత స్వర్గీయ గొట్టిపాటి హనుమంతరావు, మా తండ్రి నరసయ్య మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. వారిఆశయాలకు అనుగుణంగానే రాజకీయాల్లోకి వచ్చినట్టు చెప్పారు. ఒక్క చాన్స్ పేరుతో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశం చేశారన్నారు. ప్రస్తుత పరిస్థితిల్లో చంద్రబాబునాయుడు ముఖ్య మంత్రి అయితే తప్ప రాష్ట్రానికి భవిష్యత్తు లేదన్నారు.



లక్ష్మిని భారీ గజమాలతో సత్కరిస్తున్న శ్రీనవాసనగర్ టీడీపీ నాయకులు


కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ పమిడి రమేష్, మాజీ ఎంపీపీ మండలపు వెంకట్రావు, టీడీపీ మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, నాగరాజు, వరగాని పౌల్, సోమేపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ ఆదెమ్మ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బసవాపురంలో 20 కుటుంబాలు టీడీపీలో చేరిక

ముండ్లమూరు, మే 7: మండలంలోని బసవాపురం ఎస్సీ కాలనీకి చెందిన 20 కుటుంబాలు గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో మంగళవారం టీడీపీలో చేరారు. వారి మెడలో టీడీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో గురవయ్య, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన సాయినగర్ వాసులు

దర్శి, మే 7: దర్శి నగర పంచాయతీలోని సాయినగర్‌కు చెందిన పలు కుటుంబాలు మంగళవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. డాక్టర్ లలిత్ సాగర్ వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల కు వైసీపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. వైసీపీ పాలకుల అరాచకాలు, అక్రమాలు సహించలేక ఆపార్టీకి చెందిన నాయకులు కార్యకర్త లు, అన్నివర్గాల ప్రజలు టీడీపీలో చేరుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



లక్ష్మి సమక్షంలో టీడీపీలో చేరిన బసవాపురం గ్రామస్థులు

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి



ఎన్నికల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎస్ఐ సైదుబాబు

పామూరు, మే 7: స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ ఎం.సైదుబాబు తెలిపారు. మంగళవారం పట్టణంలో సాయుధ బలగాల తో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా అంకాలమ్మ వీధిలో ఓటు హక్కు వినియోగం గురించి వివరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడం చట్టరీత్యా నేరమన్నారు. పోలింగ్ రోజు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు

దర్శి, మే 7: ఓటర్లందరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించు కోవాలని దర్శి అసెంబ్లీ ఎన్నికల రిటన్నింగ్ అధికారి ఎంపీఎస్ లోకేశ్వరరావు సూచించారు. మంగళవారం దర్శిలో జరిగిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. అందరూ ఓటువేసి ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలని కోరారు. ఓటర్లు నిర్భయంగా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు ఎంపీడీవోలు హనుమంతరావు, యుగకీర్తి, శంకరరావు, సీఐ సుందరరామయ్య, ఏపీవో కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అబ్జర్వర్

దర్శి, మే 7: దర్శిలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల ప్రక్రియను ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ హసీబ్‌రహమాన్ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన పోలింగ్ జరుగుతున్నతీరును, బ్యాలెట్ బాక్సులు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టల్ బ్యాలెట్ ఓట్లను పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్ హసీబ్‌రహమాన్

టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకుల దాడి

- దర్శి ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న సత్యనారాయణ
- పరామర్శించిన టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి

దర్శి, మే 7: మండలంలోని చందలూరులో టీడీపీ కార్యకర్త ఎస్‌కేవీ సత్యనారాయణపై అదేగ్రామానికి చెందిన వైసీపీ నాయకులు సోమవారం రాత్రి దాడిచేశారు. ఆయన తలకు బలమైన దెబ్బ తగలటంతో దర్శి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. సత్యనారాయణ, సర్పంచ్ భర్త మారెళ్ల సుబ్బారావు, మరోవ్యక్తి కలిసి ఊరు బయట మాట్లాడుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న వైసీపీ నాయకులు అడ్డగిరి నాగేశ్వరరావు, చవలం రామాంజనేయులు, జి.శేఖర్ అక్కడుకు వెళ్లి వారితో గొడవకు దిగారు. తాము సర్పంచ్‌గా గెలిపిస్తే టీడీపీ నాయకులతో కుమ్మక్కయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈక్రమంలో వారిపై దాడిచేశారు. ఈ దాడిలో సత్యనారాయణ కిందపడిపోగా బండరాయి తగిలి తలకు బలమైన గాయమైంది. మిగిలిన వారిని దూషించి చేతులతో కొట్టి వెళ్లారు. క్షతగాత్రుడు సత్యనారాయణను దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దర్శి ఎస్సై సుమంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సత్యనారాయణను పరామర్శించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దాడిలో గాయపడి ఆసుపత్రితో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త సత్యనారాయణను టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మంగళవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు టీడీపీ శ్రేణులపై దాడులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడికి పాల్పడినవారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. బాధితుల కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరు తదితరులు పాల్గొన్నారు.



దాడిలో గాయపడిన కార్యకర్త సత్యనారాయణను పరామర్శిస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి తదితరులు

తాటి ముంజలకు పెరిగిన గిరాకీ

పామూరు, మే 7: మండుతున్న ఎండలకు తల్లడిల్లుతున్న ప్రజలు దాహార్తి తీర్చుకొనేందుకు శీతల పానీయాలతోపాటు, ప్రకృతి ప్రసాదించే కర్బూజ కాయలు, కొబ్బరిబోండాలతో పాటు తాటి ముంజలను కొనుగోలుచేసి ఎండల నుంచి ఉపశమనం పొందుతున్నారు. తాటి ముంజలలో పోషక విలువలు పుష్కలంగా లభిస్తాయి. ఎండలలో తిరిగి వచ్చేవారికి రెండు ముంజలు తింటే ఉపశమనం అభిస్తుంది.



తాటి ముంజల విక్రయం

గతంలో గంపలలో వేసుకొని రూ.10లకు ఐదు ముంజెలు ఇచ్చేవారు. ప్రస్తుతం ముంజల లభ్యత రానురాను తగ్గిపోతుంది. పామూరు, సీఎస్‌పురం, పీసీపల్లి మండలాల్లోని పలుగ్రామాల నుంచి తాటి కాయలను ఆటోల్లో తెచ్చుకొని స్థానిక నెల్లూరు రోడ్ ప్రాంతంలో వేప చెట్లకింద పెట్టుకొని ఒక తాటి కాయను రూ.10 వంతున అమ్ముతున్నారు. వేసవి కాలంలోనే లభించే ముంజలకోసం ప్రజలు ఎదురుచూస్తుంటారు. గ్రీష్మతాపానికి తాటి ముంజలు విరుగుడుగా చెప్పవచ్చు. వేసవి కాలంలో మాత్రమే లభించే తాటి ముంజలను ధర ఎంతున్న వాటిని కొనుగోలు చేస్తుంటారు. ఇప్పుడిప్పుడే మార్కెట్‌లో లభ్యమవుతుండటంతో ముంజల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండటంలేదు. రూ.50 పెడితే గాని ఇంట్లోని కుటుంబసభ్యులందరికీ సరిపోవు.

మండలంలోని వెంకటాపురం కంభంపాడు కొత్తపల్లి, రేణిమడుగు బలిజపాలెం తదితర గ్రామాల్లో తోట యజమానుల నుంచి సీజన్‌కు చెట్లను కొనుగోలు చేస్తారు. చెట్లనుంచి తాటికాయలను కోసుకొని వాటిని పామూరుకు తెచ్చి విక్రయిస్తుంటారు. తాటికాయలను కొడవలితో ఒలిచి ముంజలను అమ్ముతుంటారు. అయితే, అమ్మకందారులు గిట్టుబాటు కావడంలేదని వాపోతున్నారు. తాటి ముంజలను కొనుగోలు చేసుకొని వాటిని ఆటోల ద్వారా పామూరుకు తెచ్చి విక్రయిస్తుంటామని చెప్పారు. ఇద్దరు మనుషులు ఎర్రటి ఎండలో కూర్చొని విక్రయించినా, ఖర్చులకుపోను కూలీ గిట్టుబాటు కావడంలేదని అమ్మకందారులు వాపోతున్నారు.

తాటి చెట్లకు రియల్ దెబ్బ..

ఒకప్పుడు గ్రామాల్లో తాటిచెట్లు కళకళలాడేవి. పొలం, చెరువు గట్లపైనా రహదారుల పక్కన విరివిగా ఉండేవి. తాటి ముంజ, తాటి నారా, తాటిబోదె, ఇలా తాటిచెట్లు అణువణువునా ప్రజల అవసరాలను తీర్చేవి. ప్రస్తుతం సాగు భూములను రియల్ ఎస్టేట్ రంగం కమ్మేస్తున్న క్రమంలో తాటిచెట్లు కనుమరుగైపోతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతుండటంతో తాడిచెట్లు అంతరించిపోతున్నాయి.

భూయాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

తాళ్లూరు, మే 7: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూయాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. టీడీపీ రాష్ట్ర కమిటీ ఆదేశం మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టంతో భూయజమానులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ చట్టం ప్రకారం భూహక్కుదారుడికి సంబంధించిన ఒరిజ నల్ పత్రాలు యజమానులకు అందకుండా చేయటం, కోర్టులను ఆశ్రయించేందుకు సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలన్న నిర్ణయం సముచితంగా లేదన్నారు. భూయజమానుల హక్కులను అధికారుల చేతుల్లో పెట్టేందుకు యత్నిస్తున్నారంటే యజమానుల చేతుల్లో నుంచి వైసీపీ నేతలపరం చేసేందుకు కుట్ర జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుమ్మడిసాయి, శాగం కొండారెడ్డి, మానం రమేష్, జనసేన నేత మారిశెట్టి హనుమంతరావు, బీజేపీ మండల అధ్యక్షుడు అనుమల కోటేశ్వరరావు, వంగపల్లి నాగేశ్వరరావు, పి.అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



భూయాజమాన్య హక్కు చట్టాన్ని రద్దుచేయాలంటూ వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

గంగాభవానికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, మే 7: పవిత్ర పుణ్యక్షేత్రమైన గుంటిగంగాభవానీ అమ్మవారి కృపకు భక్తులను మరింత చేరువ చేసేందుకు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పి.కార్తిక్, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం మంగళవారం తెలిపారు. అమ్మవారికి ప్రతి మంగళవారం, శుక్రవారం వేకువ జాముల్లో అభిషేకాలు, సుప్రభాత సేవ, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలు చేపట్టేందుకు దేవదాయశాఖ నిర్ణయించినట్లు తెలిపారు. అమ్మవారికి విరాళాలు అందజేసిన దాతలు, భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. బుధవారం మంచి రోజయినందున గంగాభవాని ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీడీపీలో పలువురు చేరిక

దొనకొండ, మే 7: మండలంలోని పోలేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన పలువురు వైసీపీ సానుభూతిపరులు టీడీపీ నాయకుడు కందుల నారపరెడ్డి ఆధ్వ ర్యంలో మంగళవారం డాక్టర్ లలిత్‌సాగర్ సమక్షంలో పార్టీలో చేరారు. కాలనీకి చెందిన బెజవాడ వెంకటయ్య, బెజవాడ అబ్రహం, బెజవాడ మరియదాస్, మరికొందరికి డాక్టర్ లలిత్‌సాగర్ టీడీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ఆయన కోరారు.



పోస్టల్ పోలింగ్..



● గుంటూరు ఏసీ కళాశాలలో క్యూ



పోస్టల్ ఓటు వేసేందుకు గుంటూరు ఉమెన్స్ కాలేజీలో బారులు తీరిన ఉద్యోగులు

ప్రహసనం

- పోటెత్తిన ఉద్యోగులు.. ఓటింగ్‌లో గందరగోళం
- ఓటింగ్‌లో ఉద్దేశ పూర్వకంగా జాప్యం
- అస్తవ్యస్తంగా మారిన అధికారుల నిర్ణయాలు
- ఆర్వోల తీరుపై ఆగ్రహం, సిబ్బందితో వాగ్వాదం
- ఎక్కువ ఓటర్లకు తక్కువ బూత్‌లతో ఇబ్బందులు
- పోలింగ్ శాతాన్ని తగ్గించే కుట్ర అంటూ మండిపాటు
- జాబితాలో పేర్లు గల్లంతు.. దరఖాస్తు చేసినా మొండిచెయ్యే
- తాడికొండలో ఉద్యోగులను గెంటివేయించిన ఆర్వో

తెనాలి, గుంటూరు, పొన్నూరు టౌన్, నరసరావుపేట, చీరాల, బాపట్ల, మే 7: ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గిపోతుంది.. అందరూ ఓటు వేయాలని పెద్దఎత్తున ప్రచారాలు, చైతన్య సదస్సులు అధికారులు నిర్వహిస్తున్నారు. అయితే తమ తోటి ఉద్యోగులు ఓటు వేసేందుకు వచ్చినా వారికి ఆ అవకాశం లేకుండా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను ప్రహసంగా మార్చారన్న విమర్శలు వస్తున్నాయి. తొలి రోజు తక్కువ మంది ఓటర్లు ఉండటంతో ఎటువంటి అవాంతరాలు ఎదురుకాలేదు. మంగళవారం చోటుచేసుకున్న పరిణామాలు చూస్తే కావాలనే ఉద్యోగ ఓటర్లకు ఇబ్బందులు సృష్టించారా అన్న అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. పోలింగ్ ప్రక్రియ ప్రారంభంలోనే జాప్యం చేశారు. ఇక ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా కేంద్రాల ఏర్పాటు లోనూ నిర్లక్ష్యం చూపారు. కనీస సౌకర్యాలు కూడా చాలాదగ్గర్ల కల్పించలేదు. బ్యాలెట్ ఓట్ల అమ్మకాలు జరగకుండా ఎన్నికల సంఘం తీసుకున్న కొత్త నిర్ణయాలు ఉద్యోగులకు అగ్ని పరీక్షగా మారాయి. గతంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఉద్యోగులు పెద్దగా ఆసక్తి చూపేవారు కాదు. అభ్యర్థులే పోస్టల్ బ్యాలెట్ సేకరించి వినియోగించుకునేందుకు ప్రయత్నాలు చేసేవారు. అయితే గడిచిన ఐదేళ్లలో చోటుచేసుకున్న పరిణామాలతో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి నెలకొంది. దీంతో ఈ దఫా ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉద్యోగులు ఉన్న నేపథ్యంలో ఎన్నికల అధికారులపై అధికార పార్టీ నేతలు, అభ్యర్థులు ఒత్తిడితేవడంతో వారు రెండు రోజులుగా పోస్టల్ బ్యాలెట్ నిర్వహణలో దురుద్దేశపూరక వైఖరి అవలంబించారని ఉద్యోగులు వాపోయారు. తమ ఓటుకు సంబంధించి ఉద్యోగులు రెండు రోజుల నుంచి ఫిర్యాదులు చేస్తున్నా అధికారుల్లో చలనం లేదు. మంగళవారం పరిణామాలను దృష్టిలో ఉంచుకుని బుధవారమైనా అదనపు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. అంతేకాక మరో రోజు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. బుధవారం పోలీసులకు అవకాశం కల్పించారు. అయితే ఎక్కువ మంది ప్రధాని నరేంద్ర మోదీ పర్య టన బందోబస్తు ఉండడంతో గురువారం కూడా వారికి అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది తీరు వల్ల అనేకమంది తమ ఓటు హక్కు వినియోగించుకోలేక పోయారు. తమ వద్ద ఓటు లేదంటూ వెనుక్కు తిప్పి పంపారు. ఈనేపథ్యంలో గురువారం కూడా అవకాశం కల్పించి ప్రతి ఒక్క ఉద్యోగి ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులపై ఉంది.

కుట్రలపై అనుమానాలు

ప్రభుత్వ ఉద్యోగుల్లో 90 శాతం అధికార పార్టీపై అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలో వారు తమ అభ్యర్థులకు వ్యతిరేకంగా ఓటు వేస్తారనే భావనలో వైసీపీ నేతలున్నారు. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత ఎక్కువ మందిని ఓటుకు దూరం చేసే కుట్రలో భాగంగానే పోస్టల్ బ్యాలెట్‌లో గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్నారా అన్న అనుమానాలు ఉద్యోగుల నుంచే వస్తున్నాయి. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ మొదలైన దగ్గర నుంచి ఓటింగ్‌లో అవాంతరాలపై ఉద్యోగులు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. దరఖాస్తు చేసుకున్నా జాబితాలో ఓటు లేకపోవడం, ఫెసిలిటేషన్ కేంద్రాలు తగినన్ని ఏర్పాటు చేయకపోవడం, ఓటు విషయంలో గందరగోళం తదితరాలపై కనీస చర్యలు లేవు. మరోవైపు ఆయా కేంద్రాల వద్ద వైసీపీ ప్రలోభాల పర్వం నడుస్తూనే ఉంది. గతానికి భిన్నంగా ఈ సారి ఎన్నికల్లో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం అత్యధికంగా ఫాం 12 దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఓటింగ్ శాతాన్ని తగ్గించడానికి ఎన్నికల అధికారుల ద్వారా వైసీపీ నాయకులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని సమాచారం. దీంతో ఫెసిలిటేషన్ కేంద్రాలకు వచ్చి వారు ఓటు వేయకుండా చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో కేంద్రాల వద్ద సౌకర్యాలు ఏర్పాటు చేయకుండా ఇబ్బందులకు గురి చేసి ఓటింగ్‌కు దూరమయ్యేలా చేయాలనే కుట్రలో భాగమే ఇదంతా అని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అరకొర ఏర్పాట్లతో పాటు ఎన్నికల అధికారులు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తమ ఓటు ఎక్కడ ఉందో చెప్పకుండా ఇబ్బందికి గురిచేస్తున్నారని ఓటర్లు ఆరోపిస్తున్నారు. ఒక్కో ఉద్యోగి రెండు రోజులుగా రెండుమూడు పోలింగ్ సెంట ర్లకు వెళ్లి తమ ఓట్లను వెతుక్కోవాల్సిన పరిస్థితి కల్పించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గుంటూరు ఫోన్ లైట్ కాంతిలో ఓటు వినియోగించుకుంటున్న ఉద్యోగులు



బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఉద్యోగులు

దరఖాస్తు చేసుకున్నా ఓట్లు గల్లంతు

విధుల నిమిత్తం బాపట్ల జిల్లాలో ఉంటూ మరో జిల్లా పరిధిలో ఓటు ఉన్న వారికి ఇక్కడి జిల్లా కేంద్రాల్లో ఓటు వేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. అయితే తమపేరు లేదని ఉద్యోగులు వాపోతున్నారు. జిల్లా మొత్తానికి బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 3,527 మంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటు ఉంది. అయితే ఓటు హక్కు వినియోగం కోసం వచ్చిన పలువురు ఉద్యోగులకు జాబితాలో పేరు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. తెనాలిలో ఓటు హక్కు ఉన్న ఓ ఉద్యోగి విధి నిర్వహణ బాపట్ల జిల్లా వేమూరులో చేస్తుండడంతో ఓటు వినియోగానికి మంగళవారం బాపట్లకు రాగా జాబితాలో పేరు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం ఫాం 12 దరఖాస్తు చేసినా జాబితాలో పేరు లేకపోవడం ఏమిటని వాపోయారు. ఇదే రీతిన పలువురి ఓటు గల్లంతుకాగా వారి కోసం ఓ రిజిష్టర్ ఏర్పాటు చేశారు. ఈ జాబితాలో వంద వరకు నమోదు చేసుకున్నారు. ఫాం12 దరఖాస్తు చేసినా పేరు ఎందుకు లేదనే ప్రశ్నకు ఆర్వోల నుంచి సమాధానం కరువైంది. పోలీసు బలగాలు సరిపడా లేని జిల్లాల్లో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ క్యాడెట్ల సేవలు వినియోగించుకుంటున్నారు. బాపట్ల జిల్లాలో 650 మంది క్యాడెట్లు ఎన్నికల విధుల్లో పాల్గొననడానికి అనుమతి తెలిపారు. వీరికి కూడా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలి. అయితే కేవలం 150 మందికి మాత్రమే పోస్టల్ ఓటు వచ్చింది. వేరే జిల్లాలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు ఓటుకు దూరమయ్యారు.

ఫెసిలిటేషన్ సెంటర్లపై నిర్లక్ష్యం

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సందర్భంగా 2019 నాటి సంఘటనలు పునరావృతం అయ్యాయి. ఫెసిలిటేషన్ సెంటర్లలో అరకొర వసతులు, ఓటర్లకు తగినట్లుగా కౌంటర్లు లేకపోవడం వంటివి తిరిగి చోటు చేసుకున్నాయి. దీంతో ఉదయం 8 గంటలకు క్యూలైన్‌లోకి వెళ్లిన ఓటరు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసి బయటకు రావడానికి మధ్యాహ్నం 2 గంటల వరకు సమయం పడుతుందని ఉద్యోగులు వాపోయారు. వేల సంఖ్యలో ఓటర్లున్న నియోజకవర్గాల్లోనూ ఫెసిలిటేషన్ సెంటర్‌లో అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయలేదు. తొలి రెండు రోజులు కేవలం పీవోలు, ఏపీవోలు, మైక్రో అబ్జర్వర్లకు పోస్టల్ బ్యాలెట్ కావడం వలన పెద్దగా సమస్యలు రాలేదు. ఇందుకు కారణం వారి సంఖ్య చాలా తక్కువ. మంగళవారం ఒక్కో సెంటర్‌కి వేల సంఖ్యలో ఓటర్లు తరలివచ్చారు. వారిని అదుపు చేయలేక అధికార యంత్రాంగం చేతులెత్తేసింది. ప్రత్యామ్నాయంగా ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా నాలుగైదు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. గత నెల 10వ తేదీనే 'పోస్టల్ బ్యాలెట్లు... పాట్లు' అనే శీర్షికతో 2019లో ఫెసిలిటేషన్ సెంటర్లలో జరిగిన గందరగోళంపై కథనాన్ని ప్రచురించింది. అయినప్పటికీ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో వైఫల్యం చెందారు. ఈ కారణంగానే మంగళవారం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పలు ఫెసిలిటేషన్ సెంటర్లలో తీవ్ర గందరగోళం తలెత్తింది.

తెనాలిలో బేరసారాలు

తెనాలిలో పోస్టల్ బ్యాలెట్ ఓటు కోసం అధికార పార్టీ నాయకులు మంగళవారం రోజంతా బేరసారాలు చేపట్టారు. మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో పది మందికి పైగా ఏజంట్ల పేరుతో వైసీపీ నాయకులు ఉండి బేరాలు చేస్తూనే ఉన్నారు. అయితే పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు నగదు తీసుకునేందుకు ఆసక్తి చూపలేదు. గత ఎన్నికల్లో రూ.2 వేలకు కక్కుర్తి పడితే లక్షల్లో నష్టం తెచ్చారని, ఈ సారి మోసపోలేమని వారిముఖంపైనే తేల్చి చెప్పారు.

నరకం చూపారు..

ఓటు హక్కు వినియోగించుకునేందుకు కసిగా కదం తొక్కిన ఉద్యోగులకు ఎన్నికల అధికారులు నరకం చూపించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల్లో అత్యధిక మంది గుంటూరు పశ్చిమలో నివాసం ఉంటున్నారు. వారిలో ఎక్కువ మందికి ఓటు ఎక్కడ ఉందనే విషయంపై సోమ, మంగళవారాల్లో అధికారులు గందరగోళం సృష్టించారు. అక్కడికి ఇక్కడికి అంటూ తిప్పడంతో అసహనం వ్యక్తం చేశారు. ఇక పలు నియోజకవర్గాల్లో ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. కసిగా ఉన్న ఉద్యోగులు ఉదయమే వచ్చి పడిగాపులు కాశారు. తీరిగ్గా వచ్చిన అధికారులు ఆ తర్వాత కూడా తీవ్ర జాప్యం చేస్తూ వచ్చారు. ఉద్యోగ ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా కౌంటర్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో క్యూల్లో తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఉదయం 7 గంటలకు కేంద్రం వద్దకు వచ్చిన ఉద్యోగులు సాయంత్రం 4 వరకు కూడా ఓటును వినియోగించుకోలేకపోయారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అనారోగ్య సమస్యలున్న వారు గంటలకొద్ది వేచి ఉండలేక, ఓటు వేయకుండా వెనుతిరగలేక సతమతమయ్యారు. వారే ఎదురు చూసి వెనక్కి వెళ్ళిపోతారులే అనే ఉద్దేశంగా పలు కేంద్రాల వద్ద పోలింగ్ వ్యవహారం సాగినట్లు పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. అయినా మెజారిటీ సంఖ్యలో ఉద్యోగులు నిరీక్షించి మరీ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. గుంటూరు పశ్చిమలో రాత్రి 9 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ సాగింది.

ఓటేసే వరకు వెళ్లం..

ఓటు హక్కు కల్పించండి.. ఓటు వేసే వరకు వెళ్లేది లేదు.. అని తాడికొండకి సంబంధించి లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో కేంద్రంలో ఉద్యోగ ఓటర్లు ఆందోళనకు దిగారు. మంగళవారం ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన ఓటింగ్ ప్రక్రియ 11 గంటలకు ప్రారంభమైంది. తొలుత ఓట్లు ఉన్నాయని చెప్పి తీరా సాయంత్రం 5 గంటలకు ఓటు లేదు.. మీమీ నియో జకవర్గాలు, పనిచేసే చోటే ఓట్లు వేసుకోవాలని ఆర్వో గంగరాజు చెప్పటంతో ఉద్యోగులు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి వర్షం పడు తున్న ఉద్యోగులు వర్షంలోనే నిల బడి ఓటు కోసం అభ్యర్థించారు. ఓ సందర్భంలో ఉద్యోగులను పోలీ సులు చేత బయటకు గెంటివేయించారు. దీంతో ఉద్యోగులు ఆందోళన చేశారు. తాడికొండ పరిధిలోని వారికి కూడా ఓటు లేదని చెప్పడంతో తాము ఎక్కడికి వెళ్లి వినియోగించుకోవాలో చెప్పాలని ఆర్వోపై మండిపడ్డారు. మీడియా ప్రతినిధులను పోలింగ్ కేంద్రం వద్దకు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఓటు వేసే వెళ్తామని ఉద్యోగులు భీష్మించారు. గుంటూరు జిల్లాలో పని చేసే ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోవాలన్న కలెక్టర్ ఆ దేశాలతో ఉద్యోగులు శాంతించారు.

గుంటూరు పశ్చిమలో పరీక్ష

గుంటూరు లోక్‌సభ పరిధిలో 20,755 మంది పోస్టల్ ఓటర్లు ఉండగా ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఆ స్థాయిలో ఏర్పాట్లు చేయలేదు. పలు కేంద్రాల్లో సాధారణ పోలింగ్ మాదిరిగా వేల మంది ఓటు వేసేందుకు రాగా గంటల తరబడి ఎండలోనే క్యూలైన్లలో ఉండాల్సి వచ్చింది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి మహిళా కాలేజీ సెంటర్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ మధ్యాహ్నం 11 గంటల వరకూ ప్రారంభం కాలేదు. 6 వేల మంది ఓటర్లున్న నియోజకవర్గంలో మూడు కౌంటర్లే ఏర్పాటు చేయడంపై ఆర్వో రాజ్యలక్ష్మిపై ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి గమనించిన టీడీపీ అభ్యర్థి గల్లా మాధవి, నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిస్థితిని వివరించడంతో అదనపు కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఇక టెంట్లు వేయకపోవడంతో భారీ సంఖ్యలో తరలివచ్చిన ఓటర్లు ఎండలోనే నించోవాల్సి వచ్చింది. ఇలాగే జాప్యం జరిగితే సగం మంది కూడా ఓటు హక్కు వినియోగించుకోలేరని చెబుతున్నారు. ఓటింగ్ శాతాన్ని తగ్గించాలనే కుట్రతోనే అధికార పార్టీ మంత్రి విడుదల రజనీ కుట్రలు పన్నుతోందని పలువురు ఆరోపించారు. పోలింగ్ కేంద్రంలోకి ఆయా అభ్యర్థులతో పాటు ఏజెంట్లకు మాత్రమే అవకాశం ఉన్నప్పటికీ వైసీపీ అభ్యర్థి విడుదల రజని వెంట ఏజెంట్లతో పాటు పార్టీ నాయకులు కూడా గుంపుగా పోలింగ్ కేంద్రంలోకి వెళ్లారు. పోలీసులు ఎటువంటి అభ్యంతరం చెప్పలేదు.

రాష్ట్ర అభివృద్ధి టీడీపీకే సాధ్యం

● సినీ హీరో నారా రోహిత్

చెరుకుపల్లి, మే 7: భావితరాల భవిష్యత్తు అభివృద్ధి దిశగా సాగాలంటే ఎన్డీఏ కూటమి బలపర్చిన టీడీపీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని సినీ హీరో నారా రోహిత్ అన్నారు. మంగళవారం బలుసులపాలెం, మెట్టగౌడవారిపాలెం, ఆరుంబాక ఎస్సీ కాలనీ, కామినేనివారిపాలెం గ్రామాల్లో జరిగిన ఆత్మీయ సమావేశాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సాగు, తాగునీరు అందించటంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. చంద్రబాబు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పట్టిసీమ ద్వారా సాగునీటిని అందించి రైతులను ఆదుకున్నారన్నారు. రాష్ట్రంలోని యువత పక్క రాష్ట్రాలకు వలస వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రానున్న రోజుల్లో చంద్రబాబును గెలిపించుకుంటే ఉద్యోగ కల్పన పెరుగుతుందని ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ గ్రామసీమలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుకే సాధ్యమని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల కష్టాలను తెలుసుకునే నాయకులను ఓటు ద్వారా ఎన్నుకోవాలని ఆయన అన్నారు.

చెలరేగిపోతోన్న వైసీపీ మూకలు



నరసరావుపేట టౌన్, గురజాల టౌన్, ఈపూరు, పిడుగురాళ్ల, మే 7: పోలింగ్ సమయం సమీపిస్తోన్నది. ప్రచారానికి నాలుగు రోజులే గడువు. ఆరో రోజున పోలింగ్ జరగనున్నది. ఎక్కడికక్కడ ప్రచారాలు ఊపందుకున్నాయి. టీడీపీ అభ్యర్థులు జోష్ మీద ఉండగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో వైసీపీ మూకలు చెలరేగిపోతున్నాయి. టీడీపీ ప్రచార కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న వారే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు దాడులు చేస్తున్నాయి. సోమవారం నరసరావుపేటలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రం వద్ద జరిగిన దాడి ఘటన మరువక ముందే మంగళవారం స్థానిక బాబాపేటలో వైసీపీ రౌడీలు పేట్రేగిపోయారు. టీడీపీ ఆరో వార్డు అధ్యక్షుడు మానేడి మోహనరావు ఇంటిపై పెట్రో బాంబులు, రాళ్లు, కర్రలు, రాడ్లతో వైసీపీ నేతలు దాడి చేశారు. ఇంట్లోకి చొరబడి ఫర్నిచర్ ధ్వంసం చేశారు. దాడిలో మోహనరావు, ఆయన బంధువులు అరుణ, కుంకు వెంకటకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరామర్శించారు. ఓటమి భయంతోనే ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దాడులకు ఉసిగొల్పుతున్నారని అరవిందబాబు ఆరోపించారు.

దైదలో వైసీపీ మూకల బీభత్సం

టీడీపీ నేతల ప్రచారంలో పాల్గొని ఇళ్లకు వెళ్తున్న వారిపై కాపుకాచి వైసీపీ మూకలు దాడి చేసిన ఘటన సోమవారం రాత్రి మండలంలోని దైదలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు కాలెంకాయల వెంక య్య, శ్రీనులు కూటమి తరపున జరిగిన ఎన్నికల ప్రచారం లో పాల్గొని ఇంటికి వస్తుండగా వారింటి సమీపంలో కాపు కాసి ఉన్న వైసీపీ రౌడీ మూకలు జై జగన్ అంటూ కవ్వింపునకు దిగారు. వెంకయ్య వారి వద్దకు వెళ్లి మా ఇంటి ఎదురుగా మద్యం తాగడం ఏమిటి.. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలన్నారు. దీంతో ఆగ్రహించిన వైసీపీ మూకలు ఇనుప రాడ్లతో వెంకయ్యపై దాడి చేసి రోడ్డుపై ఈడ్చుకెళ్లారు. వెంకయ్య కుమారుడు శ్రీను అడ్డుకోబోగా అతడిపైన వరుసకు సోదర య్యే పగడాల వెంకట్రావమ్మపై కూడా దాడి చేశారు. గ్రామ స్థుల రాకతో వైసీపీ మూకలు పరారయ్యాయి. గాయపడిన వారిని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కూట మి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అర్ధరాత్రి 12 గంటల సమయంలో పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని బాధితులను పరామర్శించారు. శ్రీనుకు బలమైన గాయం కావడంతో అంబులెన్స్‌లో నరసరావుపేటకు పంపారు.



బాధితులను పరామర్శిస్తున్న యరపతినేని

దాడి సమయంలో కానరాని పోలీసులు

దైద ఫ్యాక్షన్ గ్రామం. గ్రామంలో నలుగురు పోలీసులతో పికెట్ ఉంది. గ్రామంలో ప్రధాన పార్టీలు ఎన్నికల ప్రచారాలు నిర్వహిస్తున్నాయి. అయితే దాడి సమయంలో పోలీసులు కనిపించలేదు. దాడి రాత్రి 11 గంటలకు జరిగినా అర్ధ రాత్రి 12:30 గంటల వరకు కూడా పోలీసులు వైద్యశాలకు చేరుకోలేదు. అనంతరం బాధితుల వద్ద నుంచి ఫిర్యాదు స్వీకరించారు. వైసీపీకి చెందిన తెల్లమేకల చక్రవర్తి, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, గుండెబోయిన సతీష్‌లను అరెస్టు చేసినట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు.

ముస్లింల కోసం అనేక పథకాలు

- కూటమికి మద్దతిచ్చి అభ్యర్థులను గెలిపించాలి
- చీరాలలో శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్

చీరాల, మే 7: రాష్ట్రంలో ముస్లింల సంక్షేమం టీడీపీ అనేక పథకాలు ప్రవేశపెట్టిందని శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఎస్.షరీఫ్ తెలిపారు. చీరాలలో మంగళవారం జరిగిన ముస్లింల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అధికార పార్టీ అబద్ధపు ప్రచారాలను నమ్మకుండా వచ్చే ఎన్నికల్లో ముస్లింలు అందరూ టీడీపీ కూటమికి మద్దతిచ్చి అభ్యర్థులను గెలిపించాలని పిలుపిచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో తమను గెలిపించాలని కోరారు.

అండగా ఉంటాం

మత్స్యకారులకు, మహిళలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య చెప్పారు. వేటపాలెం మండలం రామాపురంలో మంగళవారం పర్యటించిన వారు మత్స్యకారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వేటపాలెంలో నిర్వహించిన మహిళా గళం కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ మాట్లాడుతూ కూటమి అభ్యర్థులకు మహిళలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎం కొండయ్య, ఆయన కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతన్న షరీఫ్, కూటమి అభ్యర్థులు కొండయ్య, తెన్నేటి కృష్ణప్రసాద్

జగన్‌రెడ్డి పాలనలో గంగపుత్రుల బతుకులు గంగపాలు

- ఉప్పు రైతుల పరిస్థితి దారుణం
- మత్స్యకార గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి ప్రచారం

చినగంజాం, మే 7 : మత్స్యకారులు, పల్లెకారులకు మాయ మాటలు చెప్పి ఓట్లను దండుకొని వారి అభివృద్ధిని జగన్ గాలికొదిలేశారని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు మండిపడ్డారు. మండలంలోని కొత్త పాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రామచంద్రానగర్, పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం, తూర్పు పల్లెపాలెం, పడమట పల్లెపాలెం, బాపయ్యనగర్, మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మోటుపల్లి, జీడిచెట్ట పాలెం, కృష్ణానగర్, ఎస్టీ కాలనీ, సీతారామపురం, రుద్రమాంబపురం, నిరీక్షగిరి, అడవీధిపాలెం, కడవకుదురు గ్రామాల్లో ఆయన మంగళవారం విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా ఆయన జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ టీడీపీ హయాంలో మత్స్యకారులకు రాయితీపై డీజిల్, మరబోట్లు, వలలు ఇచ్చి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసామన్నారు. కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించి వారికి ఆర్థిక భరోసా కల్పించామన్నారు. చినగంజాం ప్రాంతం నుంచి దేశంలో చాలా ప్రదేశాలకు ఉప్పు ఎగుమతి అవుతుందని, గత ప్రభుత్వం ఉప్పు రైతులకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకుందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఉప్పు రైతులకు మద్దతు ధర కల్పించకుండా వారి బతుకు ఉప్పునీటి పాలు చేశారన్నారు. చినగంజాం ప్రాంతంలోని ఉప్పు కొటారులను ఏలూరి పరిశీలించి ఉప్పు రైతుల సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉప్పు రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆనాటి టీడీపీ ప్రభుత్వం మత్స్యకారులకు 50 సంవత్సరాలకే పెన్షన్



పర్చూరులో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

అందించిందని, వైసీపీ ఆవేమీ చేయకుండా వారి బతుకులు గంగపాలు చేసిందన్నారు. ఒక్క అవకాశం అని అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి మోసం తీరు అందరికీ అర్థమైందన్నారు. మత్స్యకారులకు మరలా 50 సంవత్సరాలకే పెన్షన్ అందిస్తామని, రాయితీ రుణాలు, డీజిల్ ధరలు తగ్గించి అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగు, సాగు నీటి సదుపాయాలు కల్పిస్తామన్నారు. కూటమి అభ్యర్థిగా తనను, ఎంపీగా కృష్ణప్రసాద్‌ని గెలిపించాలని అభ్యర్థించారు.మత్స్యకార గ్రామాల్లో ఎమ్మెల్యే ఏలూరికి అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. మహిళలు గుమ్మడికాయలతో దిష్టి తీస్తూ ఆశీర్వదించారు. రామచంద్రానగర్‌లోని పోలేరమ్మ, కృష్ణనగర్‌లో అంజనేయస్వామి విగ్రహం వద్ద, మోటుపల్లిలోని రామాలయంలో, కడవకుదురులోని అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద ఏలూరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత మండల పార్టీ కార్యాలయం లో ఆయన నాయకులతో సమావేశమయ్యారు. సోపిరాల గ్రామానికి చెందిన చీరాల ఏఎంసీ



ఉప్పు లాగుతున్న టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి

మాజీ డైరెక్టర్ పల్లపోలు లక్ష్మీనారాయణ, చినగంజాం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన మేడికొండ రాజమోహన్, ఇస్లాంపేటకు చెందిన షేక్ మస్తాన్ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఏలూరి కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. మండల పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీపీ భోగిరెడ్డి వెంకటరమణారెడ్డి ఏలూరిని మర్యాద పూర్వకంగా కలిసారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో మసకబారిన పల్లెలు

చినగంజాంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తాం

పర్చూరు, మే 7 : వైసీపీ పాలనలో అభివృద్ధి లేక పల్లెలన్నీ మసకబారాయని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చేది టీడీపీ కూటమి ప్రభుత్వమన్నారు. చంద్రబాబు సీఎం కాగానే పల్లెలకు మహర్దశ వస్తుందన్నారు. మంగళవారం చిన్నగంజాం మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పల్లెలో కనీస వసతులు కూడా కల్పించ లేని దుస్థితి జగన్‌రెడ్డిదన్నారు. గ్రామాలకు కనీసం రోడ్లు, తాగునీటిని కూడా ఇవ్వలేకపోయిందన్నారు. చినగంజాం మండలంలో ఐదువేల నుంచి పదివేల ఉద్యోగాలు వచ్చే పరరిశ్రమలను తీసుకువస్తామని ఏలూరి హామీ ఇచ్చారు. ఈ ఎన్నికలు రాష్ట్రానికీ, ప్రజలకు, యువతకు కీలకమని భావించి విజ్ఞతతో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

ఏలూరికి నీరాజనం

ఇంకొల్లు : కూటమి ఎమ్మెల్యేగా ఏలూరి సాంబశివరావు, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. నాలుగు రోజులుగా మండుటెండను లెక్క చేయకుండా ఏలూరి పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తుండగా.. ప్రజలు, మహిళలు ప్రచారంలో పాల్గొని నీరాజనాలు పలుకుతున్నారు.



నాగండ్లలో ఏలూరితో కలిసి ప్రచారంలో పాల్గొన్న యువత

అర్హులందరికీ పక్కా ఇల్లు కట్టిస్తాం

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

బల్లికురవ, మే 7 : టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన పేదలకు 2 సెంట్ల నివేశన స్థలాన్ని మంజూరు చేసి, పక్కా ఇంటిని నిర్మించి ఇస్తామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం బల్లికురవలో ఎస్సీ, ఎస్టీ కాలనీలలో ఎమ్మెల్యే రవికుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు కొందరు ఇంటి స్థలాలు లేవన్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ వచ్చేది టీడీపీ కూటమి అని, అందరి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అర్హులందరికీ కచ్చితంగా ఇంటి స్థలాలిచ్చి, నిర్మించి ఇస్తామని తెలిపారు. గ్రామాల్లో వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గతంలో సీసీ రోడ్లు వేయించిన విషయాన్ని గొట్టిపాటి గుర్తు చేశారు. అనంతరం సూరేపల్లి, వైదన గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ కాలనీల ప్రజలతో ఆయన సమావేశమయ్యారు. జగన్‌రెడ్డి నిరుపేదలను తీవ్రంగా మోసం చేశారన్నారు. సెంట్ స్థలం ఇచ్చి, ఇంటిని నిర్మించి ఇస్తానని మాటిచ్చి మడం తిప్పారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా ఒక్క ఇంటిని కూడా నిర్మించలేదన్నారు. అధికారుల ఒత్తిడితో కొందరు అప్పులు చేసి ఇల్లు కట్టుకుంటే వాటిని తామే కట్టామని వైసీపీ పాలకులు చెప్పుకుంటున్నారని అన్నారు. వడ్డీలు కట్టలేక ఇంటి లబ్ధిదారులు లబోదిబోమంటున్నారన్నారు. ఒక్క చాన్స్‌తో ప్రజలను మోసగించిన, రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్‌రెడ్డికి ఓటుతో బుద్ధి చెప్పాలని గొట్టిపాటి విజ్ఞప్తి చేశారు. అందరి బాగు కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా నన్ను (గొట్టిపాటి రవికుమార్), ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం వర్ధిల్లేలా ప్రజలు ఆశీర్వదించాలని రవికుమార్ కోరారు. అనంతరం టీడీపీ మేనిఫెస్టోలో పొందుపరచ్చిన పథకాలను ప్రజలకు వివరించారు. అన్నివర్గాల పేదలూ ఆర్థికంగా మెరుగుపడేందుకు సూపర్‌సిక్స్ పథకాలు ఉపయోగపడతాయని తెలిపారు. టీడీపీ రాగానే మొదటి నెల నుంచే రూ.4వేల పింఛన్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గొట్టిపాటి లక్ష్మయ్య, పావులూరి ఏడుకొండలు, చల్లగుండ్ల నాగేశ్వరరావు, సర్పంచ్ పందిరి అంజిబాబు, గొట్టిపాటి ఏడుకొండలు, కొండేటి ఇజ్రాయల్, అట్లూరి నాగేశ్వరరావు, పోగుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంతమాగులూరు : ఒక్క పరిశ్రమను ఏర్పాటు చేయకపోగా, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో జగన్‌రెడ్డి విఫలమయ్యారని ఎమ్మెల్యే గొట్టిపాటి అన్నారు. ఏల్చూరులో టీడీపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆయన ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి కావాలంటే టీడీపీ కూటమికి మద్దతు పలకాలని కోరారు. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యతనిస్తామన్నారు.



ఎస్టీ కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

యువతను నిర్లక్ష్యం చేసిన వైసీపీ

అద్దంకి, మే 7 : జగన్‌రెడ్డి పాలనలో యువతను నిర్లక్ష్యం చేయడంతో నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని యువనేత గొట్టిపాటి హర్షవర్ధన్ అన్నారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా తనయుడు హర్షవర్ధన్ అద్దంకి పట్టణంలోని 16వ వార్డులో మంగళవారం రాత్రి ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయకపోగా, ఉన్న పరిశ్రమలను కూడా తరిమి వేయడంతో రాష్ట్రంలోని యువత ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీతో పాటు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన కల్పిస్తామన్నారు. అద్దంకి పట్టణంలో అభివృద్ధి పనులు టీడీపీ హయాంలో చేపట్టినవేనని, వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పనులు చేపట్టక పోగా, టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.85 కోట్లతో ప్రారంభించిన మంచినీటి పథకాన్ని పూర్తిచేయలేని చేతగాని పాలన వైసీపీదన్నారు. గుండ్లకమ్మ నదిలో ఇసుకను దోపిడీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మన్నెం ఏడుకొండలు, కుందారపు రామారావు, ఎ ద్రాకుల పార్వతి, రామాంజనేయులు, నందిరెడ్డి రమేష్, కొండమ్మ, అద్దంకి నరేష్, పరిమి ఏబు పాల్గొన్నారు.



16వ వార్డులో ప్రచారం చేస్తున్న హర్షవర్ధన్

కూటమితోనే అభివృద్ధి.. సంక్షేమం

పంగులూరు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని గొట్టిపాటి ఝాన్సీ అన్నారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఝాన్సీ మంగళవారం పంగులూరులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్ పథాలను ఆమె వివరించారు. కార్యక్రమంలో బాచిన చెంచుప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు రావూరి రమేష్, మాజీ సర్పంచ్ బాచిన నీరజ శ్రీనివాస్, మేడ సుబ్బారావు, సుబ్బారావు, చిలుకూరి కోటయ్య, చౌదరిబాబు, రావూరి రంగారావు, నాగార్జున, చిలుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పంగులూరులో ప్రచారం నిర్వహిస్తున్న ఝాన్సీ



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి విజయమ్మ

రోగులను గుర్తించడంలో అలసత్వం వద్దు

జిల్లా వైద్యాధికారి విజయమ్మ

ఈపూరుపాలెం(చీరాలటౌన్), మే 7 : ఎండలు ప్రభావం తీవ్రంగా ఉందని, ప్రజలు తీసుకోవలిసిన జాగ్రత్తలను ఆరోగ్య సిబ్బంది వివరించాలని జిల్లా వైద్యాధికారి ఎస్.విజయమ్మ పేర్కొన్నారు. ఆశా డే సందర్భంగా మంగళవారం ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల పరిధిలోని ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారి మాట్లాడుతూ ఈ-ఆశా యాప్‌లో ఆన్‌లైన్ క్రమపద్ధతిని పాటించాలన్నారు. గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో ఉంచాలన్నారు. వడదెబ్బ తగలకుండా ప్రజలకు జాగ్రత్తలు సూచించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునేందుకు ఏఎన్ఎంలు, ఆశాలు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. రోగాలను గుర్తించి విధిగా మందులు పంపిణీ చేయాలని వివరించారు. కార్యక్రమంలో డా.సీహెచ్. శ్రీదేవి, డా.సాయివైష్ణవి, డా.జ్యోతిర్మయి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు, సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాల్లో పరిశీలన

మార్టూరు, మే 7 : మార్టూరు, యద్దనపూడి మండలాల్లో సమస్యాత్మక గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం జిల్లా అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ పరిశీలించారు. కేంద్రాలలో పరిస్థితిపై మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందుకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలను జారీ చేశారు. ఆయన నాగరాజుపల్లి, డేగరమూడి, కోనంకి, మార్టూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని కేంద్రాలను పరిశీలించారు. యద్దనపూడి మండలంలో యద్దనపూడి, సూరవరపు పల్లె, అనంతవరం, యనమదల గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట యద్దనపూడి ఎస్ఐ జీవీఎస్ చౌదరి పాల్గొన్నారు.



కేంద్రాలను తనిఖీ చేస్తున్న అడిషనల్ ఎస్పీ

ల్యాండ్ టైటిల్‌ను రద్దు చేయాలని వినతి

యద్దనపూడి (మార్టూరు) : ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేయాలని మంగళవారం యద్దనపూడి మండల టీడీపీ నాయకులు తహసీల్దార్ వైవీ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. రైతులకు, భూ యజమానులకు నష్టం చేసే ఈ యాక్ట్‌ను అమలు చేయవద్దని నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేచేశారు. కార్యక్రమంలో నాయకులు నల్లపనేని రంగయ్య చౌదరి, గుదే తారక రామారావు, రావిపాటి సీతయ్య కనపర్తి సీతయ్య బోయపాటి సాంబయ్య పాల్గొన్నారు.

అద్దంకిలో వర్షం

అద్దంకి, మే 7 : అద్దంకి ప్రాంతంలో మంగళవారం రాత్రి వర్షం జల్లులు పడ్డాయి. సాయంత్రం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండగా రాత్రి 8-30 గంటల సమయంలో కొద్దిపాటి వర్షపు జల్లులు పడ్డాయి. గత కొద్దిరోజులుగా ఎండలు ఎక్కువగా కాయడంతో ప్రజలు తీవ్ర ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. మంగళవారం సాయంత్రం ఒక్క సారిగా వాతావరణం చల్లగా మారి, చిరుజల్లులు కురవడంతో సేదతీరారు. అయితే బుధవారం నుంచి ఎండవేడిమి పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

అవకాశం ఇవ్వండి.. నిరూపించుకుంటాం

టీడీపీ కూటమి అభ్యర్థి కొండయ్య

కొత్తపేట(చీరాల), మే 7 : సంక్షేమం, అభివృద్ధిలో ముందుంటాం. అవకాశం ఇవ్వండి నిరూపించుకుంటామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. కొత్తపేటలో మంగళవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలసి కొండయ్య విస్తృతంగా పర్యటించారు. రోడ్ షో, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆ సందర్భంగా పలుచోట్ల కొండయ్యకు జనాలు నీరాజనం పలికారు. హారతులు ఇచ్చి స్వాతగతం పలికారు. కొండయ్యతో పాటు ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి మ్యానిఫెస్టోతో సమాజంలోని ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్‌తో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండయ్యను, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. పలు ప్రాంతాల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారంలోకి రాగానే ప్రాధాన్యతాక్రమంలో అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు వీ మధుబాబు, తేలప్రోలు నాగేశ్వరరావు, సూరగాని లక్ష్మి, అడ్డగడ్డ రామయ్య, కారంపూడి పద్మిని, గూడూరు శివ రామప్రసాద్, భాగ్యలక్ష్మి, శంభుప్రసాద్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొండయ్యకు హారతిస్తున్న మహిళలు

బాధలు తెలుసు.. బాధ్యతగా పనిచేస్తాం

వేటపాలెం(చీరాల) : మీ బాధలు తెలుసు. బాధ్యతగా పనిచేస్తాం. ఈ నెల 13వ తేదీ జరిగే ఎన్నికల పోలింగ్ టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థిగా తనను, ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంఎం కొండయ్యను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ కోరారు. మంగళవారం వేటపాలెంలో స్థానిక నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయా సందర్భాల్లో ఆయన మాట్లాడుతూ సృజనాత్మకతకు నేత పెట్టింది పేరన్నారు. వారి ఆలోచనలు కూడా సున్నితంగా ఉంటాయని, జాతికి నాగరికతను నేర్పింది నేతన్న అని కొనియాడారు. చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి అయితేనే అందరి సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సూపర్‌సిక్స్, బీసీ డిక్లరేషన్‌తో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాతాని ఉమామహేశ్వరరావు, సజ్జా వెంకటేశ్వరరావు, నాళిక వీరభద్రయ్య, డాక్టర్ సజ్జా హేమలత, కూరపాటి పూర్ణచంద్రరావు, యర్రా శివనాగమల్లేశ్వరి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మగ్గంపై నేత నేస్తున్న టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్

జాలర్ల పొట్టగొట్టిన వైసీపీ

- గుండ్లకమ్మ గేట్లు పెట్టలేని అసమర్థ పాలన
- ఇసుక అక్రమ తవ్వకాల కోసమే ఆ నిర్లక్ష్యం
- గిరిజనులపైనా జగన్‌రెడ్డి చిన్నచూపు
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి





ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొట్టిపాటి.. హాజరైన గిరిజనులు

అద్దంకి, మే 7 : వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నీరు లేకుండా చేసి 3వేల మంది జాలర్ల కుటుంబాలు వేట సాగించే వీలు లేకుండా చేసిందని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. నియోజకవర్గంలోని గిరిజనులతో మంగళవారం స్థానిక నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కల్యాణ మండపంలో గొట్టిపాటి రవికుమార్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గుండ్లకమ్మ రిజర్వాయర్ 3 గేట్లు మరమ్మతులకు గురై రెండేళ్లు దాటినా పట్టించుకోలేదన్నారు. వైసీపీ నేతల ఇసుక అక్రమ తవ్వకాల కోసం గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నీరు నిల్వ ఉండకుండా చేశారన్నారు. దీంతో జాలర్లకు వేట సాగించే వీలు లేకుండా పోయిందన్నారు. గిరిజనుల ఓట్లతో గెలిచిన వైసీపీ వారి సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓట్ల తో గద్దెనెక్కిన జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వాళ్లపై దాడులు చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజనులకు ఉచిత విద్యుత్ పథకం, కల్యాణ పథకం, ఎన్టీఆర్ విద్యోన్నతి, అంబేడ్కర్ విదేశీ విద్య, అటవీ హక్కుల చట్టం అమలు చేసిన విషయాన్ని గొట్టిపాటి గుర్తు చేశారు. మత్స్యశాఖ ద్వారా 90 శాతం సబ్సిడీతో జాలర్లకు సైకిళ్లు, వలలు, మోపెడ్‌లు, పడవులు, ఆటోలను అందించామన్నారు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో రోడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర వసతులను కల్పించామన్నారు. వైసీపీ వచ్చాక ఎస్టీ సంక్షేమ పథకాలను రద్దు చేసిందన్నారు. 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికలలో గిరిజనులందరూ సంఘటితంగా ఉండి టీడీపీ విజయానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో పలువురు మహిళా గిరిజనులు టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన లబ్ధి ని వివరించారు. సమావేశంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారు నాయక్, జనరల్ సెక్రటరీ అద్దంకి అంకారావు, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీనివాసరావు, బాలానాయక్, బొజ్జా విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



ప్రజలకు సూచనలిస్తున్న ఎస్ఐ

ఎన్నికలకు సహకరించాలి : ఎస్ఐ

పంగులూరు, మే 7 : ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా ప్రజలంతా సహకరించాలని ఎస్ఐ తిరుపతిరావు కోరారు. ఎస్పీ జిందాల్ ఆదేశాల మేరకు సెంట్రల్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, పోలీస్ సిబ్బందితో జాగర్లమూడివారిపాలెం, ముప్పవరం, భగవాన్‌రాజుపాలెం, బైటమంజులూరు గ్రామాల్లో మంగళవారం కవాతు నిర్వహించారు. మే 13న జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ సూచించారు. రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తులకు అవగాహన కల్పించారు. వాహన తనిఖీ చేపట్టారు.

పనులను నిరాకరించిన పారిశుధ్య కార్మికులు

రెండురోజులుగా రోడ్ల వెంటే చెత్తకుప్పలు

ఇంకొల్లు, మే 7 : ఇంకొల్లులో పారిశుధ్య కార్మికులు గత రెండు రోజులుగా విధులకు హాజరుకాకుండా నిరాకరించారు. నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో నిరసన తెలుపుతూ పనులు నిలిపివేశారు. తమకు జీతాలు చెల్లించాలని అడిగినా అధికారులు స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మేజరు పంచాయతీ అయిన ఇంకొల్లులో మూడు రోజులుగా రోడ్ల వెంబడి చెత్తకుప్పలు పేరుకుపోయాయి. గత ఐదారునెలల కిందట జీతాల చెల్లింపు విషయంలో పెద్ద ఎత్తున్న కార్మికులు నిరసనకు దిగి 30 రోజులపాటు పనులు చేయకుండా రోడ్డెక్కారు. మళ్లీ ఇప్పుడు జీతాలు సక్రమంగా చెల్లించడం లేదని పనులు నిలిపివేసారు. ఆదాయ వనరులు పుష్కలంగా ఉన్న ఇంకొల్లు పంచాయతీలో కనీసం కార్మికులకు జీతాలు కూడా ఇవ్వక పోవడం చాలా దారుణమని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారలు వెంటనే స్పందించి పెండింగ్ జీతాలను చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

ఈదురు గాలులు

2గంటలపాటు నిలిచిన కరెంట్ సరఫరా

మార్టూరు, మే 7 : మార్టూరు మండలంలో మంగళవారం రాత్రి రెండు గంటలకు పైగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం 6 గంటలకు మండలంలో భారీగా ఈదురు గాలులు వీయడంతో మార్టూరు, కోనంకి, రాజుపాలెం, నాగరాజుపల్లి ద్రోణాదుల సబ్ స్టేషన్ పరిధిలోని పలు చోట్ల విద్యుత్ తీగలు తెగిపోగా, పొలాలు వద్ద చెట్లు కొమ్మలు పడిపోవడంతో తీగలు తెగిపోయాయి. పలు ట్రాన్స్ ఫార్మర్ల వద్ద కండక్టర్ వైర్లు తెగిపోయాయి. దాంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి 8 గంటల తర్వాత విద్యుత్ అధికారులు సిబ్బందితో కలిసి మరమ్మతులు చేయించడంతో సరఫరా పునరుద్ధరించారు.

15 మంది శ్రీ గౌతమి విద్యార్థులకు ఉద్యోగాలు

చీరాల, మే 7 : శ్రీగౌతమి డిగ్రీ కళాశాలలో మంగళవారం బెంగళూరుకు చెందిన ఎక్స్ - జెనై సాఫ్ట్‌వేర్ కంపెనీ వారు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 15 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీగౌతమి విద్యా సంస్థల డెరెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు (ఎంవీ) ఇతర ప్రతినిధులు ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కంపెనీ ప్రతనిధి కిరణకుమార్, కళాశాల ప్లేస్‌మెంట్ విభాగ ప్రతినిధి అచ్యుత్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.2.40 లక్షలు ప్రారంభ జీతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు



పంగులూరులో మాట్లాడుతున్న
పార్లమెంటరీ పార్టీ ఎన్నికల కోఆర్డినేటర్ డాక్టర్ గరటయ్య

కూటమి ప్రభుత్వంతోనే ప్రగతి

● బాపట్ల పార్లమెంటరీ కోఆర్డినేటర్ డాక్టర్ గరటయ్య

పంగులూరు, మే 7 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడితేనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని, టీడీపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గొట్టిపాటి రవికుమార్, తెన్నేటి కృష్ణప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని బాపట్ల పార్లమెంటరీ పార్టీ ఎన్నికల కోఆర్డినేటర్ బాచిన చెంచుగరటయ్య అన్నారు. పంగులూరులో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో డాక్టర్ గరటయ్య మాట్లాడుతూ ఒక్క అవకాశం పేరుతో రాష్ట్రంలో అధికారం చేపట్టిన జగన్‌రెడ్డి ఐదేళ్ల పాటు అరాచక, విధ్వంస పాలన సాగించారన్నారు. సంక్షేమం పేరుతో బటన్ నొక్కడం తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి కొరిశపాడులో సాగునీటి కోసం శ్రీకారం చుట్టిన పోలిరెడ్డి ఎత్తిపోతల పథకం ఈ ఐదేళ్లలో అడుగు కూడా ముందకు పడలేదన్నారు. దీనినిబట్టి చూస్తే సాగు ప్రాజెక్టులపై జగన్ చిత్తశుద్ధి తెలుస్తుందన్నారు. మూడు రాజధానులంటూనే రాజధాని లేని రాష్ట్రంగా మార్చారన్నారు. ప్రజాప్రతినిధులకు స్వేచ్ఛ లేకుండా నియంతృత్వ పోకడలతో పాలించిన వైసీపీని ఓటుతో సాగనంపాలని ప్రజలకు గరటయ్య పిలుపునిచ్చారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌తో రైతుల ఆస్తులకు రక్షణ ఉండదన్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైతే అభివృద్ధి, సంక్షేమం పరుగుపెడుతుందన్నారు. ప్రజల ఆస్తులకు రక్షణ, ప్రజాస్వామ్య పాలన అందుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు గరటయ్య విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బాచిన చెంచుప్రసాద్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రావూరి రంగారావు, జార్లమూడి సుబ్బారావు, పూనాటి రామాంజనేయులు, నాదెండ్ల రామాంజనేయులు, వీరరాఘవయ్య, నాతాని, సుభాని, కొండలరావు, నాగార్జున, రామారావు, హరికృష్ణ పాల్గొన్నారు.



బోడవాడలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

వైసీపీ పాలనలో గంజాయి హబ్‌గా ఏపీ

● ఆంధ్రాకు అప్పులు..జగన్‌రెడ్డికి ఆస్తులు
● కూటమి గెలిస్తేనే సంక్షేమం
● టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నర్సిరెడ్డి

బోడవాడ (పర్చూరు), మే 7 : వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ గంజాయి హబ్‌గా మారిందని, దీనికి జగన్‌రెడ్డే బాధ్యత వహించాలని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. పర్చూరు మండల పరిధిలోని బోడవాడ గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి విధ్వంస, అరాచక నియంతృత్వ పాలన వల్ల పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలి పోయాయన్నారు. దీంతో ఉపాధి ఉద్యోగావకాశాలు లేక యువత భవిష్యత్ అగమ్య గోచరంగా మారిందన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ ఉందన్నారు. రాష్ట్రానికి అప్పులు, జగన్‌రెడ్డికి ఆస్తులు పెరిగాయని విమర్శించారు. ఉపాధి నిధుల దుర్వినియోగంలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. ప్రస్తుత ఎన్నికలు ధర్మానికి అధర్మానికి మధ్య జరుగుతున్నాయన్నారు. ఎస్సీల అభివృద్ధి కోసం చంద్రబాబు హయాంలో ఉన్న పథకాలనీన జగన్‌రెడ్డి రద్దు చేశారన్నారు. నా ఎస్సీలు అని చెప్పి కల్లబొల్లి మాటలతో మోసం చేస్తున్నారన్నారు. సంక్షోభం పోవాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. ప్రజా సంక్షేమం కోసమే కూటమి ఏర్పాటైందన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పర్చూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావును సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కృష్ణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అడ్డగడ్డ వెంకటేశ్వర్లు, చెరురూరి చింపయ్య(శ్రీధర్), కన్నెగంటి సాంబయ్య, త్రేలప్రోలు శ్రీనివాసరావు, అడ్డగడ్డ సాంబయ్య, శివనాగేశ్వరావు, రాంబాబు ఉన్నారు.



పర్చూరులో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్వో రవీందర్

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

పర్చూరు, మే 7: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ నియోజకవర్గ కేంద్రమైన పర్చూరులో కొనసాగుతోంది. మూడవ రోజైన మంగళవారం రెవెన్యూ కార్యాలయంతోపాటు, డిప్యూటీ డీఈవో కార్యాలయం భవనంలో పోలీసులతోపాటు, ఎన్నికల విధుల్లో ఉన్న ఇతర సిబ్బందితోపాటు, బీఎల్‌వోలకు నిర్వహించారు. కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్య పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరిగింది. మార్టూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.సీతారామయ్య నేతృత్వంలో ఎస్సై రమేష్ స్వీయ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా కేటగిరీకి సంబంధించి మొత్తం 660 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉండగా అందులో 522 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆర్వో గంధం రవీందర్ తెలిపారు. ఎలాంటి అసౌకర్యానికి తావులేకుండా క్యూ పద్ధతిలో ఓటు వేసే విధంగా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కేంద్రాల్లో పోలింగ్ సరళిని ఆర్వో పరిశీలించారు. కార్యక్రమంలో ఏఆర్వోలు సీహెచ్.సుబ్బయ్య, ఫణీంద్ర కుమార్, మెహర్‌బాబు పాల్గొన్నారు.

ప్రశాంతంగా హోం ఓటింగ్

చీరాల : చీరాల నియోజకవర్గంలో మంగళవారం హోం ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. మొత్తం 6 టీములను నియమించారు. ఆ టీములు ముందస్తుగా హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న వారి గృహాలకు వెళ్లి వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు సేవలు అందించారు. మండల పరిధిలోని గవినివారిపాలెంలో ఓ ఇంటిలో వృద్ధురాలు నుంచి హోం ఓటింగ్ టీం చేపట్టిన ప్రక్రియను స్వయంగా పరిశీలించారు.

ఉపాధి కూలీ మృతి



దండా అయ్యన్న

పంగులూరు, మే 7: మండలంలోని భగవాన్‌రాజుపాలెం గ్రామంలో ఉపాధి హామీ పనికి వెళ్లిన కూలీ దండా అయ్యన్న (67) వడదెబ్బ తగిలి మృతి చెందారు. అందిన సమాచారం మేరకు దండా అయ్యన్న మంగళవారం ఉదయం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో పాల్గొన్నారు. పొలాల్లో పెద్ద కాలువ పూడికతీత పనులు చేస్తుండగా ఎండ ఎక్కువగా ఉండడంతో వడదెబ్బకు గురై తీవ్ర ఉక్కపోతకు గురయ్యారు. ఈ క్రమంలో పనిచేస్తుండగానే కుప్పకూలిపోయారు. వెంటనే చిలకలూరిపేట ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందారు.

మార్పు ఖాయం!

మలుపు తిరిగిన రెండు నియోజకవర్గాలు
కనిగిరి అన్నింటా ముందున్న డాక్టరు ఉగ్ర
దర్శిలో శరవేగంగా మారుతున్న సమీకరణలు
రెండుచోట్ల టీడీపీ, జనసేనలు సమైక్యంగా ముందడుగు
ఆ రెండుచోట్లా వైసీపీలో అంతఃకలహాలు
ఎమ్మెల్యేల నుంచి వైసీపీకి లభించని సహకారం

జిల్లాలోని కనిగిరి, దర్శి నియోజకవర్గాల్లో రాజకీయ పరిణామాలు మారిపోతున్నాయి. ఆయా వర్గాలలో నెలకొన్న ప్రభుత్వ వ్యతిరేకత, అభివృద్ధి లేమి, అవినీతి వ్యవహారాలు, అంతర్గత కలహాలు వైసీపీకి శాపాలుగా మారాయి. టీడీపీకి కనిగిరిలో అభ్యర్థి డాక్టరు ఉగ్రనరసింహారెడ్డి సేవా కార్యక్రమాలు, అన్నాక్యాంటిన్, గతంలో చేసి చూపించిన అభివృద్ధి బలమైంది. ఇటు దర్శిలో టీడీపీ, జనసేన జతకట్టడంతో మారిన సమీకరణలు కూటమి అభ్యర్థి లక్ష్మీ పూర్తిగా నిలదొక్కుకునేందుకు దోహదపడింది. కనిగిరిలో వైసీపీ అభ్యర్థి దద్దాలకు రాజకీయ అనుభవం లేకపోవటంతోపాటు భూవివాదాల్లో అతని పాత్రపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, ఎమ్మెల్యే బుర్రా అనుచరగణం సహకరించకపోవటం ఇబ్బందికరంగా మారింది. దర్శిలో వైసీపీ అభ్యర్థి శివప్రసాదరెడ్డికి రాజకీయ శత్రువులు గణనీయంగా ఉన్నారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి అనుచరగణంలో 90శాతం మంది ఆయనకు వ్యతిరేకంగా పనిచేయటం స్పష్టంగా కనిపిస్తోంది.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలోని పశ్చిమప్రాంతంలో కలిసి ఉండే కనిగిరి, దర్శి నియోజకవర్గాలలో కూడా గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు గెలుపొందారు. అయితే రాష్ట్రస్థాయి సమస్యలను అటుంచితే స్థానికంగా రెండుచోట్ల జరిగిన అభివృద్ధి శూన్యమే. గత ఐదేళ్లుగా అధికారపార్టీలో గ్రూపు తగాదాలు కొనసాగాయి. అవినీతి వ్యవహారాలు ముమ్మరంగానే జరిగాయి. వర్గపోరుతో చిన్నపాటి అభివృద్ధి పనులపై కూడా ఇరువర్గాల వారు పోటీపడటంతో అర్థంతరంగా నిలిచిపోయాయి. రెండుచోట్లా అభ్యర్థులను మార్చిన జగన్ ఆ విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించలేకపోయారు. ఈ నేపథ్యంలో తాజా పరిస్థితులను పరిశీలిస్తే కనిగిరిలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నివిభాగాల్లో దూసుకుపోతున్నారు. అనేక అంశాలు ఆయనకు సానుకూలంగా మారి గెలుపుదిశగా పయనిస్తున్నారు. దర్శిలో గొట్టిపాటి కుటుంబానికి చెందిన మహిళా డాక్టర్‌ను రంగంలోకి దింపటం ద్వారా తెలుగుదేశం పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. తాజాగా దర్శిలో పోటీ నువ్వానేనా అన్నట్లుగా ఉన్నా మారుతున్న సమీకరణలు వైసీపీ నేతలను బెంబేలెత్తిస్తున్నాయి.

కనిగిరిలో ఉగ్రకు అనుకూల వాతావరణం

కనిగిరిలో గత మూడేళ్ల నుంచి మారుతున్న సమీకరణలు టీడీపీ అభ్యర్థి డాక్టరు ఉగ్రకు అనుకూల వాతావరణాన్ని నెలకొల్పాయి. 2009లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొంది కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ఆయన చేయగలిగారు. 2019లో టీడీపీ అభ్యర్థిగా రంగంలోకి వచ్చి ఓటమి చవిచూసినా నియోజకవర్గాన్ని వీడలేదు. 2008 నుంచి ఇప్పటివరకు 50 వేలమందికి కంటి వైద్య చికిత్సలు చేయించి వ్యక్తిగత అభిమానాన్ని చూరగొన్నారు. గుంటూరులోని తన వైద్యశాల ద్వారా నియోజకవర్గంలోని పేదరోగులకు భారం లేని వైద్యసేవలు అందించటం, కరోనా సమయంలో ఇచ్చిన చేయూత ఆయనకు కలిసొచ్చాయి. గత రెండేళ్ల నుంచి కనిగిరిలో అన్నా క్యాంటీన్ నిర్వహణ మంచిపేరు తెచ్చిపెట్టింది. మరోవైపు వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణ 2022లో జడ్పీటీసీ సభ్యునిగా గెలుపొందారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా అనేక వివాదాల్లో ఆయన చిక్కుకున్నారు. సరైన అనుభవం లేకపోవటం, నాయకత్వలేమితో ఎదురీదుతున్న ఆయన పార్టీబలంపైనే ఆధారపడ్డారు. ఎమ్మెల్యే వ్యతిరేకవర్గంలో కొందరు యాక్టివ్‌గా పనిచేస్తుండగా బుర్రా అనుచరగణం వైసీపీకి పూర్తిగా దూరమైంది. తద్వారా యాదవ సామాజికవర్గం ఓటర్లలో చీలిక ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. అంతో ఇంతో ఆధిక్యత అయినా వైసీపీకే ఉన్నప్పటికీ కీలకమైన రెడ్డి సామాజిక వర్గంలో మార్పు చోటుచేసుకుంది. గత పదేళ్లుగా డాక్టరు ఉగ్రతో వ్యక్తిగత సంబంధాలు ఉన్న బంధువర్గం వైసీపీకి గుడ్ బై చెప్పి టీడీపీకి మద్దతు ప్రకటించారు. కనిగిరి రూరల్ మండలంలో చక్రంతిప్పుతూ కాంగ్రెస్ కొండారెడ్డిగా పేరొందిన నాయకుడు ఉగ్రకు మద్దతుగా ఊరూవాడా తిరుగుతున్నారు. గతంలో ఎమ్మెల్యేను వ్యతిరేకించిన రెడ్డి సామాజికవర్గంలోని వైసీపీ నాయకులు ఇక్కడే ఉండగా మండల, గ్రామస్థాయిలోని అనేకమంది ప్రత్యక్షంగా పరోక్షంగా ఉగ్రకు మద్దతు పలుకుతున్నారు. యాదవ సామాజికవర్గం ఓటర్లు 26,561 మంది ఉండగా రెడ్డి ఓటర్లు 42,860 మంది ఉన్నారు. ఆ ఓటర్లలో టీడీపీకి ఆధిక్యత రాకపోయినా సగానికి సగం లభించే అవకాశం ఉంది. ఇతర బీసీ ఓటర్లు 25వేల మంది వరకు ఉండగా రజక, వడ్డెర్లలో టీడీపీకి ఆధిక్యత కనిపిస్తోంది. జనసేన కలయికతో కాపు సామాజికవర్గం ఓటర్లు పూర్తిస్థాయిలో టీడీపీకి మద్దతిస్తున్నారు. కనిగిరి, పామూరులో ముస్లింలలో వ్యక్తిగత పరిచయాల ద్వారా డాక్టరు ఉగ్రకు 60శాతంకుపైగా ఓట్లుపడే అవకాశం స్పష్టంగా ఉంది. కమ్మ, వైశ్య ఓట్లు 25వేలు వరకు ఉండగా పూర్తి ఆధిక్యత టీడీపీకి కనిపిస్తోంది. దళితుల్లో మాదిగలు 37వేల మంది ఉండగా మాలలు 15వేల మంది ఉన్నారు. మాదిగల్లో ఎన్డీఏ అనుకూల వాతావరణం నెలకొనటం ఇక్కడా స్పష్టంగా కనిపిస్తోంది. ఆయా సామాజికవర్గాలకు అతీతంగా చూస్తే నియోజకవర్గంలో 60వేల మంది వలస ఓటర్లు ఉన్నారు. దేశంలోని అనేకప్రాంతాల్లో ఉన్న ఈ ఓటర్లతో డాక్టరు ఉగ్రకు మంచి సంబంధాలు ఉన్నాయి. వైసీపీ వైపు జగన్ నామస్మరణ తప్ప మరో అంశం చెబుతున్న పరిస్థితే కనిపించటం లేదు.

రెండు వర్గాలు కలిస్తే వార్ వన్‌సైడే

దర్శిలో రాజకీయ సమీకరణలు శరవేగంగా మారుతున్నాయి. కాపు సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యే మద్దిశెట్టిని పక్కనపెట్టి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని వైసీపీ రంగంలోకి తెచ్చింది. ఇప్పటికీ ఆయన తల్లి జడ్పీ చైర్మన్‌గా ఉన్నప్పటికీ శివప్రసాదరెడ్డికి టికెట్ ఇవ్వటం వైసీపీలోని ఎమ్మెల్యే వర్గీయులకు మింగుడుపడలేదు. గత నాలుగేళ్లుగా ఇటు ఎమ్మెల్యే అటు బూచేపల్లిల మధ్య పోరు సాగింది. వ్యక్తిగత ప్రజాసంబంధాలు శివప్రసాదరెడ్డికి బలంగా ఉన్నాయి. అయితే రాజకీయంగా ఆయనను తీవ్రంగా వ్యతిరేకించేవారు బలంగానే ఉన్నారు. ఎమ్మెల్యే అనుచరగణంలో 90శాతం మంది బూచేపల్లికి వ్యతిరేకంగా నిలబడ్డారు. వారిలో అత్యధికులు టీడీపీ, జనసేనలలో చేరగా కొందరు సైలెంట్ అయ్యారు. దొనకొండ, ముండ్లమూరు మండలాల్లో రెడ్డి నాయకులు కూడా వైసీపీని వీడి టీడీపీలో చేరగా తాళ్లూరు మండలంలో కొందరు సైలెంట్ అయ్యారు. ఇక సామాజిక సమీకరణలు చూస్తే నియోజకవర్గంలో రెడ్డి, కమ్మ, కాపు సామాజికవర్గాలు బలమైనవి. రెడ్డి ఓటర్లు సుమారు 39వేలమంది ఉండగా కమ్మ, కాపు సామాజికవర్గం ఓటర్లు దాదాపు సమానంగా ఇరువర్గాలు కలిపితే 55వేలమందికిపైగా ఉన్నారు. దళితుల్లో మాదిగలదే అగ్రభాగం. బీసీలలో యాదవులు, వడ్డెర, రజక తదితరులు ఉన్నారు. ముస్లింలు 12వేల మంది ఉండగా ఆర్య వైశ్యులు 6500 మంది ఉన్నారు. ఈ నియోజకవర్గంలో కమ్మ, కాపు సామాజికవర్గాల మధ్య ఐక్యత అధికంగా ఉంటుంది. ఈ రెండు సామాజికవర్గాల వారు ఐక్యంగా పనిచేసిన ప్రతి ఎన్నికల్లోను కాంగ్రెసేతర పార్టీలకే విజయం లభిస్తుంది. గతంలో కాంగ్రెస్ మీద స్వతంత్ర అభ్యర్థి కూడా గెలుపొందారు. మొన్నటికి మొన్న దర్శి నగర పంచాయతీ ఎన్నికల్లో అధికార వైసీపీని టీడీపీ ఖంగుతినిపించి గెలిపించి చరిత్ర సృష్టించింది. ప్రస్తుతం జనసేన, టీడీపీల కలయికతో ఆరెండు సామాజికవర్గాల వారు పూర్తి సమైక్యతతో ముందడుగు వేస్తున్నారు.

డాక్టరమ్మ నాడిపట్టేశారు

రెడ్డి సామాజికవర్గంలో వైసీపీకి ఆధిక్యత ఉన్నా రెండు మండలాల్లో బలమైన నాయకులు వెళ్లిపోవటం, కొందరు సైలెంట్ కావటం, గత స్థానిక సంస్థల ఎన్నికల్లో శివ ప్రసాదరెడ్డి ఎమ్మెల్యే వ్యతిరేకవర్గానికి గ్రామాల్లో సహకరించటంలాంటి అంశాలతో ఆ ఓటర్లలో చీలిక కనిపిస్తోంది. వీటికితోడు టీడీపీ అభ్యర్థి ఎంపికలోను వ్యూహాత్మకంగా వ్యవహరించింది. మహిళా అభ్యర్థిని, డాక్టరును అందునా ఆ నియోజకవర్గంతో మంచి అనుబంధం ఉన్న గొట్టిపాటి కుటుంబం నుంచి లక్ష్మిని ఎంపికచేయటం విశేషం. ఆమె ప్రజలతో మమేకమవుతున్న తీరు నియోజకవర్గ ప్రజలను ముఖ్యంగా మహిళలను ఆకట్టుకుంటోంది. కూటమి శ్రేణులు సమష్టిగా పనిచేయటంతోపాటు ఏ విషయంలోను వెనుకంజ వేయటం లేదు. అటు చంద్రబాబు నేరుగా దర్శి వచ్చి మీటింగు పెట్టడం, ఇటు పవన్‌కళ్యాణ్‌లు కూడా రానుండటం వారికి కలిసొచ్చింది. ఆర్థిక అంశాలలోను టీడీపీ శ్రేణులు ఢీ అంటే ఢీ అంటుండటంతో గాలి మారిపోతుంది. దీంతో పోటీ నువ్వానేనా అన్నట్లు ఉన్నప్పటికీ టీడీపీ విజయానికి అనుగుణంగా బెట్టింగ్‌లు ప్రారంభం కావటం విశేషం.



ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన పీసీపల్లి మండలం నేరేడు పల్లి గ్రామస్థులు

ఓటుకు రేటు

భారీ ప్రలోభాలకు తెరతీసిన వైసీపీ
వాళ్లకు రూ.5వేలు, వీళ్లకు రూ.3వేలు
ఒంగోలు, అద్దంకిలో శ్రీకారం
మిగిలిన చోట్ల నేడు రేపో ప్రారంభం కానున్న పంపిణీ

(ఒంగోలు, ఆంధ్రజ్యోతి)

పోలింగ్ తేదీ దగ్గరపడే కింద టీడీపీ కూటమి అనుకూల, ప్రభుత్వ వ్యతిరేక ఓటర్లు బయటపడుతున్నారు. దీంతో ఆ ప్రభావాన్ని తగ్గించేందుకు భారీ ప్రలోభాలకు అధికార వైసీపీ తెరతీసింది. కొన్ని కీలక నియోజవర్గాల్లో ఓ స్థాయిలో ఓట్ల కొనుగోలుకు వైసీపీ నాయకులు తెగబడుతుండగా మిగిలిన చోట్ల ఉన్నంతలోనే సర్దుకుపోవాలన్నా తరహాలో వైసీపీ నాయకులు వేచిచూస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అనేకచోట్ల సోమవారం రాత్రి డబ్బుల పంపిణీకి వైసీపీ శ్రీకారం పలికింది. ప్రధానంగా ఒంగోలు, అద్దంకి నియోజకవర్గాలలో వైసీపీ నాయకులు ఈ వ్యవహారానికి తెరతీశారు. ముందు ఉద్యోగ ఓట్ల కొనుగోలుకు ఓటుకు రూ.5వేలు చొప్పున పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఉద్యోగులలో ఉపాధ్యాయ ఓటర్లు ప్రలోభాలకు లొంగలేదు. ఇతర ఉద్యోగులలో వైసీపీ వారు ఇచ్చే డబ్బులకు కొంతమంది సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్న ఉద్యోగులు కొందరు టీడీపీ శ్రేణులు ఎంత ఇచ్చినా తీసుకొని వారికి మద్దతుగా నిలిచారు. ఒంగోలు, అద్దంకి, దర్శిల్లో ఉద్యోగి ఓటుకి రూ.5వేలు చెల్లించినప్పటికీ ఏరికోరి కొందరికి మాత్రమే నగదు ఇచ్చారు. అయినా ఉద్యోగుల నుంచి కనీస సానుకూలత రాకపోవడంతో సాధారణ ఓటర్ల ప్రలోభాల పర్వాన్ని ప్రారంభించారు. ఒంగోలు, అద్దంకిలో సోమవారం రాత్రి ఓటుకు రూ.3వేలు ఇచ్చేందుకు వైసీపీ నాయకులు శ్రీకారం పలికారు. అద్దంకిలో ఒక్క గ్రామంలోనే అలాగ చేసి మిగిలిన గ్రామాలకు రేపోమాపో నగదు పంపిస్తామని అక్కడి వైసీపీ అభ్యర్థి మోహం చాటేసినట్లు సమాచారం. ఒంగోలులో వైసీపీ మద్దతుదారులు సోమవారం రాత్రి నుంచి పంపిణీ ప్రారంభించి మంగళవారం కూడా కార్యక్రమాన్ని కొనసాగించారు. ఉద్యోగులలో స్పష్టంగా కనిపించిన వ్యతిరేకత, తటస్థ ఓటర్లలో టీడీపీ అనుకూల వాతావరణం బహిర్గతం కావడంతో వైసీపీ నాయకులు ఓట్ల కొనుగోలుకి భారీ రేటు పెట్టారని ప్రచారం జరుగుతుంది. ఒంగోలులో 2.4 లక్షల ఓటర్లు ఉండగా కనీసం 2లక్షల మందికి రూ.3వేలు ప్రకారం ఇచ్చిన రూ.60కోట్లు అవుతుంది. ఇప్పటికే కార్పొరేషన్‌లో ఒక్కో డివిజన్‌లో కార్పొరేటర్‌కి రూ.3 లక్షలు, వైసీపీ డివిజన్ అధ్యక్షుడికి రూ.లక్ష, కార్యాలయాల నిర్వాహణకు లక్ష ప్రకారం ఒక్కో డివిజన్‌కు రూ.5లక్షలు ఇచ్చారు. ఇతరత్రా ఖర్చులు పరిగణనలోకి తీసుకుంటే ఒంగోలు అసెంబ్లీలో రూ.100 కోట్లు వరకూ ఖర్చుపెట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా ఉద్యోగ ఓటర్లకు రూ.5వేలు ఇచ్చి మాకు రూ.3వేలు ఇవ్వడమేంటంటూ సామాన్య ఓటర్లు నుంచి నిలదీతలు ఎదురుకావడం వైసీపీ నాయకులకు ఇబ్బందిగా మారింది. ప్రత్యేకించి అద్దంకి నియోజకవర్గంలో సాధారణ ఓటర్లకు కూడా రూ.5వేలు ప్రకారం ఇవ్వాల్సిందేనని ఆ పార్టీలోని గ్రామస్థాయి నాయకులు ఒత్తిడి పెంచినట్లు తెలిసింది. అలాగ ఇస్తేనే పంచుతాం లేదంటే లేదని కొన్ని గ్రామాల్లో నాయకులు అభ్యర్థికి సమాచారం పంపినట్లు కూడా తెలిసింది. ఒక్కసారి ఓటుకు రూ.2వేలు ప్రకారం పెంచితే కనీసం రూ.20కోట్లు సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. దీంతో అద్దంకి వైసీపీ అభ్యర్థి సోమవారం రాత్రి ప్రారంభించిన పంపిణీ కార్యక్రమం మంగళవారం నిలిపివేయడం విశేషం.

దర్శిలో తగ్గేదేలా..

దర్శి నియోజకవర్గంలో ఏ విషయంలోనూ తగ్గకుండా టీడీపీ కూటమి ముందుకు సాగుతోంది. ఆలస్యంగా వచ్చిన వినూత్న విధానాలతో అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మీ దూసుకుపోయింది. గ్రామస్థాయి నుంచి ఏ విషయంలోనూ తగ్గకుండా వైసీపీ అభ్యర్థిని ఢీ అంటే ఢీ అంటున్నారు. ఉద్యోగ ఓట్లకి రూ. 5వేలు ఇచ్చే ప్రక్రియను వైసీపీ చేపట్టగా కూటమి వైపు నుంచి అదే స్థాయిలో పోటీ ఇచ్చారు. సాధారణ ఓటర్లకు ప్రలోభపరిచేందుకు వైసీపీ ఏ స్థాయికి వెళ్తే టీడీపీ కూటమి అభ్యర్థి కూడా అంతే స్థాయికి వెళ్లేటట్లు తెలుస్తోంది. అందిన సమాచారం ప్రకారం ఉమ్మడి జిల్లాలో ఆయా నియోజకవర్గాల అభ్యర్థుల ఆర్థిక పరిస్థితిని బట్టి ఓటు రేటు కనిష్ఠంగా రూ. 2000 పలికేటట్లు తెలుస్తోంది.



చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు

అభ్యంతరం వ్యక్తం చేస్తున్న రైతులు
కోడ్ ఉన్నా లెక్కచేయని అక్రమార్కులు
కొప్పెరపాడు చెరువు ఖాళీ
పట్టించుకోని అధికారులు

బల్లికురవ. మే 7 : మండలంలోని వీ కొప్పెరపాడు పంచాయతీ చెరువులో అనుమతి లేకుండానే వారంరోజుల నుంచి మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా ఎవరూ పట్టించుకోకుండా మట్టిని తవ్వి ఇతర ప్రదేశాలకు తరలిస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని కొప్పెరపాడు గ్రామ పంచాయతీ చెరువులో కొంత భాగంలో ఉన్న మట్టిని అక్రమంగా తవ్వుతూ ట్రాక్టర్లలో పలు రోడ్లు, పొలాలకు తరలిస్తున్నారు. పంచాయతీ చెరువులో మట్టి తవ్వకాలు చేయాలంటే పంచాయతీ తీర్మానం అవసరం. అయిన పట్టించుకోకుండా ఎక్స్‌కవేటర్‌తో మట్టిని యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. దీనిపై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఒకే చోట పెద్ద ఎత్తున కందకాలు పెట్టి మట్టిని తవ్వుతున్నా అధికారులు మౌనంగా ఉండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోడ్ ఉన్నా లెక్కచేయకుండా అక్రమార్కులు తవ్వకాలు సాగిస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కొప్పెరపాడు ప్రజలు కోరుతున్నారు.



కొప్పెరపాడు పంచాయతీ చెరువులో
అనుమతులు లేకుండా జరుగుతున్న మట్టి తవ్వకాలు

ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేయండి

తహసీల్దార్‌కు టీడీపీ వినతి

ఇంకొల్లు, మే 7 : ప్రజల భూములను లాగేసుకునేందుకు జగన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను వెంటనే రద్దు చేయాలని మంగళవారం తహసీల్దార్‌కు టీడీపీ మండల నాయకులు వినతిపత్రం అందజేశారు. జగన్‌రెడ్డి ప్రజల భూములు కబ్జా చేసేందుకే ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను తీసుకొచ్చారని దీనిని వెంటనే రద్దు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, పాలేరు రామకృష్ణ, వంకాలపాటి సతీష్, జరుగుల శ్రీనివాసరావు, మీరావలి, జనసేన మండల నాయకులు ప్రవీణ్, ఇంతియాజ్, బోడావుల శివయ్య, శ్రీను పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సర్వీస్ రోడ్డులో గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం




గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం

టంగుటూరు, మే 7 : టంగుటూరులో మంగళవారం గుర్తు తెలియని వృద్ధుని మృతదేహాన్ని స్థానికులు కనుగొన్నారు. టంగుటూరు టోల్‌ప్లాజా నుంచి నేరుగా కోల్డ్ స్టోరేజ్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డు పక్కనే పడిఉన్న శవాన్ని చూశారు. ఉదయం అటు వైపు వాకింగ్‌కు వెళ్లిన కొందరు యువకులు అక్కడ పడిఉన్న మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు, పంచాయతీవారికి సమాచారం చేరవేశారు. అయినా సరే సాయంత్రం వరకు మృతదేహం ఉన్న ప్రాంతానికి అధికారులెవ్వరూ వచ్చిన దాఖలాలు లేవు.

వృద్ధుని వయస్సు 75ఏళ్లు ఉండవచ్చని భావిస్తున్నారు. తెల్లని బన్నీ, తెల్లటి అడ్డపంచ ధరించి ఉన్నాడు. అతని పరిస్థితిని బట్టి చూస్తే మృతుడు యాచకుడై ఉండవచ్చని భావిస్తున్నారు. సమాచారం తెలియగానే సింగరాయకొండ కేంద్రంగా అనాథ శవాలకు అంత్యక్రియలు జరిపే యువనేస్తం ఫౌండేషన్ వారు స్పందించారు. వెంటనే వారు ప్రత్యేక వాహనంలో టంగుటూరులోని మృతదేహం ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. అంత్యక్రియల నిమిత్తం మృతదేహాన్ని సింగరాయకొండ తీసుకుపోయారు.

మద్యం బాబుల వీరంగం

అద్దంకి, మే 7 : అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్డులో మంగళవారం సాయంత్రం మందుబాబులు వీరంగం సృష్టించారు. మద్యం సేవించిన ముగ్గురు హడావుడి చేయడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం అక్కడకు చేరుకొని మందుబాబులను పంపించి వేశారు. ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల కోసం మద్యం పంపిణీ ప్రారంభించిన నేపథ్యంలో మందుబాబులు సేవించి హంగామా చేస్తున్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఇక మందుబాబులకు పండుగే. మందుబాబులు ఇష్టానుసారం వ్యవహరించకుండా పోలీసులు నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.



పిల్లలూ.. అమ్మానాన్నకు చెప్పండి !



పొదలకూరు: ప్రభగిరిపట్నంలో ప్రచారంలో భాగంగా పిల్లలతో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి కుమారుడు రాజగోపాల్‌రెడ్డి

చిన్నా ఇదే మన గుర్తు!



కలిగిరిలో చిన్నారులకు సైకిల్ చూపిస్తూ పెద్దలను ఓట్లు అభ్యర్థిస్తున్న ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ సతీమణి ప్రవీణ - కలిగిరి

హై.. హై



కావలి : చౌదరిపాలెంలో టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి ఎడ్లబండిపై ప్రచారం నిర్వహించారు. వ్యవసాయాధారిత గ్రామం కావడంతో ఈ వినూత్న ప్రచారానికి ఆయన శ్రీకారం చుట్టారు.

తాతా బాగున్నావా!?



వలేటివారిపాలెం మండలం చుండి గ్రామంలో వృద్ధుడితో మాట్లాడుతున్న కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య

పచ్చబొట్టుగా అభిమాన నేత





నెల్లూరు సిటీ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ ఫొటోను చేతిపై పచ్చబొట్టుగా వేయించుకున్న 4వ డివిజన్‌లోని జాకీర్‌హుస్సేన్ నగర్ కార్యకర్త మణికుమార్‌రెడ్డి

ఇప్పుడే ఇలా.. 13న ఎలా!?

- పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో గందరగోళం
- ఓటింగ్ వివరాల వెల్లడిలో తీవ్రజాప్యం
- అర్ధరాత్రికి కూడా రాని పోలింగ్ శాతం
- అధికారుల తీరు మారకుంటే ఇబ్బందులు తప్పవు!

నెల్లూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఎన్నికల విధుల్లో ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఓటింగ్‌కు అవకాశం కల్పించారు. అయితే ఎంత మంది ఆ రోజు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేశారన్న వివరాలు వెల్లడించడంలో అధికారుల నుంచి తీవ్ర జాప్యం జరుగుతోంది. సాయంత్రం పోలింగ్ ముగిసినా అర్ధరాత్రి వరకు పూర్తిస్థాయిలో వివరాలు వెల్లడి కావడం లేదు. తొలిరోజు ఆదివారం పోలింగ్ వివరాలను మరుసటి రోజు ఉదయాన ప్రకటించడం గమనార్హం. కీలకమైన పోలింగ్ ప్రక్రియ మొదలైనప్పుడు ఆ వివరాలను వెల్లడించడంలో జరుగుతున్న జాప్యం అధికారుల పనితీరును వేలెత్తి చూపిస్తోంది. సాధారణంగా పోలింగ్ జరుగుతున్నప్పుడు ప్రతి గంటకు, రెండు గంటలకు ఒకసారి అప్పటివరకు జరిగిన పోలింగ్ శాతాన్ని అధికారులు ప్రకటిస్తూ ఉండాలి. అప్పుడే ఎన్నికల ప్రక్రియ ఎంత పారదర్శకంగా సాగుతోందన్నది ప్రజల కు అర్థమవుతుంది. ఇతర జిల్లాల్లో ప్రతి రెండు గంటలకు ఒకసారి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ శాతాన్ని ప్రకటిస్తున్నా మన జిల్లాలో మాత్రం ఆ పద్ధతి కొనసాగడం లేదు. జిల్లాలో సుమారు 20 వేల మంది ఉద్యోగులు ఓటు వేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గంలో సరాసరి రెండు వేల పోస్టల్ బ్యాలెట్లను జారీ చేసి ఒక ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రోజుకు ఐదారు వందల మందికి మించి ఓటు హక్కు వినియోగించుకోవడం లేదు. అయినా ఆ వివరాలను వీలైనంత త్వరగా ప్రజలకు తెలియజేయడంలో ఎన్నికల అధికారులు విఫలమవుతున్నారు. 20 వేల ఓట్ల విషయంలో ఈ పరిస్థితి ఉంటే ఈ నెల 13న జరిగే ప్రధాన పోలింగ్ రోజున 20 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకోనుండడంతో ఆ రోజు పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. పోలింగ్ వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసే మెకానిజాన్ని ఏర్పాటు చేసుకోకపోతే ఇబ్బందులు తలెత్తుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, జిల్లాలో ఒక పార్లమెంటు, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతుండగా వాటిలో ఒకరిద్దరు రిటర్నింగ్ అధికారులు మినహా మిగిలిన వారంతా తొలిసారి సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వారందరూ కొంత గందరగోళానికి గురవుతున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. పోస్టల్ బ్యాలెట్లు జారీలో కూడా కొంత మంది ఓట్లు గల్లంతు కావడం, ఫెసిలిటేషన్ సెంటర్ల వివరాలు సరిగా తెలియజేయకపోవడంతో గందరగోళం తలెత్తడమే ఇందుకు ఉదాహరణగా చూపిస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ (5వ తేదీ నుంచి మంగళవారం వరకు)

నియోజకవర్గం	ఓట్లు	పోలైనవి	శాతం
నెల్లూరు సిటీ	2419	2315	95.70
నెల్లూరు రూరల్	4809	4335	90
కందుకూరు	1635	1580	96.6
కావలి	2933	2757	93.9
ఆత్మకూరు	2352	2220	94.37
ఉదయగిరి	2336	2207	94.47
సర్వేపల్లి	1332	1255	94.21
కోవూరు	2587	2576	94.88
మొత్తం	20403	19245	94.32

● పోలింగ్ శాతం 95

ఉద్యోగ, ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను భారీగా వినియోగించుకున్నారు. ఈ నెల 5 నుంచి మంగళవారం వరకు 95.70 శాతానికి పైబడి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నమోదయ్యింది. కందుకూరు నియోజకవర్గంలో అత్యధికంగా 96.6శాతం, నెల్లూరు నగరంలో 95.70 శాతం ఓటింగ్ నమోదయ్యింది.

● నేడు ప్రత్యేకంగా...

ఫాం-12 ఇప్పటివరకు ఇవ్వని ఉద్యోగులు బుధవారం ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ ప్రకటనలో కోరారు. ఈ మేరకు ఆర్వో కార్యాలయాల్లో ప్రత్యేక ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.




నెల్లూరు : కార్పొరేషన్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేస్తున్న ఉద్యోగులు

అనారోగ్యశ్రీ!

- నీరుగారుతున్న బృహత్తర పథకం

వ్యాధిగ్రస్థులకు అందనంత దూరంలో 'ఆరోగ్యశ్రీ'

సవాలక్ష కొర్రీలు.. వైద్యంలో కాలయాపన



ఆసుపత్రులకు అందని బకాయిలు

ఆగిన రూ.60 కోట్ల చెల్లింపులు

నెల్లూరు (వైద్యం) మే 7: ఐదేళ్ల క్రితం వరకు 'ఆరోగ్యశ్రీ' పథకం పేదలపాలిట ప్రాణవాయువుగా నిలిచింది. కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఎందరో సాధారణ, సంక్లిష్ట వైద్యసేవలు పొందారు. అలాంటి బృహత్తర పథకం గడిచిన ఐదేళ్లలో నిర్వీర్యమైంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా రోగులకు ఆరోగ్యశ్రీ వైద్య చికిత్సలు అందేవి. 2014 నుంచి 2019 వరకు 1,044 వ్యాధులకు సంబంధించి ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సలు అందించారు. జిల్లాలో 20 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా మెరుగైన చికిత్సలు అందేవి. అప్పట్లో సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు ఆరోగ్యశ్రీ చికిత్సలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టేవారు. రూ.5 లక్షల వరకు వైద్య చికిత్సలు అందించేవారు. ఏడాదికి మూడువేలకుపైగా ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సలు చేసేవారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు రెండునెలలకు ఒకసారి డబ్బులు చెల్లించేవారు. దీంతో నెట్‌వర్క్ ఆసుపత్రులతో రోగులకు ఎలాంటి సమస్య ఉండేది కాదు.

● ఎండమావిగానే నేడు సేవలు

ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నామని చెబుతున్నా, అవి ఎండమావిగానే ఉన్నాయి. జిల్లాలో 32 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు, 28 డెంటల్ ఆసుపత్రులతోపాటు ప్రభుత్వపరంగా మరో 64 ఆసుపత్రులను పథకంలో చేర్చారు. అయితే వీటిలో నెల్లూరు జీజీహెచ్‌తోపాటు ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కందుకూరు, కావలి ఏరియా ఆసుపత్రుల్లోనే కొంతమేరకు ఆరోగ్యశ్రీ చికిత్సలు అందుతున్నాయి. డెంటల్ ఆసుపత్రుల్లో ఈహెచ్‌ఎస్ కార్డులు ఉన్న వారికే చికిత్సలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో రోగులకు ఆరోగ్యశ్రీ చికిత్సలు అందక అవస్థలు పడుతున్నారు.

● పేరుకున్న బకాయిలు

ప్రస్తుతం జిల్లాలోని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద నెట్‌వర్క్ ఆసుపత్రులకు వైసీపీ ప్రభుత్వం రూ. 60 కోట్లకుపైగా బకాయిలు ఉన్నట్లు తెలుస్తుంది. 60 రోజుల్లో బకాయిలు చెల్లిస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. ఏడాది దాటినా చెల్లింపులు నామమాత్రంగా ఉన్నాయి. ప్రభుత్వం కేవలం 20 శాతం బకాయిలు మాత్రమే చెల్లిస్తూ పబ్బం గడుపుకుంటోంది. బకాయిలు సరిగ్గా రాకపోవటంతో నెల్లూరులోని రెండు కార్పొరేట్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ నుంచి బయటకు వెళ్లిపోయాయి. కొన్ని ఆసుపత్రులలో అయితే ఆరోగ్యశ్రీ చికిత్సలు అందించలే మంటూ రోగులకు చెప్పేస్తున్నాయి. దీంతో రోగులు చేసేది లేక డబ్బులిచ్చి వైద్య చికిత్సలు చేయించుకుంటున్నారు.



● రూ.వెయ్యి దాటితే...

కాగా రూ. 1000 ఖర్చు దాటితే ఆరోగ్యశ్రీ సేవలు అన్ని ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రిలో ఉచితంగా చూస్తారంటూ 2021, నవంబరులో వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. దీన్ని దశల వారీగా అన్నీ జిల్లాల్లోనూ అమలు చేస్తామంటూ పేర్కొంది. అయితే మూడేళ్ల కావస్తున్నా అమలు కాలేదు. ప్రస్తుతం 3,255 వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చినా ఫలితం ఉండటం లేదు. 2023 డిసెంబరులో ఆరోగ్యశ్రీ కింద రూ. 25 లక్షల వరకు చికిత్సలు అందిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. కొత్త ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులు కూడా అందించింది. అయితే అవి కూడా అందుబాటులో లేదు.

ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా చికిత్స

2018లో ఎన్టీఆర్ వైద్య సేవా పథకం ద్వారా ఆరోగ్యశ్రీ గుండెవ్యాధితో చికిత్స చేయించుకున్నాను అప్పట్లో నెట్‌వర్క్ ఆసుపత్రి వర్గాలు ఎంతో ఆసక్తిగా సమస్యలను తెలుసుకుని వైద్యం అందించారు. నాకు శస్త్రచికిత్స చేసిన వెంటనే డబ్బులు కూడా వచ్చాయి. ఇది చాలా సంతోషాన్ని ఇచ్చింది. అయితే ఇటీవల ఆరోగ్యశ్రీ డబ్బులు రావటం లేదని, వైద్య చికిత్సలు చేయలేమని మా ఇంటిపక్కనే ఉన్న ఓ వ్యాధిగ్రస్థుడు ఆందోళన వ్యక్తం చేయటం చాలా బాధేసింది

- విజయలక్ష్మి

చికిత్స చేయలేదు..

ఊపిరితిత్తులకు సంబంధించి తీవ్రఅనారోగ్యంతో ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు చేయించుకుందామని నెట్‌వర్క్ ఆసుపత్రులకు వెళ్లా. వారు వైద్య చేయలేమని చెప్పారు. ఎందని అడిగితే ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదని చెప్పారు. చేసేది లేక డబ్బులు చెల్లించి వైద్య చికిత్స చేయించుకున్నా.

- శ్రీనివాసులు

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించండి!

- నిబద్ధతతో పని చేయాలని ఆదేశం
- పోలీస్ అధికారులతో రాష్ట్ర ప్రత్యేక పోలీసు పరిశీలకుడు దీపక్ మిశ్రా



సమీక్షలో మాట్లాడుతున్న దీపక్ మిశ్రా

నెల్లూరు (హరనాథపురం), మే 7 : ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రత్యేక పోలీసు పరిశీలకుడు దీపక్ మిశ్రా పోలీసు అధికారులు ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఎన్నికల నిర్వహణపై పోలీసు అధికారులతో ఆయన సమీక్షించారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శ కంగా, నిబద్ధతతో పోలీసు అధికారులు పని చేయా లని సూచించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు ను వినియోగించుకునే అవకాశాన్ని కల్పించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు గుంపులు గుంపులుగా నిలబడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాలలో ఓటింగ్ పూర్తయిన తరువాత ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లకు పటిష్టమైన భద్రత కల్పించాలని ఆదేశించారు. మిషన్లను స్ట్రాంగ్ రూములకు తీసుకెళ్లే వాహనాలకు సీసీ సీపీ కెమెరాలు అమర్చాలన్నారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ జిల్లాలో 2,470 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, అన్నిచోట్ల వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలీసు ప్రణాళికను ఎస్పీ ఆరీఫ్ హఫీస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రత్యేక పోలీసు పరిశీలకులు అశోక్ టి.దుదే, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, అదనపు ఎస్పీ సౌజన్య, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, వీరాంజనేయరెడ్డి, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది కోసం ప్రత్యేక బస్సులు

ఎన్నికల సిబ్బంది కోసం బస్ స్టేషన్ల నుంచి జిల్లాలోని ఆయా నియోజకవర్గాలకు ఆర్టీసీ సంస్థ 255 బస్సులను నడపనుందని కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. నెల్లూరు, కావలి, కందు కూరు, ఆత్మకూరు, ఉదయగిరి మెయిన్ బస్‌స్టేషన్ల నుంచి ఈనెల 12న ఉదయం 6 గంటలకు ఈ బస్సులు బయలు దేరుతాయని తెలిపారు. తిరిగి 13న రాత్రి 10.30, 11.30, 00.30 గంటలకు బయలు దేరుతాయని తెలిపారు. ఈ బస్సులలో ఎన్నికల సిబ్బంది నుంచి సాధారణ చార్జీలు వసూలు చేస్తారన్నారు.

భారీగా వలంటీర్ల రాజీనామాలు

- ఇప్పటివరకు 4,062 మంది రిజైన్
- మరో 42 మంది తొలగింపు
- మిగిలినవారిపైనా పెరుగుతున్న ఒత్తిళ్లు

నెల్లూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతూనే ఉంది. పోలింగ్ రోజు సమీపిస్తుండటంతో రాజీనామాల సంఖ్య పెరుగుతోంది. మార్చి 16న ఎన్నికల కోడ్ వచ్చిన నాటి నుంచి ఈ నెల 6వ తేదీ వరకు 4,062 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. నిబంధనలు అతిక్రమించి వైసీపీ ప్రచారంలో పాల్గొన్న మరో 42 మందిని అధికారులే తొలగించారు. మొత్తంగా 4104 మంది తమ ఉద్యోగాలను వదిలి బయటకు వచ్చారు. జిల్లాలో మొత్తం సుమారు 13 వేల మంది వలంటీర్లు ఉండగా అందులో మూడో వంతు మంది రాజీనామాలు చేయడం గమనార్హం. అత్యధికంగా కావలి, కోవూరు, నెల్లూరు సిటీ, సర్వేపల్లి నియోజకవర్గాల్లో జరిగాయి. కావలి అర్బన్‌లో 450 మంది, కావలి రూరల్‌లో 164 మంది, దగదర్తిలో 141, బోగోలులో 51, నెల్లూరు అర్బన్‌లో 241 మంది, కోవూరులో 225, విడవలూరులో 212, కొడవలూరులో 156, బుచ్చి అర్బన్‌లో 115, బుచ్చి రూరల్‌లో 142 మంది, ఇందుకూరుపేటలో 234 మంది రాజీనామాలు చేశారు. ముత్తుకూరులో 160, మనుబోలులో 63, పొదలకూరులో 108, టీపీగూడూరులో 86, వెంకటాచలంలో 165, చేజర్లలో 103, సంగంలో 149, సైదాపురంలో 102 మంది చొప్పున వలంటీర్లు రాజీనామాలతో ఉద్యోగాలు వదులుకున్నారు. పోలింగ్ సమీపిస్తుం డటంతో ఇంకా అనేక మందిపై వైసీపీ నేతలు ఒత్తిడి తెస్తున్నారు. వీరి ద్వారా ఓటర్లను ప్రభావితం చేయాలన్న ప్రయత్నాలు జరుగుతున్నాయి.

జగన్ పాలనలో రాష్ట్రం విధ్వంసం

- జలదంకి రోడ్‌షోలో సినీహీరో నారా రోహిత్

జలదంకి, మే7: ప్రజావేదిక కూలదోయడం మొదలు సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం విధ్వంసం అయిందేతప్ప, అభివృద్ధి అనేదే లేదని సినీహీరో నారా రోహిత్ ఆరోపించారు. ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని జలదంకిలో మంగళవారం రాత్రి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లతో కలసి ఆయన రోడ్‌షో పాల్గొన్నారు. వారికి ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అబిమానులు అడుగడుగునా నీరాజనాలు పలికారు. ఎస్సీ కాలనీ వద్ద నుంచి గ్రామవీధుల్లో రోడ్‌షో నిర్వహించారు. స్థానిక చావిడి సెంటర్‌లో ప్రచార రథం పైనుంచి అభిమానులను ఉద్దేశించి నారా రోహిత్ మాట్లాడారు. రాష్ట్రానికి చంద్రబాబును సీఎం చేసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతోనే బీజేపీ టీడీపీ, జనసేనలు కలసి పోటీచేస్తున్నాయన్నారు. ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించి ఎంపీగా వేమిరెడ్డిని, ఎమ్మెల్యేగా కాకర్లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రసంగిస్తూ జలదంకి మండలంలో కూటమికి అత్యధిక మెజారిటీ సాధించి పెట్టాలన్నారు. అలా చేస్తే మండలాన్ని తాను, సురేష్ కలసి అబివృద్ధి చేస్తామన్నారు. కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గానికి తాను ప్రత్యేక మేనిఫెస్టో తయారు చేసుకున్నానని, దాని ప్రకారం ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి తోడ్పాటుతో అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం మేనిఫెస్టోను నారా రోహిత్ చేతుల మీదుగా కాకర్ల ఆవిష్కరింపజేశారు. చినక్రాకలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో కలసి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ తాను ఎమ్మెల్యేగా ఉన్నకాలంలో గ్రామ ప్రజలు తనపై ఎంతో ఆదరణ చూపారని, అలాగే ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు వేమిరెడ్డి, కాకర్లలకు సైకిల్‌గుర్తుపై ఓట్లేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పీ మధుమోహన్‌రెడ్డి, ఉప సర్పంచి కే మాలకొండారెడ్డి, నాయకులు ఏగూరి రఘు, జయచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాల్యాద్రి యాదవ్ మధుసూదనరావు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



జలదంకి రోడ్‌షోలో ప్రసంగిస్తున్న సినీహీరో నారా రోహిత్, పక్కన వీపీఆర్, కాకర్ల

ఓఆర్ఎస్, భోజన ప్యాకెట్ల పంపిణీ

కావలిటౌన్, మే 7: సామాజిక కార్యకర్త, న్యాయవాది ఐ సాయిప్రసాద్ తన తల్లి కన్నెమ్మ జ్ఞాపకార్థం మంగళవారం పట్టణంలోని నిరాశ్రయులు, యాచకులకు ఓఆర్ఎస్, భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నిరాశ్రయులు యాచకులు ఎండల్లో బయట తిరగొద్దని, వడదెబ్బ తగలకుండా నీడపట్టున ఉండాలని, ఎక్కువగా మంచినీరు తాగి ఆరోగ్యాన్ని కాపాడుకొనేందుకు సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

విజయసాయిరెడ్డి ఆరోపణలు అవాస్తవం

ఉలవపాడు, మే 7 : ముస్లిం రిజర్వేషన్‌పై బీజేపీతో కలిసి టీడీపీ నాటకం ఆడుతుందన్న విజయసాయి రెడ్డి మాటలు అవాస్తవమని టీడీపీకి చెందిన స్థానిక ముస్లీం మైనారిటీ నాయకులు ఒక ప్రకటనలో ఖండించారు. మంగళవారం కందుకూరు వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌తో కలిసి ఎంపీ అభ్యర్థి విజయసాయి రెడ్డి రాజకీయ లబ్ధికోసం చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలను ముస్లింలు నమ్మవద్దని, టీడీపీ పాలనలోనే ముస్లిం మైనార్టీలకు న్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో టీడీపీ ముస్లిం నేతలు ఎస్‌కే జిలానీ బాషా, ఎస్‌కే బాబు, డాక్టర్ కరీం, ఎస్ఎం బాషా తదితరులు ఉన్నారు.

'కందుకూరు'ను పరిశ్రమల హబ్‌గా మారుస్తా

- సాగు, తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- గెలుపు సమస్యే కాదు.. భారీ మెజార్టీ లక్ష్యంగా పని చేస్తున్నాం
- కందుకూరు టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



కందుకూరు, మే 7: 'కందుకూరు నియోజకవర్గాన్ని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్ది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికే ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి పనిచేస్తా. ఆ తర్వాత ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించడం, సాగునీటి వసతి కల్పించడం కోసం రూపొందించుకున్న నిర్దిష్ట ప్రణాళికను అమలు చేస్తా. ఇక కందుకూరు పట్టణంలో శాంతిభద్రతలను కాపాడటంతోపాటు మౌలిక వసతులను అభివృద్ధి చేసి సుందర పట్టణంగా తిర్చిదిద్దుతా. నియోజకవర్గంలో ప్రధాన జీవనాధారంగా ఉన్న వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు తీసుకొచ్చి ఈ ప్రాంతంలో పండించిన పంట ఉత్పత్తులకు ఇక్కడే గిట్టుబాటు ధరకు ఆయా పరిశ్రమల వారు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటా"నని కందుకూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు వివరించారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ కందుకూరులో విజయఢంకా మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రాబోయే టీడీపీ ప్రభుత్వం ద్వారా కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి ఆయన వద్ద ఉన్న ప్రణాళికలను వివరించారు.

? ఎన్నికల ప్రచారంలో ప్రజా స్పందన ఎలా ఉంది.

! ప్రజాస్పందన అద్భుతంగా ఉంది. ఏ గ్రామం వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ముఖ్యంగా వైసీపీ పాలనపై విసుగెత్తిపోయిన అనేకవర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ఆపార్టీని వీడి పెద్దఎత్తున తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. ఏదో మొక్కుబడిగా కాకుండా ఉరకలెత్తుతున్న ఉత్సాహంతో వారు మా వెంట నడుస్తున్న తీరు జగన్ పాలనలో వారు ఎంత విసుగెత్తిపోయారో అర్థమయ్యేలా చేస్తోంది.

? బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలు టీడీపీలో చేరుతున్నారా

! అగ్రవర్ణ సామాజిక వర్గంతో అన్నివర్గాల వారు మా పార్టీలో చేరుతున్నారు. నెలరోజులుగా టీడీపీలో చేరిన వారిలో బీసీ, ఎస్సీ, ఎస్టీల కార్యకర్తలే ఎక్కువగా ఉన్నారు. అన్నివర్గాల్లోనూ ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా కొత్త ఓటర్లు, యువత, విద్యావంతులు నూటికి నూరుశాతం మాపార్టీకి మద్దతుగా నిలుస్తున్నారు.

? వైసీపీ కంచుకోటను బద్దలు కొడతారా

! జగన్ పాలనపై ప్రజలు విసుగెత్తి ఉండటానికి తోడు చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే తప్ప ఈ రాష్ట్రానికి భవిష్యత్తు లేదన్న నిశ్చితాభిప్రాయానికి ప్రజలు వచ్చారు. దీనికితోడు ఎన్నో దశాబ్దాలుగా ఇక్కడ వర్గాలకు నాయకత్వం వహించిన వారు నేడు పోటీలో లేరు. అందువల్ల నియోజకవర్గంలో కొత్త సమీకరణలు చోటుచేసుకుంటున్నాయి. కచ్చితంగా వైసీపీ కోటను బద్దలు కొట్టి విజయం సాధిస్తాము.

? కొత్త సమీకరణలు మీకే లాభం అని ఎలా అనుకుంటారు.

! అందులో ఎలాంటి సందేహం లేదు. నేను స్థానికుడిని. ఎన్నో ఏళ్లుగా నియోజకవర్గ రాజకీయాల్లో వివిధ హోదాల్లో పనిచేయడం ద్వారా అన్ని గ్రామాల్లో విస్తృత పరిచయాలు ఉన్నాయి. ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులు, ఇక్కడి మౌలిక వసతులు, సమస్యలపై నాకు సంపూర్ణ అవగాహన ఉంది. ఇక నా ప్రత్యర్థి స్థానికుడు కాదు. ఎక్కడో కనిగిరి నుంచి తీసుకొచ్చి ఇక్కడ అభ్యర్థిగా పెట్టారు. కనిగిరి మా పొరుగు నియోజకవర్గమే కావడం వల్ల ఆయన వ్యవహారశైలి, అవినీతి వ్యవహారాలు ఇక్కడ ప్రజలకు బాగా తెలిసిపోయాయి. అక్కడి ప్రజలు తిరస్కరిస్తేనే ఇక్కడికి పంపారు. అలాంటి వ్యక్తి మనకు ఎలా న్యాయం చేస్తాడని ప్రజలే బహిరంగంగా చెబుతున్నారు. దీనికితోడు ఆయనకు ఈప్రాంత నాయకులతో కనీస పరిచయాలు కూడా లేకపోవడం వల్ల వాళ్ల పార్టీ కోసం కష్టపడ్డ వారినే గుర్తించలేకపోతున్నారు.

? అంటే.. కందుకూరులో మీ విజయం ఖాయమంటారు.

! నూటికి నూరుశాతం.. కేవలం విజయం కాదు.. మంచి మెజారిటీ సాధిస్తా. మా ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి కూడా ఊహించని ఆధిక్యత కందుకూరు నియోజకవర్గంలో వస్తోంది. ఆయన మంచితనం, సేవాకార్యక్రమాలు, ఆయన టీం క్షేత్రస్థాయిలో చేస్తున్న పని కూడా నా విజయంలో కీలకం అవుతోంది.

? గెలిచాక నియోజకవర్గ ప్రజలకు ఏం చేయబోతున్నారు

! కందుకూరు వ్యవసాయాధారిత ప్రాంతం. అందుకే సాగునీటి వసతులను మెరుగుపరచడం కోసం పనిచేస్తాను. సరైన సాగునీటి వసతి లేని వలేటివారిపాలెం మండలం, లింగసముద్రం మండలంలోని కొన్ని గ్రామాలకు సాగునీటి సమ స్య పరిష్కారానికి చర్యలు చేపడతా. ముఖ్యంగా రాళ్లపాడు ఎడమకాలువ పొడిగింపు పనులను పూర్తి చేయించగలిగితే చాలా గ్రామాలకు సమస్య తీరుతోంది. రాళ్లపాడు రిజర్వాయరుకు సోమశిల నుంచి 1.5 టీఎంసీల నీరు ప్రతిఏటా వచ్చేలా చూడడం ద్వారా మిగులు నీటిని తూములేరు ద్వారా వలేటివారిపాలెం మండలంలోని సాగునీటి చెరువులను నింపేందుకు చర్యలు చేపడతా. అలాగే రైతుల పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరల కల్పనపై దృష్టిపెడతా. కౌలు రైతులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత ఉందని గుర్తించా. పంటసాగు చేసి నష్టపోతున్నది కౌలు రైతు అయితే విపత్తుల సమయంలోనూ, ఇతరత్రా ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాల రూపంలోనూ అసలు వ్యవసాయమే చేయకుండా కౌలుకు ఇస్తున్న భూయజయాని లబ్ధిపొందుతున్నాడు. ఈ సమస్యకు పరిష్కారం కోసం తక్షణ చర్యలు చేపడతా.

? నియోజకవర్గ అభివృద్ధి కోసం మీ ప్రణాళికలు

! కందుకూరు నియోజకవర్గంలోని గుడ్లూరు, ఉలవపాడు మండలాలు పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో అనుకూలంగా ఉన్నందున ఈ ప్రాంతంలో పెద్దఎత్తున పరిశ్రమలు ఏర్పాటయ్యేలా కృషి చేసి పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతా. కందుకూరు, వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాలను వ్యవసాయరంగంలో పరిపుష్టం చేయడం ధ్యేయంగా ప్రణాళిక సిద్ధం చేసుకున్నా. ఈ మూడు మండలాల్లోనూ వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటయ్యేలా చూస్తా. ఉలవపాడు మామిడి రైతుకు గిట్టుబాటు ధరలు లభించేలా ఎగుమతుల ప్రోత్సాహానికి చర్యలు తీసుకుంటా.

? కందుకూరు పట్టణాభివృద్ధికి ఏం చేస్తారు

! ముఖ్యంగా శాంతిభద్రతలను కాపాడటమే నా ప్రథమ ప్రాధాన్యత. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇవ్వకుండా కఠినంగా వ్యవహరిస్తా. పట్టణానికి సుదూరంగా డంపింగ్ యార్డు ఏర్పాటయ్యేలా చూసి పట్టణ సుందరీకరణపై దృష్టిపెడతా. రాష్ట్రంలో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాను.

మా నాన్నను గెలిపించండి !

● కాకర్ల కోసం తనయ, తనయుడి ఇంటింటి ప్రచారం

జలదంకి, మే 7: మా నాన్నను గెలిపించాలని కోరుతూ ఉదయగిరి ఎన్డీఏ కూటమి అభ్యర్థి కాకర్ల సురేష్ కుమారుడు సంహిత్, కుమార్తె ధాత్రిలు మంగళవారం మండలంలోని బ్రాహ్మణక్రాక పంచాయతీ జువ్విచెట్టుపాలెంలో స్థానిక నాయకులతో కలసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. కూటమి మేనిఫెస్టో కరపత్రాలు ఓటర్లకు అందజేసి ఎమ్మెల్యేగా మానాన్న కాకర్ల సురేష్‌ను, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో సంహిత్ మిత్రుడు మాలేపాటి మానస్‌తేజ, స్థానిక కూటమి నేతలు గంగపట్ల మాలకొండయ్య, వల్లెపు ఏడుకొండలు, వంటేరు రాకేష్‌రెడ్డి, స్వర్ణ కొండపనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

లింగసముద్రం, మే 7 : రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని మండలంలోని పెదపవని గ్రామ పార్టీ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య, కందుకూరు నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ నాయబ్ రసూల్ కోరారు. మంగళవారం సాయంత్రం టీడీపీ నేతలు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ, చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు.ఈ సందర్భంగా నెల్లూరు ఎంపీ కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ




పెదపవనిలో సూపర్ సిక్స్ పథకాలు, మేనిఫెస్టోల గురించి వివరిస్తున్న టీడీపీ నేతలు

కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామిశెట్టి మాలకొండయ్య, రావెళ్ల మాలకొండయ్య, షేక్ రఫీ, సయ్యద్ రఫీ, షేక్ కాదర్ బాషా, గిన్నె కొండయ్య, పఠాన్ హిదయతుల్లా, టంకం హజరత్, షేక్ కరీముల్లా, షేక్ నాయబ్, షేక్ అహమ్మద్, జనసేన నాయకుడు షేక్ నాయబ్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా వలసలు : ఇంటూరి



కందుకూరు : ఇంటూరికి స్వాగతం పలుకుతున్న వైసీపీ శ్రేణులు



వలేటివారిపాలెం : పార్టీ కండువాలు వేస్తున్న నాగేశ్వరరావు

కందుకూరు, మే 7 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అవలంబిస్తున్న విధానాలు నచ్చక, ప్రభుత్వ ప్రజా వ్యతిరేకతతో టీడీపీలోకి వైసీపీ నుంచి బారీగా వలసలు జరుగుతున్నాయని కందుకూరు ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం మున్సిపాలిటి పరిధిలోని వెంకటాద్రిపాలెంలో జిల్లెలమూడి వెంకటేశ్వర్లు, మల్లికార్జున, కొండయ్య, వెంకటేశ్వర్లు, శ్రీను, మనోహర్, తదితరలుఉ బారీగా వైసీపీ నుంచి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అదేవిధంగా పట్టణంలోని 12వ వార్డులోని షేక్ కరంతుల్లా, షేక్ జిలాని, తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరందరికి ఇంటూరి పసుపు కండువాలు కప్పి స్వాగతం పలికారు. గుడ్లూరు మండలం మోచర్ల పంచాయతీ తెట్టు గ్రామంలో రిటైర్డ్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అలహరి బాలకృష్ణ, కే మల్లికార్జునరావు, తిరుమల, మం డే కృష్ణారావు, సాయితోపాటు మరికొందరు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి ఇంటూరి ఆహ్వానం పలికారు.

నూకవరంలో పలువురు టీడీపీలో చేరిక

వలేటివారిపాలెం : మండలంలోని నూకవరంలో నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో దాచర్ల కొండయ్య, దాచర్ల వెంకట్రావు ఆధ్వర్యంలో మంగళవారం పలు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పార్టీలోకి చేరిన వారికి ఇంటూరి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ కార్యకర్తలకు ఎప్పుడూ ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

ఉలవపాడు : మండలంలోని పలు గ్రామాల నుంచి వైసీపీని వీడి బారీగా టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి కందుకూరు నియోజకర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో కరేడు పంచాయతీ పరిధిలోని అలగాయపాలెం, పాతరెడ్డిపాలెం, కొత్త రెడ్డిపాలెంకు చెందిన కొమట్ల వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి స్వామిరెడ్డి, రమణారెడ్డి, కావూరి శివారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, పీ వెంకటరామిరెడ్డి, మహేష్, ఏడుకొండలు, గొట్టా రాము, మురళీకృష్ణలతోపాటు 70 మంది వైసీపీని వీడీ డీపీపీలో చేశారు. అదేవిధంగా వీరేపల్లి ఎస్టీకాలనీ, ఆత్మకూరు గ్రామాలకు చెందిన వైసీపీ కుటుంబాల వారు పార్టీలో చేరారు. ఆయా గ్రామాల్లో కొత్త, పాత టీడీపీ నేతలు సమన్వయంతో పనిచేసి తనని, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఇంటూరి కోరారు.



ఉలవపాడు : టీడీపీలో చేరిన ఎస్టీలతో ఇంటూరి

సౌజన్య ఇంటింటి ప్రచారం

వలేటివారిపాలెం: మండలంలోని అయ్యవారిపల్లె, చుండి, కాకర్లవారిపాలెం గ్రామాలలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు సతీమణి సౌజన్య మంగళవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు చూపించి తన భర్త నాగేశ్వరావును ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెరువుపల్లి మాల్యాద్రి, బద్దిపూడి శిఖామణి, చెరువుపల్లి సాంబశివరావు, అనిల్‌కుమార్, హనుమంతరావు, కామినేని మల్లికార్జున, ఇరపని లక్ష్మయ్య, గువ్వల నరసింహరావు మాల్యాద్రి, చొప్పర బ్రహ్మయ్య, ఇరపని కల్యాణ్, అనిల్, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా

● చౌదరిపాలెంలో కావ్య క్రిష్ణారెడ్డి ఇంటింటి ప్రచారం



కావలి రూరల్ : అవ్వా.. నీ ఓటు సైకిల్‌కే వేస్తావుగా.. కావ్య

కావలి రూరల్, మే 7: తనకు ఎమ్మెల్యేగా ఒక్క అవకాశమిస్తే కావలి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చౌదరిపాలెంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కావ్య క్రిష్ణారెడ్డికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. జలదంకి మండలం కమ్మపాలెంకు చెందిన గంటా సుబ్బానాయుడు ప్రత్యేక అలంకరణతో ఏర్పాటు చేసిన ఎడ్ల బండిపై కావ్య గ్రామంలో ప్రచార యాత్ర సాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పంచాయతీగా ఉన్న చౌదరిపాలెంను మున్సిపాలిటీలో కలిపారని, దాంతో ఉపాధి హామీ పనులు కూడా లేక గ్రామంలో పేదలైన ఎస్సీ, ఎస్టీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే రైతులు సాగు చేస్తున్న పొగాకు బ్యార్నీలకు కూడా పన్ను కట్టాల్సి వస్తుండటంతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని, టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే చౌదరిపాలెంను మున్సిపాల్టీలో నుంచి తొలగించి పంచాయతీగా ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామంలో మంచి నీటి చెరువుకు నీరు పెట్టేందుకు కాలువకు ప్రతిసారి కట్టలు వెయ్యాల్సి వస్తుందని, అలా కాకుండా చెక్‌డ్యాం ఏర్పాటు చెయ్యాలని గ్రామస్తులు కోరగా అందుకు ఆయన హామీ ఇచ్చారు. గ్రామంలోని భూములు ఎక్కువగా జలదంకి మండలంలోని జలదంకి, బ్రాహ్మణక్రాక రెవెన్యూ పరిధిలో ఉండడంతో ఇక్కడ రైతులకు పాస్‌బుక్‌లు కూడా రావడం లేదని, 1960 సంవత్సరం నాటి భూములకు కూడా పాస్‌బుక్‌లు లేవని రైతులు చెప్పారు. దీంతో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రెవెన్యూ గ్రామ సభలు పెట్టి పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పరిశీలకుడు కండ్లగుంట మధుబాబు నాయుడు, రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ, బొట్లగుంట శ్రీహరినాయుడు, స్థానిక టీడీపీ నాయకులు గోరంట్ల రాంబాబు, మండువ వాసు, పోకరి రాంబాబు, గొంది చందు, కోడెల క్రిష్ణ, ముప్పరాజు కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లు ఎమ్మెల్యేగా చేసిందేమిటి?

దగదర్తి(బిట్రగుంట) : ఐదేళ్లు ప్రతిపక్షంలో, మరో ఐదేళ్లు పాలక పక్షంలో ఎమ్మెల్యేగా ఉన్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలి నియోజక వర్గానికి ఏమి చేశాడని టీడీ పీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ప్రశ్నించారు. దగదర్తి మండలం రంగసంముద్రం పంచాయతీలోని ఐతంపాడు, కొత్తూరు, పాతూరు, మారెళ్లపాడు, మనుబోలుపాడు గ్రామాల్లో టీడీపీ రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రచారంలో కావలి కూటమి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డిలతో కలసి బీద రవిచంద్ర పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ ఐదు గ్రామాల రైతులకు ఆధారమైన ఉత్తరకాలువలో జిల్లాలో ఇరిగేషన్ మంత్రి ఉన్నా పిడికెడు పూడిక తీసిన పాపానా పోలేదన్నారు. సీఎంకు ఎంతో సన్నిహితుడనని చెబుతున్న ఎమ్మెల్యే దగదర్తి రైతుల కోసం చేసింది ఏముందని ప్రశ్నించారు. ఈ ఐదేళ్లలో ఆయన చేసింది ఏమైనా ఉందంటే కంటికి కనిపించిన చోట గ్రావెల్, మట్టి అక్రమంగా తవ్వుకుపోవడం, అడి గిన వారిపై తప్పుడు కేసులు పెట్టడం తప్ప మరొకటి లేదన్నారు. టీడీపీ ఉమ్మడి అభ్యర్థులు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కావలి అసెంబ్లీ దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి గెలిపించాలని కోరారు. రైతు పక్షపాతి చంద్రబాబునాయుడు సీఎం అయితే రైతుల జీవితాలు బాగుపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు అలహరి సుధాకర్, పమిడి రవికుమార్ చౌదరి, మాలేపాటి భానుచందర్ నాయుడు, సీవీ సత్యం పాల్గొన్నారు.



బిట్రగుంట: నువ్వే గెలవాలంటూ క్రిష్ణారెడ్డికి విజయతిలకం దిద్దుతున్న మహిళ



కావలి రూరల్ : చౌదరిపాలెంలో ప్రచారం చేస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి

పదవులు ఆశించకుండా అభివృద్ధికి కృషి చేశా

● ఐదేళ్ల వైసీపీ పాలనలో అంతా అవినీతి మయం ● యువత భవితకు చంద్రబాబు సీఎం కావలి : బీద

అల్లూరు, మే 7 : పదవులు ఆశించకుండా కావలి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని, ఐదేళ్ల వైసీపీ పాలనలో అంతా అవినీతిమయంగా మారిపోయిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. ఆయన స్వగ్రామమైన ఇస్కపల్లి పంచాయతీలోని శంభునిపాలెం, ఇస్లాంకాలనీ, అరుంధతీయవాడ, దళితవాడ ప్రాంతాల్లో మంగళవారం రాత్రి నెల్లూరు పార్లమెటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు బినీత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మేనల్లుడు ఎ.చరణ్‌రెడ్డిలతో కలసి ఆయన రోడ్‌షో నిర్వహించారు. ముందుగా శంభునిపాలెం గ్రామస్థులతో మాటామంతీ కలిపారు. అనంతరం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశానన్నారు. ఆ కృషి ఫలితమే ఈరోజుకీ దర్శనమిస్తున్నాయేతప్ప వైసీపీ పాలనలో ఒక్క రోడ్డు వేసిన పాపాన పోలేదన్నారు. యువత భవిష్యత్తు బాగుపడాలన్నా వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగాలన్నా రాష్ట్రంలో నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడ చూసినా అవినీతి, అరాచకాలు రాజ్యాన్నేలే విధంగా నూతన పాలనా విధానాన్ని రాష్ట్రానికి పరిచయం చేసిన వైసీపీని ప్రజలు ఛీదరించుకుంటున్నారన్నారు. డ్రామాలు, నాటకాలు ప్రజలు కనిపెట్టేశారని, ఇక అటువంటి వాటిని నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సీకే.హారూన్ రషీద్, పురిణి దేవరాజ్, నాటారు శీనయ్య, పుచ్చలపల్లి రవి, నాగరాజు, గాంధీ, వెంకట రమణయ్య, గంగపట్నం శీనయ్య, పుచ్చలపల్లి బాబు, పి.శీనయ్య తదితురులు పాల్గొన్నారు.



శంభునిపాలెంలో మాట్లాడుతున్న బీద రవిచంద్ర

విష్ణు వర్గీయులు టీడీపీలో చేరిక

అల్లూరు, మే 7 : రాజకీయ ఊహ తెలిసిన నాటి నుంచి మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డితో నడిచిన నాయకులు సోమవారం రాత్రి నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డిల సమక్షంలో టీడీపీలో చేరారు. విష్ణు అనుచరవర్గంలో ప్రధాన మైనార్టీ నాయకుడైన షేక్ ఇస్మాయిల్ టీడీపీలో చేరడం స్థానికంగా చర్చనియాంశమైంది. ఆయనతోపాటు షేక్ అబ్దుల్ సమద్, ఎండీ.రసూల్ బాషా, షేక్ కరిముల్లా, షేక్ రఫీ, షేక్ మహబూబ్ బాషా, ఆర్.నారాయణరావు, షేక్.ఆబిద్, షేక్ గౌసబాషా, షేక్ హఫీజ్, షేక్ ఖాసింసాహెబ్, షేక్ అబ్దుల్ ఖాదర్, అదేవిధంగా వినాయకనగర్‌లోని పల్లె కాపు సామాజికవర్గానికి చెందిన అప్పాడి సత్యనారాయణ, సతీష్, స్వాములు, గొల్లపోతు వెంకటేశ్వర్లులతోపాటు 15 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులు రెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, పావనబోయిన రత్తయ్య, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, యేలూరు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే అల్లూరు పట్టణ పరిధిలోని ఆర్‌డీఆర్ కాలనీకి చెందిన పలువురు మంగళవారం టీడీపీలో చేరారు. వీరితోపాటు పురిణి పంచాయతీ నల్లచెరువు కట్టకు చెందిన ప్రజలు టీడీపీలో చేరారు.



టీడీపీలో చేరిన విష్ణు వర్గీయులు

నిఘా నీడలో ఓటింగ్

- పోలింగ్ బూత్‌ల్లో సీసీ కెమెరాల ఏర్పాటు



మనో నేత్రం

ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేసేలా ఈసీ ఆదేశాలు ఇచ్చింది. దీంతో గ్రామాల్లో ఉన్న పోలింగ్ బూత్‌ల్లో మంగళవారం నుంచి సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల తెలంగాణలో ఎన్నికల సందర్భంగా తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈసీ ప్రతి పోలింగ్ బూత్‌లో రెండేసీ కెమెరాలు ఏర్పాటు చేయనుంది. ఒక కెమెరాను బూత్ బయట, మరో కెమెరాను బూత్ లోపల అమర్చుతున్నారు. కెమెరాలోనే మెమరీ, నెట్ సౌకర్యంతోపాటు రాత్రిళ్ల పనిచేసేలా లైట్లు కూడా అమర్చారు. మనుబోలు మండలంలో 42 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటితోపాటు సమస్యాత్మక గ్రామాల్లో కూడా వీటిని ఏర్పాటు చేసేలా 89 సీసీ కెమెరాలను అమర్చనున్నారు. అలాగే సర్వేపల్లి నియోజకవర్గంలో సుమారుగా 350 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు సాంకేతిక సిబ్బంది తెలిపారు.

\- మనుబోలు

రేపటి నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- ఎన్నికల దృష్ట్యా నిర్ణయం
- రైళ్లలో రిజర్వేషన్లు ఫుల్
- ఇప్పటికే చార్జీలు పెంచిన ప్రైవేట్ ట్రావెల్స్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 7: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు దూర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు జిల్లాకు తరలిరానున్నారు. పోలింగ్ తేదీ ఈనెల 13 సోమవారం రావడంతో ఎలాగో 12వతేదీ ఆదివారం సెలవు. ముందుగా 11వ తేదీ శనివారం రాత్రే వారంతా జిల్లాకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇక సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు శని, ఆదివారాలు సెలవు కావడంతో 10వతేదీ రాత్రే బయలుదేరేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇక ఓటేశాక 13వ తేదీ రాత్రి పలువురు తిరుగు ప్రయాణం అయ్యేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా ఇప్పటికే హైదరాబాదు, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే రైళ్లలో రిజర్వేషన్లు ఫుల్ కావడంతో ప్రజలు బస్సుల వైపు చూస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 9,10,11 తేదీల్లో హైదరాబాదు నుంచి జిల్లాకు వచ్చేందుకు రోజుకు ఐదు చొప్పున ప్రత్యేక బస్సులను ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. బెంగళూరు నుంచి రోజుకు నాలుగు చొప్పున ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ప్రత్యేక బస్సుల్లో రిజర్వేషన్ పూర్తిన వెంటనే అవసరాన్ని బట్టి ఎన్ని బస్సులు కావాలన్నా ఏర్పాటు చేస్తామని అధికారులు పేర్కొన్నారు. ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలనే వసూలు చేస్తున్నామన్నారు. ఇక ప్రైవేటు ట్రావెల్స్ వారు ఇప్పటికే అధిక చార్జీలతో టికెట్ ధరలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు.

బూత్ క్యాప్చరింగ్‌కు పాల్పడితే జైలు, జరిమానా



ఎన్నికల పోలింగ్ కేంద్రాలను స్వాధీనం చేసుకోవడం, అధికారులను బెదిరించి బ్యాలెట్ పేపర్లు, ఈవీఎంలు స్వాధీనం చేసుకోవడాన్ని బూత్ క్యాప్చరింగ్ అంటారు. ఈవీఎంలు ధ్వంసం చేయడం, విరగ్గొట్టడం, ఎన్నికల గుర్తుపై సీరా, నీళ్ల పోయడం వంటి చర్యలు ఇందులో భాగామే. పోలింగ్ కేంద్రంలో ఓటర్లను భయపెట్టడం, పోలింగ్‌ను అడ్డుకోవడం నేరం. పోలింగ్ సిబ్బంది ఇలాంటి చర్యలు పాల్ప డితే ఐపీఎస్ 1951 సెక్షన్ 135ఏ 136 ప్రకారం మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్షతోపాటు జరిమానా విధించే అవకాశ ముంది. ఇతరులు అయితే ఏడాది నుంచి మూడేళ్ల వరకు జైలుశిక్ష విధిస్తారు.

\- ఉదయగిరి


నిజాయితీ గల నేతకే ఓటేస్తా..

యువగళం



ఈ ఎన్నికల్లో నేను మొట్టమొదటి సారిగా ఓటు వేయబోతున్నా. ప్రతి ఓటూ విలువైనదే. ప్రధానంగా యువత ఓటు హక్కు వినియోగించుకోవడంలో నిర్లక్ష్యం చూపడం వల్లే అవినీతి నాయకులు ఎన్నికల్లో గెలుస్తున్నారు. అందుకే అవినీతికి తావులేని నాయకుడికి ఓటు వేసి, నా మొదటి ఓటును సద్వినియోగం చేసుకుంటా.

\-జే చౌడయ్య, సంగం



రొయ్యకూ

బాదుడే!

అక్వా రంగంలో రాష్ట్రానికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. దేశంలో చేపట్టే అక్వా ఎగుమతుల్లో ఆంధ్రా నుంచే 65 శాతం జరుగుతుంటాయని సెంట్రల్ కోస్టల్ అక్వా అథారిటీ పేర్కొంది. అయితే... ఇదంతా ఐదేళ్ల క్రితం మాట.

నేడు...

జగన్ ప్రభుత్వం విధానాల వల్ల ఆక్వా రంగం కుదేలైంది. ఐదేళ్ల క్రితం జిల్లాలో 50 వేల ఎకరాల్లో చేపట్టిన రొయ్యల పెంపకం నేడు 20 వేల ఎకరాల్లో కూడా లేదు. ఇందుకు సాగుకు పెరిగిన వ్యయం... తగ్గిన ఆదాయమే కారణమని రైతులు అంటున్నారు. దీనికితోడు విద్యుత్ చార్జీల రాయితీని ప్రభుత్వం ఎత్తేసింది. అంతేకాక రొయ్యల గుంటల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని నిబంధనలు పెట్టింది.

మోసం గురూ!

- భారీగా విద్యుత్ చార్జీల పెంపు
- రాయితీలకూ మంగళం
- పెరిగిన సాగు వ్యయం... తగ్గుతున్న ఆదాయం
- పెంపకం చేపట్టలేమంటున్న సాగుదారులు
- ప్రోత్సాహమివ్వని వైసీపీ సర్కారు

అల్లూరు, మే 7 : ఎకరా వెనామీ సాగు చేపట్టాలంటే 100 కౌంట్ వస్తేగానీ దిగుబడి వచ్చినట్టు కాదు. 100 కౌంట్ ధర కిలో రూ.210 ఉండడంతో ఎకరానికి అయ్యే వ్యయం మాత్రం రూ.2.50 లక్షలు అవుతోంది. ఇందులో రొయ్య పిల్లల ధర రూ.80 వేలు కాగా, అవి తినే మేత 2 నుంచి 3 టన్నులు ఉంటుంది. మేతకు రూ.2 లక్షలకు పైగా ఖర్చవుతోంది. ఇలా చూసుకుంటే రొయ్యల ధరలు పతనమ య్యాయని చెప్పుకోవచ్చు. ఐదేళ్ల క్రితం ధరలు నియంత్రణలో ఉండడంతో రైతులకు కిలోకు రూ.20 నుంచి రూ.30లు మిగులుతూ ఉండేది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

పెరిగిన విద్యుత్ చార్జీలు

ఆక్వా రంగానికి ప్రధానవసతి విద్యుత్. ఇది ఖర్చుతో కూడుకున్నది. గతంలో యూనిట్‌కు రూ.2 ఉండగా, ప్రస్తుతం రెండు గ్రేడ్లుగా విభజించి ఆక్వా జోన్‌కు రూ.4.20, నాన్ ఆక్వా జోన్‌కు రూ.6.50 చెల్లించాల్సి వస్తున్నదని దీంతో రైతులపై చార్జీల భారం పడింది. టీడీపీ ప్రభుత్వం హయాంలో చార్జీలపై రాయితీ ఉండేది. జగన్ ప్రభుత్వం దాన్ని ఎత్తేసింది.

సబ్సిడీలేవీ ?

రాష్ట్రంలో 2019కు ముందు ఆక్వా రైతులకు పూర్తిగా ప్రభుత్వ సహకారం ఉండేది. ఇన్‌పుట్ సబ్సిడీలు 50 శాతానికి పైగా ఉండేవి. ఎంపెడా అధికార సీఈఈ ధ్రువీకరణ పత్రం ఉన్న ఆక్వా రైతుకు ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా ఏరియేటర్లు, మోటార్లు 50 శాతం రాయితీతో ఇచ్చేవారు.దీంతో వారికి భారం తగ్గేది. అంతేకాక రుణాలు మంజూరు చేసేవారు. అయితే జగన్ ప్రభుత్వం ఏ ఒక్క విషయంలో కూడా ఆక్వా రైతులను ఆదుకున్న పాపాన పోలేదు. దీనికితోడు గుంటలను ఏర్పాటు చేయాలంటేనే లైసెన్సు ఉండాలంటూ నిబంధనలు పెట్టింది. ఇందుకు ఫిషరీస్ అసిస్టెంట్లను ఏర్పాటు చేసి రైతుల నుంచి ఫీజుల రూపంలో వసూలు చేసి, వారికి ధ్రువీకరణ పత్రం అందచేస్తున్నది.

లీజుదారుల పరిస్థితి దయనీయం

ఆక్వా సాగు సాధారణంగా భూమి కలిగిన రైతుకే పెనుభారంగా మారగా, ఇక లీజుదారుల పరిస్థితి వర్ణనాతీతమే. లీజు మొత్తం ముందుగానే రైతులకు చెల్లించి రొయ్యల సాగు చేపట్టాల్సిన పరిస్థితి. ఎకరానికి 100 కౌంట్ రొయ్యల పెంపకం చేపట్టాలంటే రూ.2.5 లక్షలు ఖర్చవుతుండగా, లీజు దారులకు మాత్రం రూ.2.70 నుంచి రూ.3 లక్షల వరకు వ్యయం అవుతోంది. దీన్ని భరించి సాగు చేపట్టాలంటే భారంగా మారింది.

సాగుకు భారీ వ్యయం

ఆక్వా సాగులో 80 శాతం ఖర్చుపెడితే 20 శాతం ఆదాయం వచ్చేది. కానీ 2019 తరువాత నుంచి వ్యయం పెరిగింది. ఆదాయం తగ్గుముఖం పట్టడంతో 20 శాతం మిగలకపోగా, 25 శాతం అదనంగా చేతి నుంచి పెట్టాల్సి వస్తోంది. ఈ కారణంగా రొయ్యల సాగులో తీవ్రంగా నష్టపోయా.

\- నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, ఆక్వా రైతు





ఏమన్నా మిగులుతుందే మోననే...

పదేళ్లుగా రొయ్యల పెంపకం చేపడుతున్నా. 2019కు ముందు ఆక్వా రంగం ఆశాజనకంగా ఉండేది. నాలుగు రాళ్ల వెనకేసుకున్నా. 2019 తరువాత నుంచి వ్యయం భారీగా పెరిగిపోయింది. దీంతో ఐదేళ్లుగా తీవ్రంగా నష్టపోయాను. ఈ దఫా ఏమన్నా మిగులుతుందే మోననే ఆశతో సాగు చేపడుతున్నా.

\- కత్తుల విజయ్‌కుమార్, ఆక్వా రైతు



మేత ఖర్చులు భరించలేకున్నాం...

గతంతో పోల్చితే రొయ్యల మేతల ధరలు తారస్థాయికి చేరుకున్నాయి. మేత అరువుకు తెచ్చుకోవాలంటే దిగుబడి అయిన రొయ్యలను వారు అడిగిన ధరకు వారికే విక్రయించాలి. తద్వారా ధరలో తగ్గుదల మేత ఖర్చులో పెరుగుదల కలిసి ఖర్చులకు సరిపోవడం లేదు.

\- పాలెపు చిరంజీవి బాబు, ఆక్వా రైతు



కందువాలకు గిరాకీ !

వింజమూరులో వైసీపీ కార్యకర్తలకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)

ప్రస్తుతం కండువాలకున్న గిరాకీ అంతాఇంతా కాదు. ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీల కండువాలకు పెద్దఎత్తున డిమాండ్ ఉంది. ఈ మేరకు ఆయా పార్టీల నేతలు లక్షల్లో కండువాలను కొనుగోలు చేస్తున్నారు. ఏ చోటకు వెళ్లినా పెద్ద ఎత్తున కండువాలను తీసుకెళ్లి ఇతర పార్టీల నేతలను తమ పార్టీలో చేర్చుకునే సమయంలోనూ వారికి వేస్తున్నారు. అలాగే ప్రచార ర్యాలీలు, బహిరంగసభలు, రోడ్‌షోలు నిర్వహించేటప్పుడు కూడా కార్యకర్తలు కండువాలు వేసుకుని పాల్గొంటున్నారు. ఎన్నికల ప్రధాన సామగ్రిగా కండువాలు పెట్టుకుని ఆయా పార్టీలు ముందుకు సాగుతున్నాయి. ఈ కండువాలు ప్రస్తు తం నాణ్యతను బట్టి రూ.30 నుంచి రూ.100లు పలుకుతున్నట్లు సమాచారం. దీంతో ఒక్కో అభ్యర్థికి కండువాలకే రూ.50 లక్షల వరకు ఖర్చవుతున్నట్లు సమాచారం.

\- ఉదయగిరి రూరల్

చేపా.. చేపా... ఎక్కడ ?

- నిషేధిత అలివి వలలతో వేట
- సోమశిలలో అంతరిస్తోన్న మత్స్యసంపద
- ఉత్పత్తిపై దృష్టిపెట్టని ప్రభుత్వం
- వేట లేక జాలర్ల ఇక్కట్లు



సోమశిల జలాశయంలో అడుగంటిన నీటిమట్టం

అనంతసాగరం, మే 7: అపార మత్స్యసంపదకు నిలయంగా ఉన్న సోమశిల జలాశయంలో నేడు చేపల జాడే కనిపించడం లేదు. దీంతో డ్యామ్‌పై ఆధారపడి జీవిస్తున్న జాలర్ల జీవనం అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుత జలాశయం నీటిమట్టం అడుగంటి 8 టీఎంసీలకు పడిపోయింది. ఈక్రమంలో ఆశాజనకంగా చేపలవేట ఉండాలి. అయితే జలాశయంలో వేటకు వెళ్లిన జాలర్లకు చేప దొరకడం లేదు. ఈ పరిస్థితి వారిని ఆందోళనకు గురిచేస్తున్నది. జలాశయం పరిధిలో సుమారు 400 మంది లైసెన్సు కలిగిన జాలర్లు ఉన్నారు. వీరంతా రోజువారీ వేటకు వెళ్లి రూ.500 నుంచి రూ.1500 వరకు సంపాదించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొన్ని రోజులుగా వేట సాగక జాలర్ల ఆందోళన చెందుతున్నారు.

- ప్రధాన కారణాలు ఇవే..

స్థానికంగా కొంతమంది వ్యాపారులు మాఫియాగా ఏర్పడి నిషేధిత అలివి వలలతో వేట సాగిస్తున్నారు. చిన్నాపెద్దా చేపలను ఒడ్డుకు లాగేసి చేపల ఉత్పత్తికి గండి కొడుతున్నారు. ఈ నేపథ్యంలో చేపల సంతానం తగ్గి వేటసాగని పరిస్థితి దాపురించింది. ఈ మత్స్య మాఫియాపై చర్యలు తీసుకోవాలని స్థానికులు గతంలో ఉన్నతాధికారులకు జాలర్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు.

- పెంపకంపై శ్రద్ధ చూపని ప్రభుత్వం

ఇదిలా ఉండగా చేపల ఉత్పత్తి పెంచేలా వైసీపీ ప్రభుత్వం శ్రద్ధ చూపలేదు. గత టీడీపీ హయాంలో మీనోత్సవంలో భాగంగా వివిధ ప్రాంతాల్లో లభించే మూస, ఎర్రగండి, నల్లగండి చేపపిల్లను తెచ్చి జలాశయంలో వదిలేవారు. మత్స్యకారుల జీవనప్రమాణాలు మెరుగుపరిచేలా చర్యలు తీసుకునేవారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఆదిశగా అడుగులు వేయడం లేదు. ఈ నాలుగేళ్లలో ఒక్కసారి కూడా జలాశయంలో చేపపిల్లలను వదిలిన దాఖ లాలు లేవు. ఈకారణాలతో నేడు డ్యామ్‌లో చేపల ఉత్పత్తి తగ్గి, వేట జరగని దుస్థితి నెలకొన్నదని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో బాగా వేట జరిగితే సుమారు 10 టన్నుల చేపలు సోమశిల నుంచి కోల్‌కతా, చైన్నె, పూణే లకు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం రెండు టన్నుల కూడా ఎగుమతి కావడం లేదు.

అలివి వలల వల్లే ఈ పరిస్థితి



జలాశయంలో నిషేధిత అలివి వలల వేట వల్లే నేడు ఉత్పత్తి తగ్గి వేట సాగడం లేదు. ఈ అక్రమ వేటను అడ్డుకొని ఉంటే ఈపరిస్థితి ఉండేది కాదు.

\- వై సుబ్బారావు, జాలరి సోమశిల

నీరు తగ్గినా చేప దొరకడం లేదు..




జలాశయం నీటి మట్టం పూర్తిగా తగ్గింది. ప్రస్తుత పరిస్థితుల్లో వలకు చేపలు దండిగా పడాలి. అయితే జలాశయంలో వేటకు వెళితే శ్రమ తప్ప ఎలాంటి ఫలితం లేకుండా ఉంది.

\- ప్రసన్నకుమార్, మత్స్యకారుడు, సోమశిల

ఖాళీ లేదు.. బ్రదర్ !

ఎట్టెట్టా



పో.. పోవయ్యా... ఎన్నికలయ్యేదాకా ఈ నాల్రోజులు కుదరంటే కుదరదు !

ఏం తమ్ముడూ... రేపు పనుంది వస్తావా... ? అని అడిగితే ఎవరూ ముందుకు రావడంలేదు. ఖాళీలేదు బ్రదర్ .. వారం రోజుల వరకు అడగొద్దు... మాకూ పని ఉంది... అనే మాటలు ప్రస్తుతం గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ వినిపిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో కూలీలంతా బిజీ అయిపోయారు. ఎన్నికల వేళ వారికి చేతినిండా పని దొరికింది. ప్రచారంలో తిరుగుతూ రోజుకూలి సంపాదించుకుం టున్నారు. పనికెళితే ఏం వస్తుంది...? ఎండలో మాడిపోవడం తప్ప.. అనుకుంటూ ప్రచారానికి వెళుతున్నారు. రోజూ రూ.500, మద్యం సీసా ఇచ్చి, భోజనం కూడా పెడుతున్నారు. ఎండలకు కార్యకర్తలు ఎవరూ పెద్దగా రాకపోవడంతో ఇలా కూలీలను తీసుకువెళుతున్నారు. వీరే ఓ ఊరిలో ఓ పార్టీలో.. మరో ఊరిలో మరో పార్టీలో కనిపిస్తుండడంతో ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు.

\- ఉదయగిరి

మాటకు కట్టుబడేవారు..



నా జ్ఞాపకాలు

గతంలో ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేసేవారు. ఇప్పటి ఎన్నికల్లో మాదిరిగా భయాలు, ఆందోళనలు ఉండేవికావు. నాయకులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండేవారు. గ్రామంలోని ఓ నాయకుడి వెంటే అందరూ నడిచేవాళ్లు. ఇప్పటి లాగా పార్టీల ఫిరాయింపులు ఉండేవికావు. గతంలో ఓటు వేసేందుకు ఐదారు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లేవాళ్లం. అప్పుడు అభ్యర్థులు చేసిన, చేయబోతున్న పనులు చెప్పేవారు కాదు. ఇప్పుడు నేతలంతా అది చేస్తాం.. ఇది చేస్తాం.. అని గొప్పలు చెప్పుకుంటున్నారు.

\- ఎం. సుబ్బయ్య, (90), జంగాలకండ్రిక, సంగం మండలం

ప్రచారాల హోరు.. నాయకుల జోరు !

నోటి ముందు

ఓవైపు ఎండలు మండుతున్నాయి. మరోవైపు ఎన్నికల వేడి ప్రజలకు ఊపిరాడనివ్వడంలేదు. ఉదయం ఓ పార్టీ అభ్యర్థి, సాయంత్రం మరో పార్టీ అభ్యర్థి.. ఇలా ఒకరి వెంట మరొకరు ప్రచారానికి వస్తుండడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. దీనికితోడు రోజంతా ప్రచార రథాల మైకుల హోరుతో చెవులు చిల్లులు పడుతున్నాయి. చిన్న చిన్న గ్రామాలకు ఉదయం పూట, పెద్ద గ్రామాలకు సాయంత్రం వేళలో నేతలు ప్రచారానికి వస్తున్నారు. కందుకూరు నియోజకవర్గానికి అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ఇద్దరూ కొత్తవారే అయినా, తమకు ఓ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఇక ఆయా గ్రామాలకు వెళ్లినప్పుడు స్థానికంగా ఉన్న ఆలయాలకు వెళ్లి అభ్యర్థులు పూజలు చేస్తున్నారు. చర్చిలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. అలాగే ఓవైపు మేనిఫెస్టో అంశాలను ప్రస్తావి స్తూనే...మరో వైపు స్థానిక సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తున్నారు. మొత్తానికి గ్రామాల్లో రాజకీయ సందడి జోరుగా కనిపిస్తోంది.

\- వలేటివారిపాలెం

